అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 14-01-2023 సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 8 | సంచిక : 321 | Published from Karimnagar , Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

రాజ్యాంగమే సర్వోన్నతం

ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు తగవు : ఏచూరి



న్యూఢిల్లీ : భారత రాజ్యాంగమే అన్నిటికీ సర్వోన్నతమైనదని సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వ్యక్తి అదే రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలనే సవాలు చేయడం ఉపరాష్ట్రపతి కార్యాలయానికి తగదని ఆయన హితవు పలికారు. అఖిల భారత ప్రిసైడింగ్ ఆఫీసర్స్ సమావేశంలో ఉపరాష్ట్రపతి జగదీశ్ ధన్కర్ మాట్లాడుతూ పార్లమెంటే సర్వోన్నతమైనదంటూ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో సీతారాం ఏచూరి తన అభిప్రాయాన్ని పోస్టు చేశారు. భారత రాజ్యాంగమే పార్లమెంటును ఏర్పాటు చేసిందని ఆయన గుర్తు చేశారు. కార్యానిర్వాహక విభాగం (ప్రభుత్వం), శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఇలా అన్ని విభాగాలూ తమ అధికారాలను, విధులను రాజ్యాంగం ద్వారానే పొందాయని తెలిపారు. అంతే కానీ వాటికి ఇంకెక్కడి నుంచో అధికారాలు దఖలు పడలేదన్నారు. రాజ్యాంగమే సర్వోన్నతమైనదని ఆయన స్పష్టం చేశారు. సంఖ్యా బలం ఉన్నంత మాత్రన ఏ ప్రభుత్వం కూడా మన గణతంత్ర వ్యవస్థలోని ఈ ప్రాథమిక నిర్మాణాన్ని తక్కువ చేయజాలవని ఏచూరి పేర్కొన్నారు. ఇలాంటి ఘటనల నుంచి మనల్ని కాపాడుతూ వస్తున్నది ఈ 'ప్రాథమిక నిర్మాణ సూత్రమే'నని తెలిపారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టిన గౌరవనీయులైన ఉపరాష్ట్రపతి ఇప్పుడు అదే రాజ్యాంగ 'సర్వోన్నత'ను ప్రశ్నించేలా వ్యాఖ్యలు చేయడం భావి తరాలకు తప్పుడు సంకేతాలను ఇస్తుందని ఏచూరి అన్నారు.

భారత సార్వభౌమాధికారాన్ని కూడా రాజ్యాంగం ప్రజలకే అప్పగించిందని తెలిపారు. అందుకనే మన రాజ్యాంగం 'భారత ప్రజలమైన మేము..' అని ప్రారంభమౌతుందని ఆయన గుర్తు చేశారు. ఈ సర్వోన్నతమైన అధికారాన్ని 'రాజ్యం'లోని ఏ విభాగమూ భర్తీ చేయలేదని ఏచూరి పేర్కొన్నారు. ఐదేండ్లకు ఒకసారి తమ ప్రతినిధులను తాత్కాలికంగా ఎన్నుకునేందుకు ప్రజలు తమకు లభించిన ఈ సార్వభౌమాధికారాన్ని వినియోగిస్తారని తెలిపారు. శాసనకర్తలు తమకుతాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటారని తెలిపారు. కార్యనిర్వాహక వ్యవస్థ (ప్రభుత్వం) ...5లో


డేటాపై ముసుగు

కీలకమైన 20 సర్వేల్లో 12 సర్వేల విడుదల ఆలస్యం



- 2021 జనాభా లెక్కలు, పేదరికం, కుటుంబ వ్యయం.. అన్నింటా కాలయాపన
- విద్య, వైద్యం, నేరాల.. డేటా కీలకం : నిపుణులు 2లో..





బడిగోస...

ప్రభుత్వ స్కూళ్లల్లో గాడిన పడని చదువులు..అయోమయంలో విద్యార్థులు

కరోనా మహమ్మారి ప్రభావంతో నష్టపోయినవాటిలో విద్యా రంగమూ ఒకటి. వైరస్ కట్టడిలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లన్నీ దాదాపు ఏడాది పాటు మూతపడ్డాయి. దీంతో ఆన్‌లైన్ విద్య దేశంలో ఆవశ్యమైంది. అయితే, సౌకర్యాలు లేకపోవడంతో ప్రభుత్వ స్కూళ్లలో చదివే పేద విద్యార్థులు విద్యాపరంగా నష్టపోయారని నిపుణులు చెప్పారు. కానీ, స్కూళ్లు తిరిగి ప్రారంభమైన తర్వాత చదవడం, రాయడం వంటి విషయాల్లో వారు ఇప్పటికీ ఇబ్బందులనే ఎదుర్కొంటున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పారు. వీరి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని విద్యా నిపుణులు సూచించారు.

- కోవిడ్ కాలంలో నష్టపోయిన విద్యా సంవత్సరం
- చదవడం.. రాయడం.. నేర్చుకోవడానికి ఇప్పటికీ తంటాలు

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల్లో ఒకటిగా భావింపబడుతున్న లాక్‌డౌన్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు శాపంగా మారింది. ప్రయివేటు, కార్పొరేటు స్కూళ్లల్లో చదివే సంపన్న విద్యార్థులు ఆన్‌లైన్ విద్యకు కావాల్సినటువంటి మౌలిక సదుపాయాలను కలిగి ఉండటంతో విద్యా సంవత్సరాన్ని సాఫీగా సాగించారు. ఇంటి వద్దే ఉండి కావాల్సినటువంటి జ్ఞానాన్ని సముపార్జించారు. అయితే, ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థుల పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నది. ఆన్‌లైన్ విద్యకు కనీస సదుపాయాలు లేకపోవడం, ఒకవేళ ఉన్నా.. అవి అరకొరగానే ఉండటంతో ఈ బడుల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని తీవ్రంగా నష్టపోయారని నిపుణులు చెప్పారు.

కనీసం చదవడం, రాయడమూ రాక.. ఇబ్బందులకు గురయ్యారన్నారు. దాదాపు ఏడాది తర్వాత తిరిగి పాఠశాలలు తెరుచుకున్నాక ఆన్‌లైన్ క్లాసుల్లో చెప్పిన అంశాలను తిరిగి నేర్చుకోవడం చేశారు. చదవడం, రాయడం విషయాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపారు. అయితే, ఈ పరిస్థితి ...5లో

బీజేపీది దుష్ట రాజకీయం

తెలంగాణలోనూ అదే తీరు

- బీజేపీ వ్యతిరేక శక్తులతో సీపీఐ(ఎం) కలిసి పోరాటం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ - భువనగిరి

దేశంలో బీజేపీది దుష్ట రాజకీయం చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని రహదారి బంగ్లాలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో రాజకీయాలు శరవేగంగా సాగుతున్నాయన్నారు. బీజేపీ తెలంగాణలో పాగా వేయడం కోసం ప్రలోభాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి ఎవరొచ్చినా చేర్చుకుంటామనడం బీజేపీ రాజకీయ వ్యభిచారానికి నిదర్శనమన్నారు. ఖమ్మంలో ఓ ప్రధాన నాయకున్ని బీజేపీలో చేర్చుకునేందుకు ఆ పార్టీ సిద్ధమైందన్నారు. అందుకు ఈటల రాజేందర్‌తో ప్రత్యేక కమిటీ వేసిందన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ దాడులంటూ బెదిరింపులకు పాల్పడుతూ.. మరోవైపు కోట్లాది రుపాయలతో నాయకులను అంగట్లో ...5లో

సమాజ మార్పునకు టీచర్లే నాంది

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్...





మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

- పదోన్నతులు, బదిలీలపై సీఎం ప్రత్యేక దృష్టి
- యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలో విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- టీచర్లు సామాజిక సంస్కరణ వాదులుగా ఉండాలి : కేరళ మాజీ మంత్రి కెకె శైలజా టీచర్
- పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలంటూ సూచన
- ఐక్య పోరాటాలతోనే హక్కుల పరిరక్షణ
- నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి
- స్ఫూర్తిదాయకంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

వివరాలు 2లో..

ఘనంగా ప్రారంభమైన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభ



వివరాలు 2లో



31 నుంచి పార్లమెంట్

ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

వివరాలు 5లో..




బీజేపీ నెంబర్ వన్ దోషి..

మోడీ సర్కార్‌పై ఇక సమరమే..

- డబులింజన్ సర్కార్‌లో సమస్యల పరిష్కారమనేది బూటకం
- ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఇంకెన్ని రోజులు మోసం?:మందకృష్ణ

5లో..



చూద్దాం...చేద్దాం..

వీఆర్‌ఏల సమస్యను సాగదీస్తున్న రాష్ట్ర సర్కారు

- ప్రగతిభవన్‌కు పిలిచారు.. కూర్చోబెట్టి పంపారు
- న్యాయం చేస్తామంటూనే తాత్సారం
- ఈ సీఎస్ అయినా చొరవ చూపేనా.. సీఎం పరిష్కరించేనా..?
- కోటి ఆశలతో వీఆర్‌ఏల ఎదురుచూపులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీఆర్‌ఏల నిరీక్షణ ఇంకా కొనసాగుతూనే ఉంది. చేద్దాం..చూద్దాం.. అంటూ నాలుగైదు నెలలుగా రాష్ట్ర సర్కారు తాత్సారం చేస్తూ సమస్యను తేగేదాక సాగదీస్తూనే ఉంది. మంత్రి కేటీఆర్ ఇప్పటిదాకా నాలుగు సార్లు చర్చలు జరిపారు...'మీ డిమాండ్లన్నీ న్యాయమైనవే..సీఎం సార్ సానుకూలంగా ఉన్నారు' అంటూనే కాలం వెల్లదీస్తున్నారు. మరోమారు హరీశ్‌రావు కూడా పిలిచి మాట్లాడినా ప్చ్. నిష్ప్రయోజనం. ప్రగతిభవన్ నుంచి పిలుపొస్తే ఇగ తమ సమస్య పరిష్కారం అయినట్టే అని వీఆర్‌ఏలు మురిసిపోయారు. ప్రగతిభవన్‌లో పొద్దస్తమానం కూర్చోబెట్టి..ఇన్ని చాయ్‌నీళ్లు పోసి...బుక్కెడు బువ్వపెట్టి...పంపించేయటంతో వారి మురిపెం ఒక్క రోజు ముచ్చటగానే మారిపోయింది. కొత్తగా వచ్చిన సీఎస్ అయినా తమ సమస్యకు ఫుల్‌స్టాప్ పెడతారేమోనన్న కొండంత ఆశతో ఆమెనూ కలిశారు. సానుకూలంగా మాట్లాడిన ఆమె అయినా చొరవ చూపి...సీఎం సార్‌ని మెప్పించి సమస్య పరిష్కరిస్తుందా? అట్లాగే సాగదీస్తుందా? అనేది కాలగమనంలో తెలియాల్సిందే. రాష్ట్ర సర్కారు వీర్‌ఏల ఓపికకు ఇంకెంత కాలం పరీక్ష పెడుతున్నది చూడాల్సిందే.

రాష్ట్రంలో 24 వేలకుపైగా వీఆర్‌ఏలున్నారు. వీరిలో నూటికి 95 శాతానికిపైగా ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల వారే ఎక్కువగా ఉన్నారు. వారి చేతికొచ్చేది అరకొర వేతనాలే. అదీ చిక్కుముడులతో కూడిన కొలువే. తుమ్మితే ఉంటుందో..ఊడుతుందో తెలియని ఉద్యోగం. అలాంటి సమయంలోనే పర్మినెంట్ చేస్తామన్న సీఎం కేసీఆర్ ప్రకటన వారిలో ఆశలు రేపింది. అర్హులందరికీ ప్రమోషన్లు, పేస్కేలు, వారసత్వ ఉద్యోగాలు వస్తాయని సంబురపడ్డారు. కండ్లల్లో కాయలు కాచేలా ఎదురుచూసినా సీఎం చెప్పిన హామీ నోటికే పరిమితమైంది తప్ప ఆచరణలో గడప దాటలేదు. విధిలేని పరిస్థితుల్లో వీఆర్‌ఏలు సమ్మెలోకి వెళ్లారు. 80 రోజుల పాటు ఒకేమాట మీద కట్టుబడి ఐక్యతతో ముందుకుసాగారు. సర్కారు స్పందించకపోవడంతో గతేడాది సెప్టెంబర్ 13న చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. సద్దిమూటలతో ఎవరికివారు తరలొచ్చి వేలాదిగా పోగవ్వటంతో సర్కారు సైతం ఖిన్నురాలైపోయింది. అసెంబ్లీ సమావేశాలుండటంతో సమస్య తీవ్రం కాకుండా జేఏసీ బృందాన్ని మంత్రి కేటీఆర్ అసెంబ్లీకి పిలుపించుకున్నారు. 'వీఆర్‌ఏల డిమాండ్లు న్యాయమైనవి. సానుకూలంగా ఉన్నాం. చనిపోతున్న వీఆర్‌ఏలందరూ తెలంగాణ ...5లో

మా హామీలను నెరవేర్చండి

సీఎస్‌కు వినతిపత్రం ఇచ్చిన వీఆర్‌ఏ జేఏసీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తమకిచ్చిన హామీలను నెరవేర్చాలని వీఆర్‌ఏ జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని వీఆర్‌ఏ జేఏసీ ...5లో

సమాజ మార్పునకు టీచర్లే నాంది..



నాగటి నారాయణ నగర్
(మన్నెగూడ)నుంచి బొల్లె జగదీశ్వర్

సమాజంలో మార్పు తెచ్చే శక్తి ఉపాధ్యాయులకే ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. అందుకు వారు నాంది పలకాలని ఆమె పిలుపునిచ్చారు. విలువలతో కూడిన విద్యనందించటం ద్వారా విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి త్వరలోనే అనుమతిస్తామనీ, వాటిని భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని హామీనిచ్చారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఈ అంశంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలన్నింటికీ ఈ యేడాది పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ఐదో మహాసభలు శుక్రవారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో స్ఫూర్తిదాయకంగా ప్రారంభమయ్యాయి. తొలుత రాగన్నగూడలోని జెడ్పీహెచ్ఎస్ నుంచి మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ సెంటర్ వరకు ఉపాధ్యాయులు మహా ప్రదర్శనను నిర్వహించారు. మహిళా టీచర్లు ప్రత్యేక డ్రెస్‌కోడ్‌తో హాజరు కావటంతో ర్యాలీ అత్యంత ఆకర్షణయంగా కొనసాగింది. సీపీఎస్‌ను రద్దు చేయాలి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి, ఎన్ఈపీ-2020ని రద్దు చేయాలి, ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలి. పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించాలి' అంటూ ఉపాధ్యాయులు ఈ సందర్భంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జాతీయ పతాకాన్ని టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎన్ పురుషోత్తంరావు, ఎస్టీఎఫ్ఐ పతాకాన్ని సీనియర్ నాయకులు ఆర్ నర్సింహాచారి, టీఎస్‌యూటీఎఫ్ పతాకాన్ని పి మాణిక్‌రెడ్డి ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపానికి పూలమాలలేసి నివాళు లర్పించారు.

అనంతరం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభకు సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేరళ ప్రభుత్వ విప్, ఆ రాష్ట్ర మాజీ ఆరోగ్యశాఖ మంత్రి కెకె శైలజా టీచర్ ప్రారంభోపన్యాసం చేశారు. శాసనమండలి సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు కూడా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... టీఎస్‌యూటీఎఫ్ నాయకులు చెప్పే అంశాల్లో బాధ్యతలతోపాటు డిమాండ్లు కూడా ఉంటాయని చెప్పారు. కరోనా సమయంలో సంక్షోభంలో ఉన్న విద్యా వ్యవస్థను కాపాడటంలో ఉపాధ్యాయుల కృషి ప్రత్యేకమైందని అన్నారు. టీవీలు, డిజిటల్ విధానంలో బోధనకు సహకరించటం ద్వారా ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు నష్టపోకుండా వారు చూశారని వివరించారు. రాష్ట్రంలోని ఉద్యోగుల్లో సగం మంది ఉపాధ్యాయులే ఉంటారని చెప్పారు. వారి సమస్యలపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను న్యాయపరమైన సమస్యల్లేకుండా చేపట్టాలంటూ సీఎం ఆదేశించారని గుర్తు చేశారు. మోడల్ స్కూళ్ల టీచర్లకు పదోన్నతుల ప్రక్రియను చేపట్టగానే కొందరు కోర్టుకెళ్లారని చెప్పారు. పండితులు, పీఈటీల అప్‌గ్రెడేషన్ ప్రక్రియ కోర్టు పరిధిలో ఉందని ఈ సందర్భంగా మంత్రి వివరించారు.

మనువాద భావజాలం ప్రమాదం : శైలజా టీచర్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగంలో మనువాద భావజాలాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నదనీ, ఇది దేశానికే ప్రమాదకరమని శైలజా టీచర్ హెచ్చరించారు. పాఠ్యాంశాల్లో మనుస్మృతిని ప్రవేశపెట్టడం సరైంది కాదన్నారు. చాతుర్వర్ణ వ్యవస్థ ఉండాలని చెప్పడంతోపాటు స్త్రీకి స్వేచ్ఛ లేదని చెప్పే మనుస్మృతిని అంగీకరించేది లేదని ఆమె నొక్కి చెప్పారు. కర్నాటకలో బడుల గోడలకు కాషాయరంగును వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రంగంటే తమకు భయం లేదనీ, కానీ సంఘ్ పరివార్ విధానాలే ప్రగతికి వ్యతిరేకమని వివరించారు. పెట్టుబడిదారీ విధానంతో ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభంలో మునిగిపోయిందని చెప్పారు. దానికి ప్రత్యామ్నాయం సోషలిజమేనని ఉద్ఘాటించారు. సోషలిజంలో ఉపాధి అనేది హక్కుగా మనకు లభిస్తుందన్నారు. విప్లవం ఒక్కరోజులో వచ్చేది కాదని శైలజా టీచర్ ఈ సందర్భంగా తెలిపారు. అది నిరంతర ప్రక్రియని వివరించారు. మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని యువతకు ఉద్యోగాలు, ఉపాధితోపాటు భావప్రకటనా స్వేచ్ఛ కూడా లేకుండా పోయిందన్నారు. ఫ్యూడల్ భావజాలాన్ని పెంచడం కోసమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని రూపొందించిందని విమర్శించారు. ఆ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం దాన్ని అంగీకరించలేదని వివరించారు. విద్యా కేంద్రీకరణ, ప్రయివేటీకరణ, కాషాయీకరణే నూతన విద్యావిధానం లక్ష్యాలని విడమరిచి చెప్పారు. ఆ రకంగా బీజేపీ విద్యారంగంలో సైతం తన మతతత్వ ఎజెండాను అమలు చేస్తున్నదని చెప్పారు. దాంతో అసలు మన రాజ్యాంగమే ప్రమాదంలో పడిందని హెచ్చరించారు. మోడీ సర్కారు దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తున్నదని వాపోయారు. ఈ క్రమంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత టీచర్లపై ఉందని ఆమె సూచించారు. సామాజిక సంస్కరణవాదులుగా, విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేలా ఉపాధ్యాయులు పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని సూచించారు. రాజ్యాంగ రక్షణ కోసం దేశంలోని అన్ని పార్టీలూ ఐక్యం కావాల్సిన తరుణం ఆసన్నమైందని చెప్పారు. బీజేపీపై పోరాడేందుకే సీఎం కేసీఆర్ బీఆర్ఎస్‌ను స్థాపించారని గుర్తు చేశారు. మోడీ పాలనతో ఫాసిజం రాబోతున్నదని హెచ్చరించారు. దానికి వ్యతిరేకంగా అందరం కలిసి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

వైషమ్యాలను రెచ్చగొడుతున్న బీజేపీ : నాగేశ్వర్



మతం పేరుతో బీజేపీ ప్రభుత్వం వైషమ్యాలను రెచ్చ గొడుతున్నదని మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్ అన్నారు. సమాజంలో భావజాల యుద్ధం నడుస్తున్నదనీ, ఈ సమయంలో ప్రగతిశీల ఉపాధ్యాయులు మౌనంగా ఉండొద్దని కోరారు. ఆర్థిక అంతరాలుండొద్దంటూ రాజ్యాంగం చెప్తున్నదనీ, సామాన్యులకు రోజు కూలి రూ.300 వస్తే, అదానీకి రోజుకు రూ.1,600 కోట్ల మేర ఆదాయమొస్తుందని వివరించారు. పాలకుల విధానాల వల్ల ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని చెప్పారు. రాజ్యాంగం, ఫెడరల్ వ్యవస్థ, భావప్రకటనా స్వేచ్ఛపై దాడి జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ, ఈడీ తరహాలో న్యాయమూర్తులను నియమిస్తామంటూ కేంద్ర న్యాయ శాఖ మంత్రి చెప్పటం శోచనీయమని అన్నారు. తమిళనాడు గవర్నర్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వాకౌట్ చేయడం సరైంది కాదన్నారు. తెలంగాణ గవర్నర్‌కు రాజ్యాంగం గురించి తెలియదని ఆయన ఎద్దేవా చేశారు. మంత్రిమండలి సలహా మేరకే నిర్ణయాలు తీసుకోవాలనీ, గవర్నర్లకు ప్రత్యేక అధికారాల్లేవని గుర్తు చేశారు.

పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేస్తావా..? పీఠాన్ని వదులుకుంటావా? : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) చట్టాన్ని రద్దు చేస్తావా... ఢిల్లీ పీఠాన్ని వదులుకుంటావా? అంటూ మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తున్నదని తెలిపారు. ఆ విధానాల్లో భాగంగానే సీపీఎస్ విధానాన్ని అమల్లోకి తెచ్చారని వివరించారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆగకుండా సీపీఎస్ విధానం రద్దు కాబోదని చెప్పారు. మోడీ సర్కార్ కేంద్రీయ విశ్వవిద్యాలయాలను మనువాద కేంద్రాలుగా మారుస్తున్నదని అన్నారు. రోహిత్ వేములది ఆత్మహత్య కాదనీ, అది ప్రభుత్వ హత్య అని చెప్పారు. మోడీ విధానాలతో దేశంలోని ఆర్థిక, సామాజిక రంగాల్లో అసమానతలు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే కాకుండా కేంద్రీయ విద్యాలయాల్లోనూ ఉపాధ్యాయ ఖాళీలున్నాయని తెలిపారు. సీపీఎస్, ఎన్ఈపీ రద్దు కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం వెంటనే షెడ్యూల్‌ను ప్రకటించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలుంటేనే ఉపాధ్యాయులకు హక్కులుంటాయని ఎస్టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎం సంయుక్త అన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పురాతన కాలంనాటి పరిస్థితులను విద్యారంగంలోకి తెచ్చేందుకు నూతన విద్యావిధానాన్ని కేంద్రం తీసుకొచ్చిందని ఆమె తెలిపారు. ఎన్ఈపీని రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రికా ప్రధాన సంపాదకులు పి మాణిక్‌రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం వద్ద మహాసభలను నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ఉపాధ్యాయులంతా టీఎస్‌యూటీఎఫ్ వైపు చూస్తున్నారని చెప్పారు. తమ సంఘం సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయడంతోపాటు ప్రతి అంశాన్నీ శాస్త్రీయంగా ఆలోచిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జి.జైపాల్ యాదవ్, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితా హరినాథ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకట రమణారెడ్డి, డీసీసీబీ చైర్మెన్ మనోహర్‌రెడ్డి, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, ఉపాధ్యక్షులు సిహెచ్ రాములు, సిహెచ్ దుర్గాభవాని, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, ఆహ్వానసంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఈ గాలయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్, టీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి బి బసవ పున్నయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఘనంగా ప్రారంభమైన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభ

- వేలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయులు
- రాగన్నగూడెం నుంచి సభ ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన
- జాతీయ పతాకం, ఎస్టీఎఫ్ఐ, యూటీఎఫ్ పతాకాల ఆవిష్కరణ
- అమరులను స్మరిస్తూ స్థూపానికి ప్రముఖుల నివాళి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర 5వ మహాసభ రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లోని బీఎమ్ఆర్ కన్వెన్షన్ కామ్రేడ్ అంబటి నాగయ్యనగర్, కామ్రేడ్ ముంత ఆంజనేయులు ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 9గంటలకు రాగన్నగూడెం నుంచి సభ ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సుమారు రెండు కిలో మీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో వేలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 'ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి.. విద్యా హక్కులను కాపాడాలి.. యూటీఎఫ్ జిందాబాద్.. ఉపాధ్యాయుల ఐక్యత వర్ధిల్లాలి.. సాధిస్తాం సాధిస్తాం అమరుల ఆశయాలు సాధిస్తాం' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఉపాధ్యాయులు నినాదాలతో హోరెత్తించారు. తమ సమస్యలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. 'పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప' అన్న నినాదాలతో ర్యాలీ ఉత్సాహవంతంగా సాగింది. ఈ ర్యాలీలో మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో ర్యాలీ ముందు వరుసలో ఉన్నారు.

జెండా ఆవిష్కరణలు..

ర్యాలీ అనంతరం సభా ప్రాంగణంలో సంఘం సీనియర్ నాయకులు జెండాలను ఆవిష్కరించారు. టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణమూర్తి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతినిధులు జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తూ జనగణమన గీతాన్ని ఆలపించారు. ఎస్టీఎఫ్ఐ జెండాను సీనియర్ నాయకులు ఆర్.నర్సింహాచారి ఎగురవేశారు. టీఎస్‌యూటీఎఫ్ 5వ మహాసభ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకులు, ఉమ్మడి మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.మాణిక్‌రెడ్డి ఎగురవేశారు. ప్రతినిధులు పతాకానికి అభివాదం తెలుపుతూ నినాదాలు చేశారు. 'ఎగరాలి ఎగరాలి, ఎర్రెర్రని జెండా.. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ జెండా.. అధ్యయనం-అధ్యాపన సామాజిక స్పృహతో.. హక్కులు, బాధ్యతలు ఎదలో నింపుకున్న జెండా' అంటూ పాటలు ఆలపించారు. పిడికిలెత్తి రెడ్ సెల్యూట్ చేశారు. అనంతరం అమర వీరులను స్మరిస్తూ.. మహాసభలకు హాజరైన కేరళ ప్రభుత్వ విప్ కె.కె శైలజా టీచర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావ రవి, మహాసభ ఆహ్వాన సంఘం కార్యనిర్వాహక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాలయ్య, వెంకటప్ప, తదితరులు అమర వీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

సంక్లిష్టంగా విద్యావ్యవస్థ

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

నేడు దేశంలో విద్యా వ్యవస్థ సంక్లిష్టంగా ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య అన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇందుకు కారణమని వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులే అవసరం లేదని మోడీ సర్కారు అంటున్నదనీ, దీంతో హక్కులు ప్రశ్నార్థకం అయ్యాయని చెప్పారు. ఈ చిక్కుముడి విప్పాల్సిన బాధ్యత టీచర్లదేనని స్పష్టం చేశారు. ఈ మేరకు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఐదో మహసభ ప్రతినిధుల సభలో ప్రారంభోపన్యాసం చేశారు. సామాజిక వివక్ష కొనసాగుతోందని, చదువు అందరికీ చేరేలా యూటీఎఫ్ పరిష్కారం కనుకొనాలని అన్నారు. ప్రజలంతా చదువుకునేలా విద్యా వ్యవస్థను నిర్మించాలని సూచించారు. అంబానీ, బిర్లా కమిషన్ చేసిన సిఫార్సులను నేటి ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. ప్రైవేటు యూనివర్సిటీలు అందులో భాగమేనని అభిప్రాయపడ్డారు. మన్మోహన్, మోడీ విధానాలు ప్రయివేటీకరణను ప్రోత్సహించేలా ఉన్నాయని విమర్శించారు. మతోన్మాదం ఎదైనా ఉన్మాదమేనని అన్నారు. విద్యారంగంలో యూటీఎఫ్ నమూనా ముందుకు రావాల్సిన అవసరంలేదని అభిప్రాయపడ్డారు. కొత్త విధానాలతో ప్రజల్ని చైతన్యం చెయ్యాలని పిలుపు నిచ్చారు. విద్యా వ్యవస్థను నాశనం చేసే చర్యలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వృత్తిరీత్యా పాఠాలు చెబుతూనే, ప్రవత్తిగా ప్రజలను చైతన్యం చెయ్యాల్సిన అవసరం ఎంతైనా వుందని చెప్పారు. నిజమైన మేధావులుగా టీచర్లు వ్యవరించాలనీ కోరారు.



శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి:ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి సంక్రాంతి సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్బంధంగా నడుపుతున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సెలవులు విద్యాసంస్థలకు 14 నుంచి 16వ తేదీ వరకు ప్రకటించిందని గుర్తుచేశారు. అయినప్పటికీ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను బలవంతంగా క్యాంపస్‌లలోనే ఉంచి తల్లి దండ్రులు వచ్చిన సెలవులు ఇవ్వడం లేదని విమర్శించారు.

డేటాపై ముసుగు

ప్రభుత్వ నిర్ణయాలకు, విధానాల రూపకల్పనకు...ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే 'డాటా'నే ఆధారం. సర్వేల్లోని సమాచారమే కీలకం. కానీ మోడీ సర్కార్ 'డేటా' అనే మాట వినడానికి ఇష్టపడటం లేదు. 'సామాజిక ఆర్థిక, కుల గణన' సర్వే అంతా పూర్తయ్యింది. విడుదలకు నో చెప్పింది. అలాగే కుటుంబ వినియోగదార్ల వ్యయ నివేదిక-2017-18ను కూడా విడుదల చేయలేదు. జన గణన, సామాజిక, ఆర్థిక, కుల గణన, ఆరోగ్య నిర్వహణ వార్షిక నివేదిక, పేదరికం..మొదలైన నివేదికలేవీ కేంద్రం విడుదల చేయటం లేదు. దేశంలో ప్రజల జీవన స్థితిగతులపై ఒక అంచనాకు రావడానికి దోహదం చేసే 'డేటా'పై మోడీ సర్కార్ ముసుగేసి దాస్తోంది. వారాంతపు, నెలవారీ నివేదికలతో ప్రజల్ని మభ్యపెడుతోంది.

న్యూఢిల్లీ : జన గణన-2021, కుల గణన చేపట్టకుండా కేంద్రం కాలయాపన చేస్తోంది. జాతీయ నేర గణాంకాల నివేదిక విడుదల ఏడాది ఆలస్యమైంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా సమయానికి విడుదల కాలేదు. దేశంలో వాస్తవ పరిస్థితులు బయటకు రాకుండా చేయటమే లక్ష్యంగా మోడీ సర్కార్ వెళ్తోందని, అందులో భాగంగానే 'డేటాకు ముసుగు' వేస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సర్వేలు...అందులోని సమాచారం ప్రభుత్వ విధాన రూపకల్పనకు అత్యంత కీలకం. ఈ నివేదికల్లోని డాటా ఆధారంగానే సంక్షేమ, అభివృద్ధి పథకాలు, వాటికి కేటాయించాల్సిన నిధులపై ప్రభుత్వాలు ఒక అంచనాకు రాగలుగుతాయి. అయితే ఈ నివేదికల సమాచారం బయటకు రాకుండా మోడీ సర్కార్ వీలైనన్ని ఎత్తులు వేస్తోంది.

కీలకమైన 12 నివేదికలు

భారత ప్రభుత్వం విడుదల చేసే నివేదికల్లో అత్యంత ముఖ్యమైనవి 20 ఉన్నాయి. ఇందులో జన గణన, సామాజిక, ఆర్థిక, కుల గణన, ఆరోగ్యం, పేదరికం, వ్యవసాయ వేతనాలు, ఉన్నత విద్య..మొదలైన సర్వేల సమాచారం బయటకు రావటం కేంద్రంలోని పాలకులకు ఇష్టం లేదు. కాలయాపన చేస్తూ, ప్రభుత్వ సమాచారాన్ని తారుమారు చేయటమే పనిగా కేంద్రం ముందుకు వెళ్తోందన్న విమర్శలున్నాయి. రాజకీయ ప్రేరేపితమైన సమాచారాన్ని మోడీ సర్కార్ ప్రజలకు అందుబాటులో ఉంచుతోంది. ఉన్నత విద్య, వైద్యం, నేరాలు...నివేదికలు చాలా కీలకం. వీటి ఆధారంగానే ప్రభుత్వ విధానాల రూపకల్పన సాధ్యపడుతుంది. వార్షిక నివేదికలను పక్కకు పెట్టడం మరో ఎత్తుగడ. వారాంతపు, నెలవారీ నివేదికలను రూపొందించే వ్యవస్థలను కేంద్రం తయారుచేసిందని, విస్తారమైన 'డేటా బేస్'ను రూపొందించే వ్యవస్థను కేంద్రం బలహీనపర్చిందని నిపుణులు చెబుతున్నారు.

సర్వే పూర్తయినా..నో

ఆయా శాఖల్లో సర్వేలు పూర్తయి డాటా విడుదలకు సిద్ధంగా ఉన్నా..కేంద్రం అడ్డుకుంటోంది. ప్రజలకు అందుబాటులోకి తేవడానికి మోడీ సర్కార్ ఆమోదం తెలపటం లేదు. సర్వేలో వెలువడ్డ సమాచారం మింగుడుపడక పోవటం, రాజకీయంగా తమకు ప్రతికూలంగా ఉండటం వల్లే సర్వే సమాచారాన్ని బయటపెట్టక పోవడానికి కారణమని నిపుణులు ఆరోపిస్తున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రతి మూడేండ్లకు ఒకసారి విడుదల కావాలి. కానీ మోడీ హయాంలో చాలా నెలలపాటు విడుదల కాకుండా ఆపారు. పదేండ్ల క్రితం నాటి 2011-12 సర్వేనే పాలకులు వాడుతున్నారు. 2017-18 సర్వే విడుదలకు సిద్ధమైనా కేంద్రం విడుదల చేయటం లేదు. నిజానికి దేశవ్యాప్తంగా సర్వే చేపట్టి..పెద్ద ఎత్తున సమాచారాన్ని సేకరించి, విశ్లేషించే వ్యవస్థ భారత్‌లో లేదని నిపుణురాలు అవనీ కపూర్ విమర్శించారు.

వీలైనంతమేరకు కాలయాపన..

కేంద్ర ప్రభుత్వ నివేదికల్లో చాలామటుకు ఏడాదికిపైగా ఆలస్యంగా విడుదలవుతున్నాయి. ఉదాహరణకు 'బేసిక్ రోడ్ స్టాటిస్టిక్స్' నివేదిక 2018-19 మాత్రమే అందుబాటులో ఉంది. "ఓటింగ్, ఆర్థిక శాఖ నిధుల బదిలీ, జనాభా ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు..ఇవన్నీ డేటా ఆధారంగా జరుగుతాయి" అని ముంబయికి చెందిన ప్రొఫెసర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ స్కూల్స్, ఆరోగ్య కేంద్రాలు ఎన్ని ఉండాలి? తెలుసుకోవాలంటే జన గణన తప్పనిసరి. కుటుంబ వ్యయం, పేదరికం నివేదికలు ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ప్రధాన ఆధారం. వీటికి సంబంధించి దేశవ్యాప్త సర్వే వివరాలు లేకుండానే మోడీ సర్కార్ ముందుకు వెళ్తోంది. అంతేకాదు మిగతా సర్వేల నిర్వహణ కూడా ప్రభావితమవుతుందని నిపుణులు చెప్పారు.



జనాభా లెక్కలు

రాజకీయంగా, ప్రభుత్వ పరంగా అత్యంత కీలకం జనాభా లెక్కలు. ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ఆధారంగా కేంద్రం ముందుకు వెళ్తోంది. గ్రామీణ స్థాయిలో జనాభా, అక్షరాస్యత, వలసలు..మొదలైన అనేక విషయాలు పదేండ్ల క్రితం నాటివే ప్రామాణికంగా తీసుకుంటోంది. 2021 జన గణన చేపట్టలేకపోతున్నామని కోవిడ్-19 సంక్షోభాన్ని కేంద్రం సాకుగా చూపుతోంది. కోవిడ్ నియంత్రణలు ఎత్తేసినా..జన గణన ఎప్పుడు ఉంటుందన్నది ఎవ్వరికీ తెలియదు. కేంద్రం ఇప్పటివరకూ స్పష్టత ఇవ్వలేదు.

పేదరికం

ప్రతి 5ఏండ్లకు ఒకమారు ప్లానింగ్ కమిషన్ 'పేదరికం అంచనాల' నివేదికను విడుదల చేయాలి. 1973-74 నుంచి ప్రతి ఐదు, ఆరేండ్లకొకమారు నివేదిక విడుదలవుతోంది. 2013 తర్వాత రావాల్సిన నివేదికను మోడీ సర్కార్ ఆపేసింది. ఇప్పటివరకూ అధికారికంగా 'పేదరికం'పై ప్రభుత్వ అంచనాలు విడుదల కాలేదు. "ఊహాజనితమైన ఎన్నికల వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన అధికార పార్టీ నాయకులకు, పాలకులకు 'డేటా సెట్స్' విడుదల కావటం ఇష్టం లేదు.

దాంతో విధాన నిర్ణయాలు సంక్లిష్టంగా మారుతాయి. ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుంది. దీన్నుంచి బయటపడటానికి డాటాను తారుమారు చేయటం, చేతివాటం ప్రదర్శించటం వంటి పనులకు పాల్పడతాయి" అని అజీం ప్రేమ్‌జీ వర్సిటీలో ప్రొఫెసర్ వికాస్ కుమార్ అన్నారు. రాజకీయాల్లో మత ప్రభావం పెరగటమూ సర్వేలు ఆలస్యం కావటం, విడుదల కాకపోవటానికి కారణమని ఆయన అన్నారు. డాటా నిర్వహణ వ్యవస్థనే కుప్పకూల్చారని, కొన్ని చోట్ల బలహీనపర్చారని ఆయన వివరించారు. గణాంకాల నిర్వహణ విభాగానికి నిధులు విడుదల కేటాయించటం వృథా అని పాలకులు భావిస్తున్నారని అన్నారు.

నిర్వాసితుల సమస్య పరిష్కరించకుంటే పాదయాత్ర

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ
- బీఎన్ తిమ్మాపురం భూనిర్వాసితుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం

నవతెలంగాణ -భువనగిరిరూరల్

యాదాద్రిభువనగిరి జిల్లా బస్వాపురం మండలంలోని బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న భూనిర్వాసితుల సమస్యలను ఈనెల 20వ తేదీలోపు పరిష్కరించకుంటే పాదయాత్ర చేపడతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. బీఎన్ తిమ్మాపురం, బస్వాపురం, లప్ప నాయక్‌తండా ప్రజల, భూ నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీఎన్ తిమ్మాపురం భూనిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బస్వాపురం రిజర్వాయర్ వద్ద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎన్ తిమ్మాపురం గ్రామస్తులు సమస్యల పరిష్కారం కోసం 46 రోజులుగా దీక్షలు చేస్తున్నారన్నారు. వారికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ప్రకటించినట్టు తెలిపారు. తిమ్మాపురం ప్రజలు ప్రభుత్వంపై శాంతియుతంగా నిరసన చేపడితే.. ఇప్పటివరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వెంటనే స్పందించి వారితో చర్చలు జరపాలని, లేనియెడల పోరాటం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.





మన హక్కుల కోసం పోరాటం చేయాలి
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

భూ నిర్వాసితులు తమ హక్కుల కోసం పోరాటం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గతంలో గ్రామంలో 2013 భూ సేకరణ చట్టంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తిమ్మాపురం భూ నిర్వాసితులందరూ సమిష్టిగా ఉండాలని సూచించారు. ఈనెల 20, 21వ తేదీన నిర్వహించే ధర్నాలో రాజకీయాలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



భూమికి భూమి ఇవ్వాలి
రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య

2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూ నిర్వాసితులకు భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు ఇవ్వాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య కోరారు. ప్రాజెక్టు కట్టడం కోసం గతంలో అందరికీ మంచి జరుగుతుందని చెప్పి మభ్యపెట్టి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు.

ప్రాజెక్టు సమస్య పరిష్కారం కోసం పాదయాత్ర
వ్యకాస జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ

తిమ్మాపురం భూ నిర్వాసితుల సమస్య పరిష్కారం కోసం ఈనెల 20న ప్రాజెక్టు నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టి, కలెక్టరేట్ వద్ద 48 గంటల ధర్నా చేస్తామని వ్యకాస జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ తెలిపారు. అక్కడే వంటావార్పు చేస్తామన్నారు. గ్రామ సర్పంచ్ పిన్నం లతా రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీటీసీ ఉడుత శారద ఆంజనేయులు యాదవ్, ఉప సర్పంచ్ ఎడ్ల దర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రావుల అనురాధ నందు, మాజీ ఎంపీటీసీ జిన్న మల్లేశం, భూ నిర్వాసితుల కమిటీ నాయకులు వల్దాస్ రాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ముత్యాలు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అన్నంపట్ల కృష్ణ, సందెల రాజేష్, బహుజన సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బట్టు రామచంద్రయ్య, ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పోరాటాలలో ప్రజలే గెలుస్తారు..
కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు



సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తే ప్రజలదే అంతిమ విజయం అవుతుందని, భూనిర్వాసితులు అధైర్యపడొద్దని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, యువతకు ఉపాధి, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భోగి, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పంటల పండుగలు అద్భుతమైన సంతోషాన్ని, ప్రగతిని, ఆరోగ్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. భోగి, మకర సంక్రాంతి మన గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలనీ, వాటిని ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు. మన పురాతన సంప్రదాయమైన సంక్రాంతి ఉత్సవాలు అన్ని వర్గాల ప్రజల మధ్య బంధాన్ని పెంచుతాయని తెలిపారు. ఇలాంటి శుభ సందర్భంలో ప్రేమ, వ్యాత్సల్యం, స్నేహం, సహోదరత్వం వంటి ఉన్నత ఆలోచనలు అందరిలో కలగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కంటి వెలుగును విజయవంతం చేయండి

- అధికారులకు సీఎస్ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పిలుపునిచ్చారు. కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై శుక్రవారం జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి కంటి వెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. 2018లో నిర్వహించిన తొలి విడత కంటి వెలుగు కన్నా ఎక్కువ మందికి కంటి పరీక్షలు నిర్వహించడం ద్వారా మన రికార్డు మనమే బద్దలుకొట్టి సరికొత్త రికార్డు సృష్టించాలని కలెక్టర్లను కోరారు. ఇప్పటికే 15 లక్షలకు పైగా కండ్లద్దాలను రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వైద్య కేంద్రాలకు, అర్బన్ వైద్య కేంద్రాలకు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకుగాను రాష్ట్రవ్యాప్తంగా 1,500 బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. కంటి వెలుగు కార్యక్రమం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసేలా విస్తృత ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్ లో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వి, ఫ్యామిలీ వెల్ఫేర్ కమీషనర్ శ్వేతా మహంతి, మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ డా. సత్యనారాయణ పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల సాహిత్య చరిత్రలను వెలికితీస్తాం

- జూలూరు గౌరీశంకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళితులలో అత్యంత వెనుకబడిన 57 ఉపకులాల సాహిత్య సాంస్కృతిక జీవన విధానాల చరిత్రను సాహిత్య అకాడమి ద్వారా గ్రంథస్థం చేసేందుకు కృషి చేస్తామని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. తరతరాలుగా అట్టడుగున పడున్న వర్గాల వారి సాహిత్య సాంస్కృతిక చరిత్రలను వెలికితీసి రేపటి తరానికి అందించటమే సాహిత్య అకాడమి ముందున్న ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భైరి వెంకటేశం మోచి శుక్రవారం సాహిత్య అకాడమీ కార్యాలయంలో తమ ఉపకులాలకు, జాతులకు సంబంధించిన సాహిత్య సాంస్కృతిక చరిత్రలని గ్రంథస్థం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ ఉపకులాలలో ముఖ్యంగా యక్షగానం, భాగవతాన్ని ప్రదర్శించే చిందోల్లు హెూలియదాసరులు, జాంబపురాణాన్ని ప్రదర్శించే డక్కలి కులస్తులు, గ్రామ దేవతలను కొలిచే బైండ్ల, దేవతి, పోతరాజులు, శివారాధన చేసే మాలజంగాలు, మాదిగ జంగాలు (నులక చందయ్యలు), వైష్ణవారాధకులైన మిత అయ్యల్వార్లు, చెప్పులవృత్తిపై ఆధారపడి జీవించే మోచి, సమగర కులస్తులు, సాహస క్రీడలు ప్రదర్శించే మాస్టీన్, దొంబర కులస్తులు, ఇంకా మాదాసి కురువ, మాంగ్, బుడగజంగాలు, గోసంగిలు, పైడి, పాకి తదితర కులాలకు చెందిన మౌకిక సాహిత్యాన్ని నమోదు చేయాల్సిన అవసరమెంతో ఉందన్నారు. ఉపకులాలకు సంబంధించిన ఘనమైన చరిత్రలు ఇప్పటిదాకా వెలుగులోకి రాలేదనీ, వాటిని వెలుగులోకి తేవాల్సిన బాధ్యత సాహిత్య అకాడమి చేపడుతుందని తెలిపారు. ఇప్పటికే ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆయా కులాల చరిత్రలను భద్రపరచాలనీ, వాటిని గ్రంథస్థం చేయాలని కోరడాన్ని సాహిత్య అకాడమి ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల, అన్ని కులాల సకల జనుల సాహిత్య సాంస్కృతిక చరిత్రను గ్రంథస్థం చేసినప్పుడే సమగ్ర తెలుగు సాహిత్యమవుతుందని పేర్కొన్నారు. ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట అధ్యక్షులు భైరి వెంకటేశంతో పాటుగా మాంగ్ సమాజ్, రాష్ట్ర అధ్యక్షులు జి. తులసిదాస్, సీనియర్ జర్నలిస్టు బుద్ధం నరసింహస్వామి ఈ కార్యక్రమంలో ఉన్నారు.

నావికాదళంతో ఐఐటీహెచ్ ఒప్పందం

- కో-డెవలప్‌మెంట్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్
- రక్షణకు సంబంధించిన సాంకేతికతపై శాస్త్రీయ అవగాహన



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఐఐటీ హైదరాబాద్ టెక్నాలజీ రిసెర్చ్ పార్క్ వద్ద కో-డెవలప్‌మెంటల్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ (సీటీఐసీ) ఏర్పాటు చేయడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) ఇండియన్ నేవీ/డబ్యూఈఎస్ ఈఈతో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం విద్యాపరమైన సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. రక్షణకు సంబంధించిన సాంకేతికతలపై శాస్త్రీయ అవగాహన పెంపొందించుకుంటుంది. పరస్పర ప్రయోజనకరమైన రంగాల్లో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టనుంది. ఐఐటీహెచ్ పబ్లిక్ ఇంజినీరింగ్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్, అకడమిక్ స్ట్రెంత్, రీసెర్చ్, పబ్లికేషన్‌కు ప్రసిద్ధి చెందింది. ఇండస్ట్రీయల్ హబ్‌కు సమీపంలో ఉండి ఇండియన్ నేవీ వెపన్స్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో చేతులు కలిపింది. వెపన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ దాని పరిశోధన, విద్యావేత్తలు జాతీయ భద్రతపై మరింత దృష్టి కేంద్రీకరించడానికి ఈ ఒప్పందం చేసుకున్నట్టు ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొపెసర్ బి.ఎస్ మూర్తి తెలిపారు. 2023 జనవరి 9న ఆత్మ నిర్భర్ భారత్ అండ్ హార్నేస్ ఇన్-హౌస్‌టెక్ పరాక్రమం కోసం కలిసి పనిచేయడానికి మెటీరియల్ చీఫ్ వైస్ అడ్మిరల్ సందీప్ నైతానీ ప్రాతినిధ్యం వహిస్తున్న భారత నావికాదళంతో ఒక అవగాహన కుదుర్చుకున్నట్టు చెప్పారు. డబ్యూఈఎస్ఈఈ ద్వారా నిర్వహించబడుతున్న ప్రాజెక్టు సముద్రపు డొమైన్‌లో సమకాలీన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు సంబంధించిన వినూత్న మార్గదర్శక ప్రాజెక్టులపై ఐఐటీహెచ్ సహకరించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. జాతీయ భద్రతకు దోహదపడే అవకాశం రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొపెసర్ బీ.ఎస్ మూర్తి ఒక పౌరుడిగా మన సాంకేతిక నైపుణ్యం, పరిశోధనా చతురతను జాతి రక్షణలో ఉపయోగించడం గర్వించదగిన విషయమన్నారు. ఐఐటీహెచ్ క్యాంపస్‌లో ఇండియన్ నేవీకి సంబంధించిన డబ్యూఈఎస్ఈఈ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ఒప్పందం ద్వారా రెండు సంస్థల మధ్య దీర్ఘకాలిక సహకారానికి మార్గం ఏర్పడిందన్నారు. ఆత్మ నిర్భర్ భారత్‌ను నిర్మించాలనే లక్ష్యంతో ఈ ఆలోచన పుట్టిందన్నారు. టెక్నాలజీ రీసెర్చ్ పార్క్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి ప్రొఫెసర్ సుమోహన్ ఎస్.చన్నప్పయ్య, నావికాదళం డీజీ డబ్ల్యూఎస్ఈఈ రియర్ అడ్మిరల్ అంకుర్ శర్మ పాల్గొన్నారు.

గిరిజన యువకుడి హత్య

- బీజాపూర్ జిల్లా ఊసూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఘటన

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఊసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊసూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున గిరిజన యువకుడు రామ్మూర్తి హత్యకు గురయ్యాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసు బృందంతో పాటు మృతుని బంధువులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ విషయమై బీజాపూర్ ఎస్పీ ఆంజనేయవర్మ మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం ధాన్యం కొనుగోలు కేంద్రానికి రామ్మూర్తి చేరుకున్నారని, ఐదు గంటల సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అందరి సమక్షంలో ఆయనపై దాడి చేసినట్టు తెలిపారు. దాంతో రామ్మూర్తి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. దాడి తరువాత దుండగులు పారిపోయారన్నారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారన్నారు. దాడి చేసినది ఎవరు.. అలాగే మృతుడు ఈ సమయంలో ఇక్కడికి ఎందుకు వచ్చాడో ఆరా తీస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపించామని తెలిపారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఆగిన మరో కార్మికుని గుండె

- గుండెపోటుతో ఎన్ఎస్ఎఫ్ కార్మికుడి మృతి

నవతెలంగాణ-బోధన్


(ఫైల్)

గుండెపోటుతో మరో ఎన్ఎస్ఎఫ్ కార్మికుడు ప్రాణం విడిచారు. వారం వ్యవధిలో ఇద్దరు మృతిచెందడంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేసిన సాయిలు(55) శుక్రవారం గుండెపోటుతో చనిపోయారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు ప్రభుత్వం బకాయి వేతనాలు విడుదల చేయకపోవడంతో మనోవేదనకు గురవుతున్నారు. వారం రోజుల్లో ఇద్దరు కార్మికులు గుండెపోటుతో మృతిచెందడంతో తోటి కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే కార్మికులకు రావలసిన బకాయి వేతనాలను మంజూరు చేయాలని కోరుతున్నారు. ఫ్యాక్టరీ లేఅవుట్ అయిన సందర్భంగా కార్మికుల వేతనాలు మంజూరు చేయాలని జరిగిన ప్రజా ఉద్యమాల్లో సాయిలు చురుకుగా పాల్గొన్నారు. కుటుంబ పోషణకు కులవృత్తిని నమ్ముకుని చెప్పులు కుట్టారు. సాయిలు మృతి పట్ల కార్మికులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించేవారు : సీపీఐ(ఎం)

సీపీఐ(ఎం) పార్టీ శాఖ కార్యదర్శి, సీఐటీయూ నాయకులు, ఎన్ఎస్ఎఫ్ కార్మికుడు కామ్రేడ్ ఓటర్‌కార్ సాయిలు మృతిచెందడం పట్ల ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్న నాటి నుంచి నిరంతరం పోరాటాల్లో పాల్గొన్నారని, ఏ కార్మికుడికి అన్యాయం జరిగినా ప్రశ్నించేవారని పేర్కొన్నారు. ఒక సందర్భంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ ఆపాలంటూ ఎంతో ఎత్తు కలిగిన ఫ్యాక్టరీ బొంగు ఎక్కి నిరసన తెలియజేసిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ సాయిలు అని కొనియడారు. నిరంతరం ప్రజా పోరాటాల్లో ఉంటూ తుదిశ్వాస విడిచే వరకు ప్రజాపోరాటాల్లో పాల్గొన్నారని, చివరకు ఇటీవల దళిత టీచర్ మల్లికార్జున్‌కు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ జరిగిన ఆందోళనలో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని విప్లవ జోహార్లు తెలిపారు.

గుండిమల్ల వెల్టూరు బ్యారేజీకి మోక్షమెప్పుడో.. ?

- శ్రీశైలంలో నిండామునిగిన గ్రామాలకు నీళ్లు కరువు
- బ్యారేజ్‌నిర్మిస్తే.. 100 టీఎంసీలనీటి వినియోగం
- 6లక్షలఎకరాలకు సాగునీరు
- ఆర్డీఎస్, కెఎల్ఐ ఉన్నా.. సమీప ఆయకట్టుకు అందని సాగునీరు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

శ్రీశైలం రిజర్వాయరులో విలువైన సాగు భూములు, నివాసాలు కోల్పోయారు ఆ ప్రాంతవాసులు. వారికి మాత్రం సాగునీరు రావడం లేదు.. కూత వేటు దూరంలో ఉన్న కృష్ణ, తుంగభద్ర నదుల నుంచి సాగునీరివ్వడంలో ఉమ్మడి రాష్ట్ర పాలకుల నుంచి నేటి వరకూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం జరుగుతూనే ఉంది. ఎగువన జూరాల ఉన్నా.. చివరి ఆయకట్టుకు సాగు నీరందక పంట పొలాలు బీళ్లుగా మారాయి. కృష్ణానదిపై గుండిమల్ల వెల్టూరు దగ్గర బ్యారేజ్ నిర్మాణం చేస్తే.. ఈ ప్రాంతం సాగుతోపాటు ఇరు రాష్ట్రాల పరిధిలో వ్యాపార వాణిజ్యాలు పెరిగే అవకాశాలున్నాయి.. అయినా పాలకులకు పట్టడం లేదు.

ఎగువన నిర్మించిన జూరాల ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. ముఖ్యంగా చిన్నంబావి, పెబ్బేరు పాన్‌గల్, వీపనగండ్ల మండలాలకు స్థిరీకరించిన ఆయకట్టు ఉన్నా.. వర్షాకాలంలోనూ వారబందీ పెడుతున్నారు. ఆర్డీఎస్, కెఎల్ఐ ప్రాజెక్టులు ఉన్నా ఈ ప్రాంత సాగు భూములకు నీరు అందడం లేదు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో చిన్నంబావి మండల పరిధిలో 11 గ్రామాలు, పెంట్లవెల్లి మండల పరిధిలో 6 గ్రామాలు, కొల్లాపూర్ మండల పరిధిలో 11 గ్రామాలు నీటమునిగాయి. 27 గ్రామాలు, 6 వేల కుటుంబాలు, 30 వేల జనాభా నిర్వాసితులయ్యారు. విలువైన భూములు, ఇండ్లు కోల్పోయి నేడు దిక్కులేని పక్షుల్లా మిగిలారు.

గుండిమల్ల ఎల్టూరు ప్రాజెక్టు నిర్మాణం జరిగితే ..కృష్ణా నది పరివాహక ప్రాంతంలో పెద్దమరూరు దగ్గర గుండిమల్ల ఎల్టూరు మధ్య బ్యారేజ్ నిర్మాణం చేస్తే.. ఈ ప్రాంత సాగు నీరు సమస్య తీరుతుంది. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం జరిగితే కొత్తగా ముంపు ఉండదు. గతంలో శ్రీశైలం వెనక జలాలకు మించి నిల్వ ఉండవు. ఇక్కడ బ్యారేజి నిర్మాణంతో సుమారు 100 టీఎంసీల నీటిని వాడుకోవచ్చు. పది లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశాలున్నాయి. అతి తక్కువ ఖర్చుతో ఎటువంటి కాలయాపన లేకుండా బ్యారేజి నిర్మాణం చేయొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే జూరాల చివరి ఆయకట్టుకు నీటి సమస్య ఉండదు. తుంగభద్రకు ఎగువన ఆరు కిలోమీటర్ల దూరాన ఈ బ్యారేజి నిర్మిస్తే.. వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సాగు నీటి వాడకం కోసం శ్రీశైలం ఎత్తు పెంచితే.. కర్నూల్, అలంపూర్ ప్రాంతాలు మునిగే అవకాశాలు ఉన్నాయి. అలా కాకుండా, బ్యారేజి నిర్మాణం వల్ల నీటి వాటా ఉపయోగించుకోవడంతోపాటు సింగోటం రిజర్వాయరుకు సాగునీరు అందుతాయని స్థానికులు కోరుతున్నారు.

గుండిమల్ల వెల్టూరు ప్రాజెక్టు వెంటనే మొదలు పెట్టాలి
పెరుమాండ్ల శ్రీనివాసులు- ప్రాజెక్టు పోరాట కమిటీ కన్వీనర్

గుండిమల్ల వెల్టూరు బ్యారేజీని వెంటనే చేపట్టాలి. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడారు. శ్రీశైలంలో మునిగిన ప్రాంత ప్రజలకు సాగు నీరు రావడం లేదు. అందువల్ల బ్యారేజి నిర్మాణంతో సమస్య తీరుతుంది.

సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణంపై నిర్లక్ష్యం తగదు
ఎండి జబ్బార్- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి- వనపర్తి



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి సమస్య నేటికీ తీరలేదు. ముఖ్యంగా జూరాల ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు సాగు నీరు లేక వారబంది విధిస్తున్నారు. ఇక్కడ నిర్వాసితులను వదిలిపెట్టడం దురదృష్టకరం. గుండిమల్ల వెల్టూరు ప్రాజెక్టుకు డిజైన్ తయారు చేసి బడ్జెట్ కేటాయించాలి. త్వరగా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తే.. కొల్లాపూర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు సాగునీరు సమస్య తీరుతుంది.

కష్టాల్లో ఉన్నవారి బాధను శ్రద్ధగా సానుభూతితో వినండి.
అది వారికి చికిత్సలా పనిచేస్తుంది - మహాత్మాగాంధీ

ప్రాయోజిత గవర్నర్లు

సంపాదకీయం

ప్రస్తుతం దేశంలో రాజ్‌భవన్‌లు వివాదాలకూ విపరీతాలకూ నిలయాలుగా 'అలరారుతున్నాయి'..! రాజ్యాంగ నియమాలు తుంగలో తొక్కి, ప్రజాస్వామ్య విలువలు ఫణంగా బెట్టి, కేవలం ఏలినవారి మనసెరిగి నడుచుకోవడమొక్కటే ఏకైక పరమావధిగా సాగుతున్న గవర్నర్‌ల తీరు రోత పుట్టిస్తోంది. తాజాగా తమిళనాడు శాసనసభలో

> ఈ వివాదాస్పద గవర్నర్‌లందరూ పూర్వాశ్రమంలో బీజేపీ కీలక నేతలే కావడం, వీరివల్ల ఇక్కట్లకు గురవుతున్నవన్నీ బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలే కావడం యాధృచ్ఛికమేమీ కాదు. కనుక ఇదంతా ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న బీజేపీ ప్రాయోజిత రాజకీయ తతంగమేనన్నది సత్యదూరమూ కాదు.

చోటుచేసుకున్న విపరీతం ఈ దురాగతాలకు ఓ పరాకాష్ట!

"పెరియార్, అంబేద్కర్, కామరాజ్ నాడార్, అన్నాదురై, కరుణానిధిల ఆశయాలకు అనుగుణంగా... సామాజికన్యాయం, ఆత్మగౌరవం లక్ష్యాలుగా, సమైక్యత - సామరస్యం అనే విధానాలను అవలంబిస్తున్న ఓ ద్రావిడ తరహా ప్రభుత్వమిది"- తమిళనాడు ప్రభుత్వం రూపొందించిన గవర్నర్ ప్రసంగ పాఠంలోని వాక్యాలివి. ఇందులో అభ్యంతరకరమైనవేమిటో తెలియదుగానీ ఆ మాటలు ఉచ్ఛరించడానికే ఆ గవర్నర్‌కు మనసొప్పలేదు. కనీసం క్యాబినెట్ ఆమోదించిన ప్రసంగాన్ని చదవడం సభా సంప్రదాయమన్న సంగతి కూడా ఆయన విస్మరించారు! బహుశా 'ద్రవిడ మోడల్ ప్రభుత్వం' అన్న ప్రస్తావన తమిళనాడు గవర్నర్ ఆర్.ఎస్. రవికి రుచించినట్టులేదు. పెరియార్, అన్నాదురై వంటి ద్రవిడ ఉద్యమ దిగ్గజాలతో పాటు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరు ఉచ్ఛరించడం కూడా ఆయనకు నచ్చకపోవడం గమనార్హం! తనకు నచ్చినా నచ్చకపోయినా సభా సంప్రదాయాలను గౌరవించడం గవర్నర్‌గా ఆయన విధి. రాజ్యాంగ నియమం. ఈ సంస్కారం కూడా ఆయనకు లేక పోవడం గర్హనీయం!



కనీసం ఆ రాష్ట్రం పేరు కూడా పలకడానికి ఆయన ఇష్టపడటం లేదు. తమిళనాడు అనే పేరే ఆయనకు ప్రాంతీయ వాదానికి ప్రతీకగా కనిపిస్తే... మహారాష్ట్ర, ఆంధ్ర, తెలంగాణ, నాగాలాండ్, బెంగాల్ ఇలా చెప్పుకుంటూ పోతే దేశంలోని మిగతా రాష్ట్రాల పరిస్థితేమిటీ?! ఇది దేనికి సూచిక?! ఇక ఆయన ప్రభుత్వం నిర్ణయించిన ప్రసంగంలోని అనేక అంశాలను కావాలని విస్మరించడమే కాదు, దానికి భిన్నంగా కూడా మాట్లాడాడు. దీనిపై నిరసన వ్యక్తం కావడంతో సభ నుంచి అర్థాంతరంగా నిష్క్రమించి దిగ్భ్రాంతికి గురిచేశాడు! ఆయన విపరీతపోకడలకు ఇదొక ఉదాహరణ మాత్రమే. కాగా, ప్రతీ సందర్భంలో ప్రభుత్వానికి అడ్డుతగలడం, తను రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నాననన్న స్పృహ లేకుండా రాజకీయ ప్రకటనలు చేయడం ఆయనకు పరిపాటిగా మారింది.

దీనికి ముందు ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా నిర్వాకం అందరికీ తెలిసిందే. ఆయన ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే కార్పొరేషన్ సమావేశాలకు ఎవరు అధ్యక్షత వహించాలో కూడా నిర్ణయించాడు. ఈ గందరగోళమే మేయర్ ఎన్నిక నిలిచిపోవడానికి కారణమయింది. ఈ విషయంలోనే కాదు, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన కేజ్రీవాల్ ప్రభుత్వ అధికారాలనేకం స్వాధీనం చేసుకోవడం ద్వారా ఆ సర్కార్‌ను అడుగడుగునా బలహీనపరుస్తున్నాడు. నిజానికి 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ కేపిటల్ టెరిటోరీ ఆఫ్ ఢిల్లీ యాక్ట్1992' ప్రకారం పోలీసు, శాంతిభద్రతల పరిరక్షణ, భూమి సంబంధిత వ్యవహారాలలో మినహా మిగతా అన్ని విషయాల్లోనూ మంత్రిమండలి సహాయం, సలహాకు అనుగుణంగా మాత్రమే లెఫ్టినెంట్ గవర్నర్ తన విధులు నిర్వర్తించవలసి ఉంది. ఈ చట్టం కార్యనిర్వహణాధికారాలన్నీ ఎన్నికైన ప్రభుత్వ అధీనంలో ఉంటాయనే వాస్తవాన్ని స్పష్టం చేస్తోంది. కానీ ఢిల్లీలో జరుగుతున్నదేమిటి?

ఇక కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సంగతి చెప్పనక్కర్లేదు. ఆయన పినరయి విజయన్ ప్రభుత్వంతో నిత్యం యుద్ధమే చేస్తుంటాడు. ఈయన కూడా శాసనసభలో ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగ పాఠం సరిగా చదవకపోగా, మంత్రులతో గిల్లికజ్జాలకు పూనుకున్నాడు. విద్యామంత్రి రాజీవ్ తనపై విమర్శలు చేశారు గనక ఆయన నియామకానికి తన ఆమోదం ఉపసంహరించు కుంటున్నట్టు ప్రకటించి నవ్వుల పాలయ్యారు. రాజ్యాంగం ముఖ్యమంత్రి సలహామేరకు మంత్రులను నియమించాలని చెబుతున్నదే గాని ఏకపక్షంగా తొలగించే అధికారం గవర్నర్‌కు ఇవ్వలేదన్న కనీస జ్ఞానం లేకుండా పోయిందాయనకు! విశ్వవిద్యాలయాలలో నియామకాలను సైతం శాసించేందుకు సిద్ధపడ్డారు. ఒక వైస్‌ఛాన్సలర్ విషయంలో పేచీకి దిగి అందరు వీసీలను రాజీనామా చేయాలని ఆదేశించారు. విశ్వవిద్యాలయ చాన్సలర్లుగా గవర్నర్ల అధికారం రాష్ట్రాల శాసనసభలు ఇచ్చిందేనన్న ఇంగితం లేకుండా వ్యవహరించి దెబ్బతిన్నారు. మహారాష్ట్రలో శివసేన తిరుగుబాటు వర్గంతో కలిసి బీజేపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటులో గవర్నర్ కోషియారీ వ్యవహరించిన తీరు జగమెరిగిన సత్యమే. తెలంగాణలోనూ నేడు రాజ్‌భవన్‌కూ ప్రగతిభవన్‌కూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. పంజాబ్‌లో బన్వరిలాల్ పురోహిత్, మేఘాలయలో తథాగతరాయ్ ఇలా చెప్పుకుంటూ పోతే అనేకులు..! వీరంతా ఏకకాలంలో ఆయా ప్రభుత్వాలతో నేరుగా తలపడుతున్నారు. ఈ వివాదాస్పద గవర్నర్ లందరూ పూర్వాశ్రమంలో బీజేపీ కీలక నేతలే కావడం, వీరివల్ల ఇక్కట్లకు గురవుతున్నవన్నీ బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలే కావడం యాధృచ్ఛికమేమీ కాదు. కనుక ఇదంతా ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న బీజేపీ ప్రాయోజిత రాజకీయ తతంగమేనన్నది సత్యదూరమూ కాదు.

పారదర్శకత పేరుతో పనిహక్కును హరిస్తున్న కేంద్రం

చక్రధర్ బుద్ధ, లావణ్యా తమంగ్

'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' కింద పని చేస్తున్న కార్మికుల హాజరును ఈ జనవరి 1నుండి డిజిటల్ పద్ధతిలో నమోదు చేసే చర్యల్ని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రారంభించింది. పౌరబాధ్యత, పారదర్శకత పేరుతో మే, 2021లోనే ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్టు) నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్ఎంఎంఎస్) ఆప్ ద్వారా హాజరు నమోదును ప్రారంభించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎన్ఆర్ఈజీఏ) అమలులో పర్యవేక్షణ బాధ్యతను మెరుగుపరిచేందుకు, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఈ ఆప్‌ను ప్రారంభించింది. ఉపాధి పని ప్రదేశాలను పర్యవేక్షణ చేయడానికి పంచాయతీ స్థాయిలో ఎంపిక చేయబడి, శిక్షణ పొందిన స్థానిక మహిళలతో పాటు ఎన్ఆర్ఈజీఏ మేట్లు ఈ హాజరు నమోదు ప్రక్రియను అమలు చేయాలి. ప్రతీ కార్మికుడి హాజరుతో పాటు పని చేస్తున్న ఫొటో, పనికి హాజరైన వాస్తవ సమయాన్ని తీసుకోవడం ఈ ఆప్ లక్ష్యం. ఈ ఆప్‌లో ఉపాధి హామీ కార్మికులు, మేట్లు, ఇతర కార్యకర్తల అనుభవాలను తెలుసుకునేందుకు అనేక రాష్ట్రాల్లో మేం వారితో మాట్లాడాం.

> ఈ ఆప్ ఎన్ఆర్ఈజీఏ మేట్లపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ప్పడు మేట్‌గా బాధ్యతలు స్వీకరించాలంటే ఆ మేట్‌కు ఒక స్మార్ట్‌ఫోన్ ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కొత్త నిబంధన వేల మంది మహిళలు మేట్లుగా మారకుండా అనర్హుల్ని చేసింది. ఈ కారణంగానే తాము మేట్లుగా అర్హత పొందకుండా ఉన్నామని ఇప్పటికే జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మహిళలు తెలిపారు. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లు ఉన్న పురుషులకు మేట్లుగా ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

స్థిరమైన పని సమయాలున్న కార్మికుల హాజరును పర్యవేక్షించేందుకు ఈ ఆప్ ఉపయోపడుతుండగా, అనేక రాష్ట్రాల్లో, ఉపాధి హామీ పనుల వేతనాలు ప్రతి రోజు చేసిన పని ఆధారంగా లెక్క కడతారు. కార్మికులు స్థిరమైన పని గంటలకు కట్టుబడి ఉండే అవసరం లేదు. ఈ సౌకర్యమే ఉపాధి హామీ పథకం పనికి ఉండే డిమాండ్‌కు కీలకమైనది. కానీ ఈ ఆప్ ద్వారా హాజరు నమోదు ప్రక్రియ, కార్మికులు రోజంతా పని ప్రదేశంలో అనివార్యంగా ఉండే పరిస్థితికి దారి తీస్తుంది. ఇది ఉపాధి కూలీల ఇబ్బందులకు కారణమవుతుంది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ప్రియాదేవి తన ఉపాధి హామీ పనిని ఉదయం 9 గంటల కల్లా పూర్తిచేసి, తన తోటలో పండించిన ఉత్పత్తులను స్థానికంగా ఉండే మార్కెట్లో అమ్ముతుంది. ఈ ఎన్ఎంఎంఎస్ ఆప్ ప్రవేశపెట్టడంతో ఆమె పని ప్రదేశంలో రోజంతా ఉండాల్సి వస్తుంది లేదా తన హాజరు నమోదు కోసం పని ప్రదేశాలకు రెండుసార్లు వెళ్ళాల్సి వస్తుంది. తాను లేని సమయంలో తన ఉత్పత్తులుకొనే వినియోగదారులను కోల్పోవాల్సి వస్తుందని బాధను వ్యక్తం చేసింది. తాను చేయాల్సిన ఇంటి పనులన్నీ తన కూతురు చేయాల్సి రావడంతో తన కూతురు తరచుగా పాఠశాలకు వెళ్లకుండా ఉండే పరిస్థితి ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరొక ఉపాధి హామీ కూలీ తెలిపింది.

ఎన్ఆర్ఈజీఏ కింద పనిచేసే మహిళా కూలీల సంఖ్య చాలా ఎక్కువగా (2021-2022 ఆర్థిక సంవత్సరంలో 54.7శాతం) ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల పని పరిస్థితులను మార్చడంలో ఈ పథకం చాలా కీలకంగా ఉంటూ వస్తుంది. సాంప్రదాయంగా వస్తున్న కుటుంబ భారాన్ని మహిళలే మోస్తుండడంతో, కొత్తగా పుట్టుకొచ్చిన ఈ ఆప్ మహిళా కూలీలపై తీవ్రంగా ప్రభావం చూపిస్తున్నది. ఉపాధి హామీ హాజరు నమోదు ప్రక్రియ ఈ ఎన్ఎంఎంఎస్ ఆప్ ద్వారా జరుగుతుండడంతో కూలీల పరిస్థితి సందిగ్ధావస్థలో పడి, ఉపాధి హామీ పనిని వదులుకునే పరిస్థితికి చేరుకున్నారు. దేశ వ్యాప్తంగా అనేక మంది ఉపాధి హామీ మహిళా కూలీలు తమ మానసిక స్థితిని మా ముందు వ్యక్తం చేశారు.

ఇతర సవాళ్ళు

ఈ ఎన్ఎంఎంఎస్ ఆప్ అమలులో కొన్ని ఇతర సవాళ్ళు కూడా ఉన్నాయి. వాస్తవ సమయం పర్యవేక్షణలో ఒక స్థిరమైన నెట్ వర్క్ అందుబాటులో ఉండాలి, దురదృష్టవశాత్తు అనేక గ్రామీణ భారత ప్రాంతాల్లో నెట్‌వర్క్ చాలా అసమానంగా ఉంటుంది. ఈ కారణంగా కూలీలు తమ హాజరును సరిగా నమోదు చేసుకోలేక పోవడంతో వారు తమ దినసరి వేతనాలను కోల్పోతున్నారు. ఈ నెట్ వర్క్ అందుబాటులో లేని కారణంగానే కేరళ, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు తమ హాజరును నమోదు చేసుకోవడంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల 'న్యూస్ క్లిక్' నివేదిక కూడా తమిళనాడుకు చెందిన ఉపాధి హామీ కూలీలు ఈ ఆప్ ద్వారా తమ హాజరును నమోదు చేసుకోవడంలో ఇబ్బందుల్ని ఎదుర్కొన్న విషయాన్ని బయటపెట్టింది.

ఈ ఆప్ ఎన్ఆర్ఈజీఏ మేట్లపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. చేసిన పనిని కొలిచి, కూలీల హాజరు నమోదు చేసే విధంగా పంచాయతీ స్థాయిలో స్థానిక మహిళలను సంసిద్ధం చేసే బాధ్యత మేట్లకు ఉంటుంది. కానీ ఇప్పుడు మేట్‌గా బాధ్యతలు స్వీకరించాలంటే ఆ మేట్‌కు ఒక స్మార్ట్‌ఫోన్ ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కొత్త నిబంధన వేల మంది మహిళలు మేట్లుగా మారకుండా అనర్హుల్ని చేసింది. ఈ కారణంగానే తాము మేట్లుగా అర్హత పొందకుండా ఉన్నామని ఇప్పటికే జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మహిళలు తెలిపారు. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లు ఉన్న పురుషులకు మేట్లుగా ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇక ఈ ఎన్ఎంఎంఎస్ ఆప్‌ను ఉపయోగించడంలో తమకు సరియైన శిక్షణ ఇవ్వలేదని ఎంపికైన అనేక మంది మేట్లు చెప్పారు. ఫలితంగా కార్మికుల హాజరు నమోదులో ఏర్పాడే దోషాల కారణంగా వారి వేతనాల చెల్లింపులు కోతకు, జాప్యానికి గురవుతాయి.

ప్రక్రియలో దోషాలు

ఈ ఎన్ఎంఎంఎస్ ఆప్‌ను పైలట్ ప్రాజెక్టుగా గత సంవత్సరం ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ ఆప్ అమలులో చాలా దోషాలున్నాయని అధికారులు, కార్యకర్తలు అనుభవపూర్వకంగా ధృవీకరించారు. కానీ వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలేవీ అందుబాటులో లేవు. సమాచార హక్కు దరఖాస్తులు కూడా ఎటువంటి సంతృప్తికరమైన పరిష్కారాలను చూపలేదు. ఈ ఆప్ అమలులో దోషాలు కొనసాగుతున్నప్పటికీ, మే 13,2022న ఎన్ఆర్ఈజీఏ పని ప్రదేశాల్లో (20మంది కంటే ఎక్కువ కార్మికులు ఉన్నచోట) ఎన్ఎంఎంఎస్ ఆప్ తప్పకుండా అమలు చేయాలనీ, ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప మాన్యువల్ హాజరుకు ఎలాంటి అవకాశం లేదని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈ సర్క్యులర్ జారీ అయిన వారం రోజుల లోపు అనేక మంది, పైలట్ ప్రాజెక్టులో ఏర్పడిన దోషాల లాంటి దోషాల గూర్చి ఫిర్యాదులు సమర్పించారు. కానీ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఇంతవరకు ఎలాంటి పరిష్కారాల్ని చూపలేదు, ఎలాంటి హామీలు ఇవ్వలేదు.

భౌతికంగా లేని రికార్డులు

చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పథకాల పర్యవేక్షణకు హామీ ఇవ్వడం, పారదర్శకతను పెంచడం ద్వారా పౌరుల బాధ్యతను పెంచే లక్ష్యంతో ఈ ఆప్ ఏర్పడిందని



చెపుతున్నారు. కానీ వాస్తవంలో దానికి పూర్తి విరుద్ధంగా జరుగుతున్నట్లు కనిపిస్తున్నది. కార్మికులు సంతకాలు చేసిన హాజరు రికార్డులు లేకుంటే వారు చేసిన పనికి, పనికి హాజరైన రుజువులు ఎలాంటివి కార్మికుల వద్ద ఉండవు. ఎన్ఆర్ఈజీఏ ప్రాజెక్టులో పని చేసినవారి హాజరు రికార్డులు ఎన్ఆర్ఈజీఏ వెబ్సైట్‌లో కూడా లేవని జార్ఖండ్ రాష్ట్రంలోని సింఘ్ భూమ్ జిల్లాకు చెందిన కార్మికులు చెప్పారు. కార్మికులు రుజువుగా ఉపయోగించే భౌతిక రికార్డులు అందుబాటులో లేకుంటే వారు పనికి హాజరైనట్టు రుజువు చేసే మార్గాలేవీ వారికి లేకపోవడంతో పని చేసిన దానికి వారు వేతనాలు కోల్పోతారు. ఇది ఎన్ఎంఎంఎస్ ఆప్ మెరుగుపరిచే పేరుతో పారదర్శకతను, పౌరుల బాధ్యతను హరిస్తున్న తీరు.

ఎన్ఆర్ఈజీఏలో అవినీతి పెరిగిపోతున్న ఒక సమస్యగా మారుతున్నది. నకిలీ హాజరు రికార్డుల ద్వారా నిధులు కైంకర్యం అవుతున్నాయి. వాస్తవ సమయం, హాజరుపై ఎన్ఎంఎంఎస్ దృష్టి పెట్టడం అవినీతిని పరిష్కారించే మార్గం, అయితే ఈ అవినీతి పైన, దాన్ని పరిష్కారించే ఎన్ఎంఎంఎస్ విధానం పైన గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ స్పష్టత ఇవ్వలేదు. పారదర్శకత లేదా వేగవంతమైన చెల్లింపుల ప్రక్రియల విషయంలో ఎన్ఎంఎంఎస్ ఆప్ పనితీరును అంచనా వేయడానికి ఎలాంటి

> స్థిరమైన పని సమయాలున్న కార్మికుల హాజరును పర్యవేక్షించేందుకు ఈ ఆప్ ఉపయోపడుతుండగా, అనేక రాష్ట్రాల్లో, ఉపాధి హామీ పనుల వేతనాలు ప్రతి రోజు చేసిన పని ఆధారంగా లెక్క కడతారు. కార్మికులు స్థిరమైన పని గంటలకు కట్టుబడి ఉండే అవసరం లేదు. ఈ సౌకర్యమే ఉపాధి హామీ పథకం పనికి ఉండే డిమాండ్‌కు కీలకమైనది. కానీ ఈ ఆప్ ద్వారా హాజరు నమోదు ప్రక్రియ, కార్మికులు రోజంతా పని ప్రదేశంలో అనివార్యంగా ఉండే పరిస్థితికి దారి తీస్తుంది. ఇది ఉపాధి కూలీల ఇబ్బందులకు కారణమవుతుంది.

కొలమానాలు లేవు.

సామాజిక తనిఖీలు బలోపేతం చేయాలి

ఈ ఆప్‌పై కేంద్రీకరించడానికి లేదా ఇతర సంక్లిష్టమైన సాంకేతిక సంస్కరణలను ప్రవేశపెట్టడానికి బదులుగా సామాజిక తనిఖీలు బలోపేతం చేయాలని మేం బలంగా నమ్ముతున్నాం. ఎన్ఆర్ఈజీఏ వారి పంచాయతీ పరిధిలో ఎలా పనిచేస్తుందో వారే చెబుతారు. గతంలో తనిఖీలు బాగా జరిగేవి. కానీ సామాజిక తనిఖీ యూనిట్లు, గ్రామసభలు లాంటి పౌర కేంద్రీకృత సంస్థలను బలోపేతం చేయడానికి బదులు కార్మికులకు అందుబాటులో లేని, వారికి అర్థంకాని సాంకేతిక సంస్కరణలను ప్రవేశపెట్టడానికి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ దృష్టి పెడుతున్నట్టు కనపడుతున్నది.

పౌరుల బాధ్యత, పారదర్శకతలను మెరుగు పరిచేందుకు ఉద్దేశించబడిన ఆప్, ఎన్ఆర్ఈజీఏ కార్మికులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఫీల్డ్ అధికారులతో చర్చించకుండానే అమలు చేయడం హాస్యాస్పదంగా ఉంది. ఎన్ఆర్ఈజీఏ క్షేత్రస్థాయిలో వాస్తవ పనితీరు పట్ల ఎన్ఎంఎంఎస్ చాలా గుడ్డిగా వ్యవహరిస్తుంది. భాగస్వాములతో ఎలాంటి చర్చలు చేయకుండా సంస్కరణలను ప్రవేశపెట్టే గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అలవాటు ఎన్ఆర్ఈజీఏలో పొందుపరిచిన పారదర్శకత, పౌర భాగస్వామ్య సూత్రాలకు అనుగుణంగా లేదు. ఎన్ఎంఎంఎస్ అమలులోని అనేక సమస్యల వల్ల ఎన్ఆర్ఈజీఏ కింద పని చేయడం కార్మికులకు కష్టంగా ఉంది. ఫలితంగా కార్మికులు పని చేసే హక్కును కోల్పోతున్నారు.


"ద హిందూ" సౌజన్యంతో
అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

జోషీమఠ్... మానవ తప్పిదమే

పర్యావరణ లేదా సామాజిక సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా చేపట్టే అభివృద్ధి పనులు ప్రగతికి దారి తీయవని... అధికారులను ముఖ్యంగా ప్రస్తుత ప్రభుత్వ హయాంలోని అధికార యంత్రాంగాన్ని ఒప్పించాలంటే పూర్తిగా విపత్తు జరిగితే కాని వారికి అర్థమవనట్లు కనిపిస్తోంది. బద్రీనాథ్‌కు ముఖద్వారంలా భావించే పవిత్ర పట్టణమైన జోషీమఠ్‌లో చోటు చేసుకుంటున్న విషాదం, ఉత్తరాఖండ్ హిమాలయాల్లో వరుసగా జరుగుతూ వస్తున్న విషాదాలు, విపత్తుల్లో తాజాది. అడ్డూ అదుపులేని నిర్మాణాలు, మౌలిక వసతులు, పట్టణీకరణ వంటి చర్యల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని పశ్చిమ హిమాలయాల్లో ఇలా మానవ తప్పిదాల కారణంగా సంభవిస్తున్న విపత్తులు ఇటీవల కాలంలో బాగా ఎక్కువవుతున్నాయి. మానవ ప్రేరిత వాతావరణ మార్పులు-భారీగా వర్షాలు పడడం ఫలితంగా వరదలు సంభవించడం, కొండ చరియలు విరిగిపడడం వంటివి-ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.

ఆరు వేల అడుగుల ఎత్తులో ఉన్న జోషీమఠ్‌లో చాలా చోట్ల నేల కుంగుతుండడంతో పెద్దగా పగుళ్ళు ఏర్పడి ఇళ్ళు, భవనాలు, రోడ్లు బీటలు వారుతున్నాయి. పట్టణంలో దాదాపు నాలుగో వంతు ఇలాగే దెబ్బ తింది. ఇప్పటి వరకు బాగా ప్రభావితమైన నాలుగు జోన్‌లలో 720కి పైగా ఇళ్ళు తీవ్రంగా దెబ్బ తిన్నాయని అంచనా వేశారు. 89 భవనాలను తక్షణమే కూల్చివేసేందుకు గుర్తించారు. ఇవి నివాసయోగ్యతకు అనువుగా లేవని, పైగా వీటివల్ల సమీప భవనాలు కూడా ప్రమాదంలో పడతాయని భావించారు. ఆ 89 భవనాల్లో నివాస భవంతులు, హోటళ్ళు ఉన్నాయి. వందలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మిగిలినవారు ఈ తరలింపు ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా, గతంలో పదే పదే హెచ్చరికలు వచ్చినప్పటికీ వాటిని పట్టించుకోకుండా జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం చివరకు కేంద్ర ప్రభుత్వం కూడా చాలా ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే తమ పట్టణం ఇంతలా విధ్వంసానికి గురవుతోందంటూ జోషీమఠ్ బాధితులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆందోళనలకు దిగుతున్నారు. దెబ్బతిన్న భవనాల నుండి తక్షణమే తమను తాత్కాలిక షెల్టర్లకు తరలించాలని, నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమను కూడా దేశంలోని 'అభివృద్ధి శరణార్థుల' జాబితాలో చేర్చాలని కోరుతున్నారు. ఒకపక్క ప్రజలు తమ ఇళ్ళను, ఆదాయాలను, జీవనోపాధులను కోల్పోతుంటే... మరోపక్క కాంట్రాక్టర్లు, కమర్షియల్ ప్రాజెక్టులు మాత్రం విధ్వంసకర అభివృద్ధి ఫలాలను అనుభవిస్తున్నారు. జోషీమఠ్ విపత్తు వల్ల దెబ్బతిన్న వారికి, ప్రభుత్వ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యానికి బాధితులైన వారందరికీ పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించాలి. తమకు రావాల్సిన వాటి కోసం నిరవధికంగా వేచివుండే పరిస్థితి లేకుండా తక్షణమే వారికి అందాల్సిన నష్టపరిహారం అందచేయాలి.

అయితే, సున్నితంగా ఉండే పర్వత పర్యావరణ వ్యవస్థను, దాని దుర్బలత్వాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రమాదకరమైన పట్టణీకరణ చర్యలు చేపట్టడం, రహదారులు, జల విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి నిర్మాణ కార్యకలాపాలను కొనసాగిస్తున్న సమస్యను తప్పనిసరిగా పరిష్కరించాల్సి ఉంది. జోషీమఠ్ విపత్తు తర్వాత తక్షణ స్పందన చర్యలకు సంబంధించిన నిర్ణయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారుల సమావేశంలో తీసుకున్నారు. జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ, భారత జియాలాజికల్ సర్వే, జాతీయ జల విద్యుత్ సంస్థలు గతంలో ఇచ్చిన నివేదికలు, వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియా లజీ పెంచిన ప్రమాద సూచికలను పట్టించుకోలేదు. దాదాపు 50ఏండ్ల క్రితం నాటి ప్రఖ్యాత ఎం.సి.మిశ్రా కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ నివేదికతో సహా ఈ సంస్థలు ఇచ్చిన అధ్యయనాల నివేదికలు, ఇతర



> పదే పదే హెచ్చరికలు వచ్చినప్పటికీ వాటిని పట్టించుకోకుండా జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం చివరకు కేంద్ర ప్రభుత్వం కూడా చాలా ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే తమ పట్టణం ఇంతలా విధ్వంసానికి గురవుతోందంటూ జోషీమఠ్ బాధితులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆందోళనలకు దిగుతున్నారు. దెబ్బతిన్న భవనాల నుండి తక్షణమే తమను తాత్కాలిక షెల్టర్లకు తరలించాలని, నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


నిపుణులు ఈ ప్రాంత భౌగోళిక స్వరూపాన్ని, భూకంపాల పరంగా ఈ ప్రాంత దుర్బలత్వాన్ని, ప్రధాన నిర్మాణ కార్యకలాపాల పర్యవసాన ప్రమాదాలను నొక్కి చెప్పాయి. చాలా బలహీనమైన, అస్థిరమైన నేలపై... గతంలో కొండ చరియలు విరిగిపడడం, హిమనదీ ప్రవాహాల వల్ల వదులైన నేలతో కూడిన రాతి ఉపరితలంపై... జోషీమఠ్, ఈ ప్రాంతంలోని పలు ఇతర పట్టణాలు నిర్మించబడ్డాయని ఈ నిపుణులు తెలిపారు. దీనివల్ల నివాసితులు, పర్యాటకుల పరంగా ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్న భారాలను మోసే సామర్థ్యం పరిమితమవుతోంది. భూకంపాలు వచ్చే జోన్-5గా ఈ ప్రాంతాన్ని వర్గీకరించారు. అంటే భూకం పాలు ప్రకంపనలు రావడానికి అత్యధికంగా అవకాశమున్న ప్రాంతంగా గుర్తించారు. దీనికి తోడు, ఈ ప్రాంతంలో బ్లాస్టింగ్‌లు జరపడం, సొరంగాలు తవ్వడం వంటి భారీ నిర్మాణ కార్యకలాపాలతో పరిస్థితి మరింత తీవ్రతర మైంది. పేలవమైన నిర్మాణ ప్రణాళికల కారణంగా సహజసిద్ధమైన నీటి పారుదలకు ఆటంకం ఏర్పడి స్తంభించిపోవడం కూడా ఈ ప్రాంత అస్థిరతకు, కొండచరియలు ఎక్కువగా విరిగి పడేందుకు కారణమైంది. ఫలితంగా, జోషీమఠ్ ప్రాంతం ఏడాదికి 6.5 సెంటీమీటర్లు చొప్పున కుంగుతోందని ఉపగ్రహ డేటా వెల్లడిస్తోంది.

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ దామి దీన్ని ప్రకృతి విపత్తుగా అభివర్ణిస్తూ, తప్పుదారి పట్టిస్తున్నారు. కాగా మరోవైపు ఎన్‌టిపిసి చేపట్టిన తపో వన్-విష్ణుఘడ్ జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాల్లో భాగంగా చేపట్టిన సొరంగం పట్టణానికి, జోషీమఠ్-బద్రీనాథ్ హైవేకి దగ్గరగా ఉంది. అయితే స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో దీన్ని నిలిపివేశారు. ఈ ప్రాంతంలో పేలుళ్ళను నిషేధించారు. కానీ వివిధ నిర్మాణ ప్రాంతాల్లో బ్లాస్టింగ్ షెడ్యూళ్ళను ప్రకటించే సైన్ బోర్డులను స్థానికులు ఎత్తి చూపిస్తున్నారు. ఇప్పటికీ, నిర్మాణాలపై నిషేధం ఉన్నప్పటికీ, ఎలాంటి పర్యవేక్షణ లేకపోతే, ఏదో కొంత నిర్మాణ కార్యకలాపాలు ఆ ఏరియాలో కొనసాగుతూనే ఉంటాయని టి.వి చానెళ్లు చెబుతున్నాయి. ఇలా మొత్తంగా నియంత్రణ లేకపోవడం, నిబంధనల అమలు లేకపోవడం అనేది ఈ ప్రాంతంలోని మౌలిక నిర్మాణ కార్యకలాపాలన్నిట్లో కనిపిస్తుంది. ప్రధాన పుణ్యక్షేత్రాలతో కలిపే ప్రసిద్ధ చార్‌ధామ్ హైవేను విస్తరించడానికి సుప్రీం కోర్టు అనుమతిం చింది. దాంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగింది. ఆ కార్యకలాపాలపై ఎలాంటి నియంత్రణలు విధించలేదు. 'ఎలాంటి మూల్యాన్ని చెల్లించైనా అభివృద్ధిని సాధించాలనే' ఈ వైఖరికి జోషీమఠ్ ఈనాడు మూల్యాన్ని చెల్లిస్తోంది.

జోషీమఠ్‌లోని ఇతర ప్రాంతాల్లో కూడా రాబోయే నెలలు, సంవత్సరాల్లో ఇలా నేల కుంగు బాటుకు గురయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాంతం లోని ఇతర పట్టణాలు, ప్రాంతాలు కూడా ఇలాగే దుర్బలంగా ఉన్నాయి. రుద్రప్రయాగ్ లోయలో కూడా ఇప్పటికే ఇండ్లకు, ఇతర భవనా లకు పెద్ద పెద్ద పగుళ్లు వస్తున్నట్లు వార్తలు వచ్చాయి.

ప్రస్తుతం జోషీమఠ్ విపత్తును ఎదుర్కొన డానికి ఏ విధమైన చర్యలు తీసుకున్నా దానికన్నా ముందుగా దుర్బలమైన పశ్చిమ హిమాలయాల పర్వత సానువుల్లో మౌలిక వసతులు, ఇతర నిర్మాణ కార్యకలాపాలకు సంబంధించి అవసరమైన సమగ్ర సమీక్ష జరగాల్సి ఉంది. స్థానికులకు, పర్యాటకులకు జరిగే ప్రమాదాన్ని కనీస స్థాయికి తగ్గిస్తూ పర్యావరణ పరంగా సున్నితమైన అభివృద్ధిని సాధించే దిశగా బాగా ఆలోచించిన మార్గాన్ని అనుసరించాల్సి ఉంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)



ఆధునిక శాస్త్రసాంకేతికతను ఆకలింపు చేసుకోలేమా..!

వివిధ డిజిటల్ అంతర్జాల మాధ్యమ వేదికల్లో సమాచారాన్ని టైప్ చేయడం, సమాచారాన్ని అన్వేషించడం, సమాచారాన్ని మూల్యాంకనం చేయడం, సమాచారాన్ని వితరణ చేయడం లాంటి ఆధునిక యుగపు పరిజ్ఞానం కలిగిన పౌరులను 'డిజిటల్ లిటరేట్స్'గా వర్గీకరిస్తారు. ప్రపంచవ్యాప్తంగా 15-24ఏండ్ల లోపు యువతలో 71శాతం ఇంటర్నెట్ వాడుతున్నారని, డిజిటల్ అసమానతలతో 346మిలియన్ల యువత (పేద అభివృద్ధి చెందిన దేశాలు) ఇంటర్నెట్‌కు దూరంగా ఉన్నారని తేలింది. ఇండియాలో 38శాతం కుటుంబాలు (61శాతం పట్టణ, 25శాతం గ్రామీణ) డిజిటల్ లిటరసీ కలిగి ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల ఇంటర్నెట్ లిటరసీ జాబితాలో భారత ర్యాంకు 73గా విశ్లేషించారు. డిజిటల్ టెక్నాలజీతో ఉత్పత్తి, కార్యదక్షత, వనరుల నిర్వహణ, పారదర్శకత, అత్యున్నత ఖచ్చితత్వం, సంతృప్తికర సేవలు, జవాబుదారీతనం, ఇన్నొవేషన్, వేగంగా మార్కెటింగ్, ఆదాయవృద్ధి, సమకాలీనత లాంటి అనేక అభివృద్ధి సాధన ప్రయోజనాలు ఉన్నాయి. అదే సమయంలో అంతకు మించిన సవాళ్ళూ ఉన్నాయి.

డిజిటల్ యుగపు సవాళ్ళు: అంతర్జాల అయోమయ, మాయాజాల, కృత్రిమ వలలో చిక్కిన నేటి యువత తీవ్రమైన బహుమితీయ సవాళ్ళను, ప్రమాదకర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తున్నది. డిజిటల్ యుగ యువత ఎదుర్కొంటున్న ముఖ్య సవాళ్ళలో సామాజిక(సోషియల్), భౌతిక(ఫిజికల్), మానసిక(సైకలాజికల్), నైతిక(మోరల్) అంశాలు అనేకం దాగి ఉన్నాయి.

సామాజిక (సోషయల్) సవాళ్ళు: చిరుప్రాయం నుంచే ఇంటర్నెట్ అద్భుత వలయంలో గంటల పాటు గడుపుతున్న డిజిటల్ కాలంలో ఏకాంతంలో కంప్యూటర్ గేమ్స్, సామాజిక మాద్యమాల్లో విహారాలతో మానవ సంబంధాలు బలహీణ పడడం, నేత్ర జబ్బులు, అశ్లీల పోస్టుల పరిచయాలు, లైంగిక దురాలోచనలు, అత్యాచారాలు, సైబర్ బుల్లీయింగ్, అక్రమ మానవ రవాణలు, విచిత్ర ప్రవర్తనలు, బాలలపై అత్యాచారాలు, సామాజం నుంచి వెలి వేసిన భావన, అభ్యంతరకర ప్రవర్తన, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడం, ఆత్మహత్య ధోరిణి, బాల కార్మికులు, వెట్టిచాకిరీ, చదువుపై ఏకాగ్రత లోపించడం, ఆటపాటలకు దూరం కావడం, వ్యక్తిత్వ వికాసం ఆగి/తరిగి పోవడం, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నం కావడం, సామాజిక ఘర్షణలు లాంటి అవలక్షణాలు కలుగుతాయి.

శారీరక (ఫిజికల్) సవాళ్ళు: గంటల తరబడి అంతర్జాలాన్ని పట్టుకొని సోఫాలు, కుర్చీలు, బెడ్స్‌కు వేలాడడం వల్ల శారీరక వ్యాయామాలు లోపించడంతో బాల్యంలోనే స్థూలకాయ సమస్యలు, ఫాస్ట్ ఫుడ్స్ పట్ల వ్యామోహం, కదలిక లేని నిశ్చల జీవనశైలితో నేటి బాలలు, మానసిక ఒత్తిడి, నేర ప్రవృత్తి, ఆన్‌లైన్ మోసాలు, ఆత్మన్యూనత భావన, వ్యక్తిగత సమాచారాన్ని దాచి పెట్టడం లాంటి పలు తీవ్రమైన శారీరక మానసిక సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. డిజిటల్ ఉపకరణాల వలలో చిక్కి దృష్టి, కీళ్ళు, కండరాలు, వెన్నెముక, ఒత్తిడి, చర్మ, శ్వాస, మానసిక, నిద్రలేమి సమస్యలకు దారి తీస్తున్నాయి.

మానసిక (సైకలాజికల్) సవాళ్ళు: డిజిటల్ వలయ దుష్ప్రభావంతో పిల్లల్లో పలు మానసిక సమస్యలు కనిపిస్తాయి. అసాంఘిక ప్రవర్తనలు, లైంగిక వికృతాలోచనలు, కులమత వివక్షలు, వికృత క్రీడలు, మహిళల పట్ల విపరీత ధోరిణి, మానసిక విపరీతాలు లాంటి అనేక సమస్యలు యువత భవితకు అడ్డుగా నిలుస్తున్నాయి.

నైతిక, మతపర (మోరల్, రిలిజియస్) సవాళ్ళు: సాంస్కృతిక, నైతిక, మతపరమైన విపరీత ప్రవర్తనలతో పాటు ఛాందస వాదనలు, మత విద్వేషాలు, రెచ్చగొట్టే ఉపన్యాసాలు, భావ కాలుష్యాలు, జాతి వర్ణ వర్గ వివక్షలు, అసహనం, తీవ్రవాద ఆలోచనలు, ఉగ్రవాద భావనలు, అశాంతి, అస్థిర సమాజం లాంటి సమస్యలు పిల్లల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అశ్లీల మాద్యమాలు అరచేతిలో అందుబాటులో ఉన్నందున ఆల్కహాల్, డ్రగ్స్, స్మోకింగ్ కన్న అతి ప్రమాదకరమైన దుష్పరిణామాలైన లైంగిక హింసలు, మహిళ వేధింపులు, అత్యాచార హత్యలు లాంటి అనైతిక సమస్యలు పెరుగుతున్నాయి. స్మార్ట ఫోన్ రూపంలో నీలి వీడియోలు అందుబాటులోకి రావడంతో బాలికల్లో 33శాతం, బాలల్లో 13శాతం లైంగిక హింసకు గురికావడం జరిగినట్లు తేలింది.

డిజిటల్ యుగంలో అద్భుత అవకాశాలు: విద్య, డిజిటల్ నైపుణ్యం, ఆశావహ దృక్పథం కలిగిన యువతకు డిజిటల్ ప్రపంచం రెడ్ కార్పెట్ వెల్‌కమ్ పలుకుతోంది. పుట్టుకతోనే ఇంటర్నెట్ అనుభవిస్తున్న పిల్లల్ని 'డిజిటల్ నేటివ్స్', ఇంటర్నెట్ వినియోగాన్ని నేర్చుకుంటున్న పెద్దల్ని 'డిజిటల్ ఇమ్మిగ్రాంట్స్'గా తరాలను వర్గీకరించాల్సి వస్తున్నది. డిజిటల్ ప్రపంచంలో విహరిస్తున్న నేటి బాలబాలికలు, యువతీయువకులు తీవ్రమైన సమస్యలతో సంసారం చేస్తూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భావోద్వేగ రోగులుగా మిగిలి పోవడంతో ప్రపంచ మానవాళి భవిత ప్రశ్నార్థకం అవుతున్నది. డిజిటల్ విప్లవ సునామీతో యువతకు అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దారులు తెరుచుకున్నాయి. ఆధునిక యువత మారుతున్న శాస్త్ర సాంకేతికతలను ఆకలింపు చేసుకొని, క్రమం తప్పకుండా శాస్త్రసాంకేతికత లను ఒంటపట్టించుకొని, ఇందులోని సాను కూలతలను ప్రతికూలతను ఆకళింపుకుని వ్యవహరిస్తేనే పురోగమనం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి , సెల్: 9949700037

నియమాలు పాటించండి

ప్రతి సంవత్సరం డబ్బు నిర్వహణకు సంబంధించిన ఆర్థిక ప్రణాళికలు రచించుకోవడం.. వాటిని చేరుకోవడంలో విఫలమవడం.. చాలామంది విషయంలో జరిగేదే. దాంతో డబ్బు వృధా అవడంతో పాటు వెనక్కి తిరిగి చూసుకుంటే అనుకున్న పని ఒక్కటీ పూర్తి కాదు. మరి ఇలాంటి అలసత్వానికి చెక్ పెట్టాలంటే కొన్ని నియమాలు పాటించాలంటున్నారు నిపుణులు. దీనివల్ల ఏడాదంతా ఆర్థిక స్థిరత్వం సాధించడంతో పాటు డబ్బుతో ముడిపడి ఉన్న పనులన్నీ సవ్యంగా పూర్తయ్యే అవకాశాలూ ఉన్నాయంటున్నారు. అవేంటో తెలుసుకుందాం...



డబ్బు పొదుపు చేసే విషయంలో 'వచ్చే నెల నుంచి మొదలుపెడతా!' అనే నియమం పెట్టుకుంటారు కొందరు. ఇక నెలలు గడిచినా దాన్ని ఆచరణలో పెట్టరు. అయితే ఈ వాయిదాను వాయిదా వేయాలంటే.. ఈ ఏడాది నుండే కచ్చితంగా 'మనీ సేవింగ్ ఛాలెంజ్' తీసుకోమంటున్నారు నిపుణులు. మీకొచ్చే ఆదాయంలో ఖర్చులు పోను.. దేనికెంత డబ్బు పక్కన పెట్టాలనుకుంటున్నారో ముందుగా ఓ ప్రణాళిక వేసుకోవాల్సి ఉంటుంది. అంటే నెలవారీ ఖర్చుల కోసం మినహాయించి.. మిగతా డబ్బులో అత్యవసర నిధి, ప్రయాణ నిధి, ఇంకా ఇంటికి కావాల్సిన వస్తువులేవైనా కొనాలనుకుంటే వాటి కోసం.. ఇలా విడివిడిగా కొంత మొత్తంలో డబ్బులు దాచుకోవడం మొదలుపెట్టాలి. ఇలా చేయడం వల్ల ఒక దాని కోసం దాచిన డబ్బును మరొకదానికి వినియోగించాల్సిన అవసరం రాదు. ఫలితంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తపడచ్చు.



అవగాహన పెంచుకోండి

'మహిళలకు డబ్బు నిర్వహణ తెలియదు.. ఎంత డబ్బు సంపాదిస్తున్నా.. దాని పొదుపు-మదుపుల దగ్గరికొచ్చేసరికి మాత్రం ఇంట్లో ఉండే మగాళ్ల పైనే ఆధారపడతారు..' అనుకుంటారు చాలామంది. అయితే ఎంతోమంది మహిళలు ఆర్థిక విషయాల్లో అవగాహన పెంచుకొని సమాజంలో ఉన్న ఈ ధోరణిని క్రమంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాదు.. కోట్లు పెట్టుబడి పెట్టి సొంతంగా వ్యాపారాలు చేస్తున్నారు.. లాభాలూ ఆర్జిస్తున్నారు. ఈ కొత్త ఏడాదిలో మీరూ వాళ్ల జాబితాలో చేరచ్చు. పెట్టుబడులు, పొదుపు-మదుపులు, నష్టపోకుండా డబ్బును పొదుపు చేసే ఇతర మార్గాలేంటి?.. ఇలా ఆర్థికంగా ప్రతి విషయంలో అవగాహన పెంచుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో అవసరమైతే నమ్మకస్తులైన నిపుణుల సహాయం తీసుకోండి. అయితే ఇలా కొత్తగా తెలుసుకునే సమయంలో ఒక్కోసారి కొంత డబ్బు నష్టపోయినా బాధపడద్దు. ఎందుకంటే దానివల్ల మనకు బోలెడన్ని విషయాలు తెలుస్తాయి. ఇలా ఇకపై మీ డబ్బు నిర్వహణ బాధ్యతలన్నీ మీరే చూసుకోవడం వల్ల మరికొంతమందిలో స్ఫూర్తి నింపచ్చు.



అనుకున్నవి అనుకున్నట్టుగా

కొత్త సంవత్సరంలో ఇల్లు కట్టుకోవాలి, ఫ్లాట్ తీసుకోవాలి, ఇంటి స్థలం కొనుక్కోవాలి, కొత్త వ్యాపారం ప్రారంభించాలి.. ఇలా ఎంతోమందికి ఎన్నెన్నో కలలు, ఆశయాలు. కానీ అవి నెరవేరేది కొంతమంది విషయంలోనే అని చెప్పచ్చు. అయితే చాలామంది విఫలమవడానికి సరైన ప్రణాళికలు వేసుకోకపోవడమే ప్రధాన కారణం అంటున్నారు నిపుణులు. కాబట్టి అనుకున్న పనులు అనుకున్నట్టుగా పూర్తి కావాలంటే.. ఆదాయంలో నుంచి కొంత డబ్బు వెనకేసుకోవడమే ముందున్న మార్గమంటున్నారు.

ఆదనపు ఆదాయం

వచ్చే జీతం సరిపోక ఆ ఏడాదంతా ఆర్థిక కష్టాలు ఎదుర్కొనే వారూ లేకపోలేదు. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే.. అదనపు ఆదాయ మార్గం వెతుక్కోవడం మేలంటున్నారు నిపుణులు. అంటే.. ఒకేసారి రెండు ఉద్యోగాలు చేయమని దాని ఉద్దేశం కాదు.. వారాంతాల్లో లేదా సమయం దొరికినప్పుడు మీలోని సృజనకు పదును పెట్టి.. విభిన్న వస్తువులు తయారుచేయచ్చు. మీకు ఫ్యాషన్ డిజైనింగ్ వచ్చుంటే.. ఖాళీ సమయాల్లో ఆయా దుస్తుల్ని డిజైన్ చేయడంపై దృష్టి సారించచ్చు. మీలో ఉన్న సృజనను, వివిధ రకాల నైపుణ్యాలను వీడియోల రూపంలో రూపొందించి.. సోషల్ మీడియాలో పోస్ట్ చేయచ్చు.. ఇలా ఆలోచించాలే కానీ అదనపు ఆదాయ మార్గాలకు కొదవే లేదు.

బాగా ఆలోచించండి

దుస్తులు, చెప్పులు, ఇతర యాక్సెసరీస్.. ఇలాంటి విషయాల్లో చాలామంది అమ్మాయిలు అస్సలు రాజీ పడరు. కావాలంటే ఒక జత ఎక్కువే కొని పెట్టుకుంటారు.. కానీ అస్సలు అడ్జస్ట్ అవ్వరు. అయితే ఇలా అదనంగా కొనే వస్తువుల విషయంలో కాస్త ఆలోచించాల్సిందే అంటున్నారు నిపుణులు. ఎందుకంటే అది మీకు నిజంగానే అవసరమా? లేదంటే ఇతరుల్ని చూసి మీరు కావాలనుకుంటున్నారా? అనేది ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. అలాగే మీరు కొనాలనుకున్న వస్తువులు కూడా ఏదైనా 'డిస్కౌంట్ ఆఫర్స్', 'క్యాష్ బ్యాక్', 'కూపన్ కోడ్స్'.. వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్న షాపింగ్ వెబ్‌సైట్స్ నుంచి కొనుగోలు చేయడం ఉత్తమం. ఇక ఆఫ్‌లైన్‌లో కొనాలనుకున్న వారు.. పండగలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో ఆయా షాపుల్లో పెట్టిన 'డిస్కౌంట్ సేల్స్' వినియోగించుకుంటే డబ్బూ ఆదా అవుతుంది. కావాలనుకున్న వస్తువులూ మన సొంతమవుతాయి.

వారి మనసు తెలుసుకుంటూ...



తల్లిదండ్రుల ప్రేమానుబంధం.. చిన్నారుల ఎదుగుదలపై మంచి ప్రభావాన్ని చూపిస్తుందంటున్నారు నిపుణులు. వారి మనసును తెలుసుకుంటూ.. ప్రేమను పంచే తల్లిదండ్రుల పెంపకంలో పిల్లల మానసికారోగ్యం పెంపొందుతుందని సూచిస్తున్నారు.

- రకరకాల కారణాల రీత్యా పిల్లలు చిన్న కుటుంబాల్లో పెరగాల్సి వస్తుంది. కొన్ని కుటుంబాల్లో అయితే తోబుట్టువులూ లేక ఒంటరితనానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రుల మధ్య ఉండే అన్యోన్యత, అనుబంధాలు చిన్నారుల మానసిక ఎదుగుదలపై మంచి ప్రభావాన్ని చూపిస్తాయి. అయితే ఉద్యోగ ఒత్తిళ్లు, పెరుగుతున్న గ్యాడ్జెట్ల వినియోగం, భార్యాభర్తలిద్దరికీ కనీసం మాట్లాడుకునే సమయం చిక్కకపోవడం వంటివన్నీ పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. తమ ఆలోచనలను పంచుకోవడానికి తల్లిదండ్రులకు సమయం ఉండకపోవడంతో పిల్లలు ఒంటరితనానికి లోనై, కుంగుబాటుకు గురవుతున్నారు.
- ఉద్యోగ ఒత్తిడి, తల్లిదండ్రులు ఏదో ఒక కారణంతో ఒకరిపై మరొకరు నిందలు వేసుకోవడం, బాధ్యతలను పంచుకోవడంలో విమర్శించుకోవడం, దూషించుకోవడం వంటివన్నీ పిల్లలపై చెడు ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. పెద్దల ప్రవర్తన అర్థంకాక, వారెందుకు కోపంగా ఉంటున్నారో అవగాహన లేక చిన్నారులు తీవ్ర ఆందోళనకు గురవుతారు. తల్లిదండ్రుల సమస్యలు ఏంటో తెలియక, పిల్లలు తమ ఆలోచనలను పంచుకోవడానికి భయపడుతుంటారు. ఇవన్నీ వారి మానసిక ఆరోగ్యాన్ని కుంటుపడేలా చేసి, వారి ఎదుగుదలకు అవరోధాలవుతాయి. ఇలా కాకుండా ఉండాలంటే పిల్లలెదుట సమస్యలను చర్చించుకోకూడదు. వారికి వీలైనంత ఎక్కువ సమయాన్ని కేటాయించడమే కాకుండా, దాన్ని ఆహ్లాదంగా ఉంచడానికి ప్రయత్నించాలి. దంపతుల సంభాషణ అన్యోన్యంగా, ప్రేమపూర్వకంగా, పరస్పర గౌరవంతో ఉండాలి. ఆ ప్రేమానుబంధం పిల్లలపై మంచి ప్రభావం చూపి వారూ ఇతరులతో ప్రేమపూర్వకంగా వ్యవహరించేలా చేస్తుంది.
- చిన్నారులకు కేటాయించే సమయంలో 80 శాతాన్ని వారి భావోద్వేగాలను గుర్తించడానికి, ఆలోచనలను పంచుకోవడానికి వినియోగించాలి. మిగతా 20 శాతం వారితో ప్రేమగా, అనునయంగా మాట్లాడాలి. పిల్లలతో గడపాల్సిన సమయానికి అధిక ప్రాముఖ్యతనివ్వాలి. కలిసి భోజనం చేయడం, కథలు వినిపించడం, రోజూ వారికెదురైన అనుభవాలను తెలుసుకోవడం, ఆలోచనలను పంచుకోవడం వంటివన్నీ వారిని ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దడానికి దోహదం చేస్తాయి.

పిల్లల ఆరోగ్యం జాగ్రత్త

తీసుకునే ఆహారం విషయంలో మనమే మన కోరికల్ని కంట్రోల్ చేసుకోలేం. అలాంటిది పిల్లలెలా వింటారు. చలికాలమైనా ఐస్‌క్రీమ్ కావాలని, అనారోగ్యమని తెలిసినా పిజ్జా, బర్గర్లు తింటామని మారాం చేస్తుంటారు. ఇలాంటప్పుడు పిల్లల్ని నియంత్రించడం, ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను పిల్లలకు అలవాటు చేయడం తల్లులకు కత్తి మీద సాములాంటిది. అయితే చిన్నారులకు ఒక్కో ఆహార పదార్థం అలవాటు చేసేటపుడు హెల్దీ ఆప్షన్స్ ఎంచుకోవాలని దానికోసం మన పూర్వీకులు పాటించిన ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను వారికి అలవర్చాలని సూచిస్తున్నారు నిపుణులు. ఇలా పిల్లలకు పసి వయసు నుంచే ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తే.. పెద్దయ్యాక కూడా వారు అవే అలవాట్లను కొనసాగించే అవకాశం ఉంటుంది. దాంతో తల్లులకు తమ పిల్లల ఆరోగ్యం విషయంలో ఎలాంటి దిగులూ ఉండదని చెబుతున్నారు.

- ఆరోగ్యంగా ఉంటేనే అన్నీ సక్రమంగా జరుగుతాయి. అయితే పిల్లలు మాత్రం ఇవేవీ వినిపించుకోరు. అవి ఆరోగ్యానికి మంచివి కావు.. అని చెప్పినా అవే కావాలని పట్టుబడతారు. పెద్దయ్యాక పిల్లలు ఇలా తయారుకాకుండా ఉండాలంటే చిన్నతనం నుంచే వారికి ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అలవాటు చేయాలి. మన పెద్దలు తమ పిల్లల విషయంలో పాటించిన చిట్కాలను, ఆరోగ్యకరమైన వంటకాలను మనమూ మన పిల్లలకు అలవాటు చేయించాలి.
- సీజన్ మారుతున్న కొద్దీ మనం ఎలాగైతే మన ఆహారపుటలవాట్లలో మార్పులు-చేర్పులు చేసుకుంటామో.. పిల్లల విషయంలోనూ ఇది పాటించాలి. తాజాగా, చక్కటి పోషకాహారంతో కూడిన పదార్థాలు అందిస్తే.. అవి వారిని ఆయా కాలాల్లో ఎదురయ్యే ఎన్నో అనారోగ్యాలకు దూరంగా ఉంచుతాయి. ఇక ఈ చలికాలంలో సాధారణంగానే పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోతుంటుంది. పైగా ఇది పండగల సీజన్ కూడా. ఇలాంటి సమయాల్లో స్వీట్స్, డెజర్ట్స్.. వంటివి చేసుకోవడం మామూలే. అయితే చక్కెరకు బదులు బెల్లం, దాల్చినచెక్క పొడి.. వంటి ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి. పిల్లలకు అటు ఆరోగ్యకరమైన ఆహారం, ఇటు అప్పుడప్పుడూ వారికి నచ్చిన ఆహారం అందిస్తూ వారి ఆహారపు కోరికల్ని అదుపు చేస్తే వాళ్లు మనం చెప్పిన మాట వింటారు. ఆరోగ్యంగా ఉంటారు. అలాగే ఎప్పుడైనా జలుబు, దగ్గు అనిపిస్తే ఆవిరి పట్టడంతో పాటు రోజూ రాత్రి పడుకునే ముందు పసుపు కలిపిన పాలు తాగించడం వంటివి చేయాలి.



ఇట్ల చేద్దాం



తలస్నానం చేశాక జుట్టుని డ్రయ్యర్లతో ఆరబెడుతున్నారా? ఇక మీదట ఆ పని చేయకండి. వేడి వల్ల వెంట్రుకలు చిట్లి పాడవుతాయి. తడి తలపై మెత్తటి తువాలుతో ఒత్తాలే కానీ, బలవంతంగా రుద్దడం, దులపడం వంటివీ చేయొద్దు. ఇవన్నీ జుట్టుని బలహీన పరుస్తాయి.

బీజేపీది దుష్ట రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

సరుకుల మాదిరి కొనుగోలు చేస్తోందన్నారు. బీజేపీ వ్యతిరేక శక్తిగా ఉన్న బీఆర్ఎస్‌తో సీపీఐ, సీపీఐ(ఎం) కలిసివెళ్లాలని నిర్ణయించుకున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి బీజేపీని ఓడించే శక్తి లేదని మునుగోడులో స్పష్టమైందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఎజెండా అని తమ్మినేని తెలిపారు. ప్రజాల పక్షాన నిలబడి సమస్యలపై పోరాడుతామన్నారు. బీజేపీ పాలనలో దేశం తిరోగమనం వైపు నడుస్తోందన్నారు. తెలంగాణలో నైతిక విలువలు, అభ్యుదయ భావాలు అధికంగా ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రజల్లో వామపక్ష భావజాలం ఎక్కువగా ఉందన్నారు. బీజేపీ కాషాయ రాజకీయాలు, మత రాజకీయాలు తెలంగాణలో పారవని స్పష్టం చేశారు. 48కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేసి కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తున్న ప్రధాని మోడీని సీఎం కేసీఆర్ వ్యతిరేకిస్తే ఆయన వెంట కార్మికులు నడవడం సబబు అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వేస్లీ, జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, స్కైలాబ్‌బాబు, బట్టుపల్లి అనురాధ, జిల్లా నాయకులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, దాసరి పాండు, మాయ కృష్ణ పాల్గొన్నారు

భువనగిరి కోర్టుకు తమ్మినేని, నేతలు హాజరు

అంబోజు నరేష్, స్వాతి కుల దురహంకార హత్య దోషులను శిక్షించాలని టీ-మాస్ అధ్వర్యంలో జూన్ 9, 2017లో జరిగిన రాస్తారోకోపై కేసులో భాగంగా శుక్రవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, అరుణోదయ సాంస్కృతిక వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు విమలక్కలతోపాటు ఏడుగురు కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసు ఎనిమిది మందిపై నమోదైంది. ఈ కేసులో ఏ1గా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కల్లూరి మల్లేశం, ఏ2 గా తమ్మినేని వీరభద్రం, ఏ3గా విమలక్క, ఏ4గా రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య, ఏ5గా రాజారాం నాయక్, ఏ6 గా కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వేస్లీ, ఏ7గా రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఏ8గా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య పేర్లను నమోదు చేశారు.

తమ్మినేని వీరభద్రం, విమలక్క.. ఇతర నాయకులను బార్ అసోసియేషన్, ఐలు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఇస్మాయిల్, జిపి నాగారం అంజయ్య, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశవరెడ్డి, మాజీ అధ్యక్షులు నర్సింహయాదవ్, ఐలు అధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి, లాయర్స్ యూనియన్ నాయకులు రామిరెడ్డి, సోమయ్య, జగతయ్య, బొల్లెపల్లి కుమార్ పాల్గొన్నారు.

31 నుంచి పార్లమెంట్

న్యూఢిల్లీ : 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని శుక్రవారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31న ప్రారంభమై ఏప్రిల్ 6 వరకు 66 రోజుల పాటు జరగనున్నాయి. పార్లమెంట్ నూతన భవనంలో తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభోపన్యాసం చేస్తారు. రాష్ట్రపతిగా ఆమె ఎన్నికైన తరువాత మొదటిసారిగా పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. ఆ తరువాత పార్లమెంట్‌లో ఆర్థిక సర్వేను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. మరుసటి రోజు ఫిబ్రవరి 1న వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు.

రెండు విడతలుగా..

ఈ బడ్జెట్ సమావేశాలు రెండు విడతలుగా జరగనున్నాయి. తొలి విడతలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు, రెండో విడతలో మార్చి 13 నుంచి ఏప్రిల్ 6 వరకు జరగనున్నాయి. ఫిబ్రవరి 14 నుంచి మార్చి 12 వరకు విరామం ఉంటుంది. తొలి విడతలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, వార్షిక బడ్జెట్ పై చర్చ జరుగుతుంది. రెండో విడతలో ఆయా శాఖలకు సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు గ్రాంట్స్ కోసం డిమాండ్‌లను పరిశీలించడం, మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన నివేదికలను రూపొందించడం, పలు బిల్లులకు ఆమోదించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ చేయనున్నది.

బడి గోస

(మొదటిపేజీ తరువాయి)



విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని సూచిస్తున్నదని నిపుణులు తెలిపారు. కొందరు టీచర్లు స్కూళ్లలో అదనపు క్లాసులు తీసుకోగా, తల్లిదండ్రులు కొందరు తమ చిన్నారులను ప్రయివేటు కోచింగ్ క్లాసులకు పంపారు. ప్రభుత్వం కూడా సిలబస్‌ను తగ్గించి విద్యార్థులపై అధిక భారం మోపకుండా చేసింది. తమిళనాడు వంటి రాష్ట్రాలైతే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థుల కోసం కమ్యూనిటీ రెమిడియల్ క్లాసులను నిర్వహిస్తున్నాయి.

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2021 ప్రకారం.. 2017తో పోలిస్తే గణితం, భాషలలో అభ్యాసనలు పడిపోయాయి. "గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులకు ఆన్‌లైన్ విద్యకయ్యే సౌకర్యాలు లేవు. లాక్‌డౌన్ కాలంలో చాలా కొద్ది మంది మాత్రమే ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యారు" అని వారణాసికి చెందిన ఒక ప్రభుత్వ స్కూల్ టీచర్ అన్నారు. దాదాపు 60 శాతం మంది చిన్నారులు ఆన్‌లైన్ విద్యావకాశాలను పొందలేకపోయారని 2020లో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ తన అధ్యయనంలో పేర్కొన్న విషయం విదితమే. ఆన్‌లైన్ క్లాసులకు వాస్తవ తరగతులకు మధ్య తేడా ఉన్నదనీ, ఆన్‌లైన్ విద్య ఒక విరామం లాగా అనిపించిందని మీరట్‌లోని ఒక ప్రయివేటు పాఠశాలకు చెందిన 8వ తరతగి విద్యార్థి శిఖర్ జుబిన్ రాయ్ అన్నారు. తాను అదనంగా మరింత కష్టపడాల్సి వచ్చిందని తెలిపారు. డిజిటల్ తరగతుల కారణంగా చదవడం, రాయడం మందగించిందని చెప్పారు.

'ఆన్‌లైన్‌తో ఉపయోగం లేదు'

ఆన్‌లైన్ క్లాసులతో పిల్లలకు ఒరిగిందేమీ లేదని తల్లిదండ్రులు తెలిపారు. స్కూల్‌కు వెళ్తేనే వ్యక్తిత్వ వికాసం జరుగుతుందనీ, ఆన్‌లైన్ క్లాసులతో శారీరకంగానూ నష్టమేనని రష్మీరాయ్ అనే ఒక మహిళ అన్నారు. ఉపాధ్యాయులు సైతం ప్రత్యక్ష తరగతి బోధనలకే ప్రాధాన్యతనిచ్చారు. కోవిడ్-19 ప్రేరేపిత లాక్‌డౌన్ అనంతరం స్కూళ్లు తెరుచుకున్నాక.. విద్యార్థులు తాము నేర్చుకున్నది మరిచిపోయారని యూపీలోని ఒక ప్రభుత్వ స్కూల్ టీచర్ దిగ్విజయ్ సింగ్ చెప్పారు. విషయాన్ని అర్థం చేసుకోవడానికి చాలా సమయాన్ని తీసుకున్నారని తెలిపారు. ఆఫ్‌లైన్ క్లాసుల్లో తాము విద్యార్థులను నేరుగా చూస్తామనీ, వారికి అర్థమైందా లేదా అనేది తెలుసుకోగలుగుతామని జార్ఖండ్‌లోని ఒక ప్రయివేటు స్కూల్ టీచర్ జ్యోతి సింగ్ తెలిపారు. ఒకవేళ విద్యార్థులకు ఏవైనా డౌట్‌లు ఉంటే తరగతి గదిలో సులభంగా నివృత్తి చేయగలుగుతామన్నారు

అదనపు క్లాసులు

తమ పిల్లలకు పాఠాలు అర్థమవడం కోసం సంపన్న కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా ట్యూటర్లను నియమించి తమ పిల్లలకు విద్యనందిస్తున్నారని ఢిల్లీ కేంద్రంగా పని చేసే థింక్ ట్యాంక్ సెంటర్ ఫర్ బడ్జెట్ గవర్నెన్స్ అండ్ అకౌంటబులిటీకి చెందిన ప్రొతివ కుండు చెప్పారు. అయితే, అందరు విద్యార్థులు ప్రయివేటు ట్యూషన్లను పొందలేకపోవడంతో అసమానతలు విస్తృతమవుతున్నాయని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్‌కు నేతృత్వం వహిస్తున్న అంజెలా తనేజా అన్నారు. ఇటు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ విద్యార్థులపై భారాన్ని తగ్గించడంలో భాగంగా సిలబస్‌లో కోత విధించింది. ఇది విద్యా సంవత్సరాన్ని కోల్పోకుండా ఇటు విద్యార్థులకు.. అటు ఉపాధ్యాయులకు సులభతరం చేసిందని నిపుణులు తెలిపారు. మోడీ ప్రభుత్వం అనాలోచితంగా, ఏకపక్షంగా లాక్‌డౌన్ వంటి నిర్ణయాన్ని తీసుకొని అమలు చేసిందనీ, దీని ప్రభావం ముఖ్యంగా పేద విద్యార్థుల పైనే పడిందని నిపుణులు చెప్పారు. సిలబస్‌లో కోత అనేది విద్యార్థులకు తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించినా దీర్ఘకాలంలో ఇది నష్టాన్ని తీసుకొస్తుందని హెచ్చరించారు. కోల్పోయిన విద్యను విద్యార్థులకు అందించే విషయంలో కేంద్రం చొరవ చూపాలని తెలిపారు. ఇందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అదనపు తరగతులు(రెమిడియల్ క్లాసులు) నిర్వహించాలని సూచించారు.

బీజేపీ నెంబర్ వన్ దోషి..

- వచ్చేనెల 10న జాతీయ రహదారుల దిగ్బంధనం
- అనాథల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి
- ఈ నెల 31న ఇందిరాపార్కు వద్ద దీక్ష : విలేకర్ల సమావేశంలో మందకృష్ణ

నవతెలంగాణ - హైదరాబాద్ బ్యూరో

ఎస్సీ వర్గీకరణకు ప్రారంభం నుంచి మద్దతు ప్రకటిస్తూ.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అంశాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న బీజేపీ అసలు దోషని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ విమర్శించారు. మోడీ సర్కార్‌పై ప్రత్యక్ష పోరాట కార్యాచరణకు దిగుతామనీ, ఇక ఆ సర్కార్‌పై సమరమేనని తెలిపారు. డబులింజన్ సర్కారొస్తేనే సమస్యల పరిష్కారం సులువవుతుందని బీజేపీ జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు పదేపదే చెబుతున్నారని గుర్తుచేశారు. మరి కర్నాటకలో డబులింజన్ సర్కారే కదా! ఉన్నది.. ఆ రాష్ట్రంలో జస్టిస్ సదాశివన్ కమిషన్ రిపోర్టును ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించటంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు కర్నాటక ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ఎన్నికల సందర్భంలో బీజేపీ తమ ఎన్నికల ప్రణాళికలో ఉషామెహ్రా కమిషన్ సిఫారుసులను అమలు చేస్తామని ప్రకటించిందనీ, ఇప్పుడెందుకు నోరుమెదపటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన మోడీ, తొమ్మిదేండ్లయినా..ఈ అంశం చర్చకు రాకపోవటం మాదిగల పట్ల చిన్నచూపు తప్పితే మరొకటి కాదన్నారు.కార్పొరేట్లకు అనుకూలమైన బిల్లులను రాత్రికి రాత్రే తీసుకొస్తున్నారని గుర్తుచేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా బీజేపీపై ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలిపారు.ఫిబ్రవరి ఒకటి నుంచి తొమ్మిది వరకు ఎల్బీ నగర్ చౌరస్తా నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పాదయాత్ర చేయనున్నట్టు తెలిపారు. పదో తేదీన 12గంటల జాతీయ రహదారి దిగ్బంధనం వేలాది మందితో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరనున్నట్టు చెప్పారు.

అనాథపిల్లల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం..

రాష్ట్ర ప్రభుత్వం అనాథపిల్లల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. అనాథ పిల్లలు ప్రభుత్వ బిడ్డలని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే గతంలో ప్రకటించారనీ, వారిని ఆదుకుంటామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ హామీకి ఏడున్నరేండ్లయిందని చెప్పారు. ఇదే అంశంపై వేసిన మంత్రి ఉపసంఘం సిఫారసులు ఎమయ్యాయో చెప్పాలని ప్రశ్నించారు.అనాథ పిల్లలను ఆదుకోవాలంటూ మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) ఆధ్వర్యంలో ఈ నెల 22న సంబంధిత బ్యాధ్యులకు వినతి పత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు.23న అన్ని జిల్లా కేంద్రాల్లో స్వచ్ఛంద సంస్థలు,ప్రజాసంఘాలు, పార్టీలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. 31న ఇందిరాపార్కు వద్ద మహాదీక్ష చేపడతామని ప్రకటించారు. విలేకర్ల సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, అనాద వెంకటయ్య, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగమే సర్వోన్నతం

(మొదటిపేజీ తరువాయి)

శాసన వ్యవస్థ (పార్లమెంటు)కు జవాబుదారీ వహించాల్సి వుంటుందనీ, ఎంపీలు ప్రజలకు జవాబుదారీ వహించాల్సిందేనని తెలిపారు. ఈ మొత్తం రాజ్యాంగ నిర్మాణ క్రమంలో ఎక్కడ కూడా ప్రజల సార్వభౌమాధికారాన్ని భర్తీ చేసే వ్యవస్థ మరొకటి లేదని ఏచూరి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భారత గణతంత్ర, లౌకిక, ప్రజాతంత్ర లక్షణాన్ని ధ్వంసం చేసి ఆ స్థానంలో అసహన ఫాసిస్టు హిందూత్వ రాష్ట్ర ఏర్పాటుకు జరుగుతున్న ఈ కుట్రలను అడ్డుకొని వాటిని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

చూద్దాం...చేద్దాం..

(మొదటిపేజీ తరువాయి)



ఫైల్

బిడ్డలే. బాధగా ఉంది. స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాలు, జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలు కార్యక్రమాలు ముగియగానే సెప్టెంబర్ 20న చర్చలకు పిలుస్తాం' సమ్మె విరమిస్తే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి పంపారు. మంత్రి కేటీఆర్, హరీశ్‌రావు, సీఎస్ సోమేశ్‌కుమార్‌తో పలుసార్లు చర్చలూ జరిపారు. హామీలన్నీ నెరవేరినట్టేనన్నంత నమ్మించారు. 'నవంబర్ ఏడో తేదీ వరకు ఆగండి. మునుగోడు ఉప ఎన్నికల కోడ్ అయిపోగానే సమస్యను పరిష్కరిస్తాం. సీఎం మీ పట్ల సానుకూలంగా ఉన్నారు. దయచేసి సమ్మె విరమించండి' అంటూ స్వయంగా అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్‌తో నచ్చజెప్పించారు. దాంతో 80 రోజుల సమ్మెకు ఫుల్‌స్టాఫ్ పడింది. ఆ రోజు చర్చల సందర్భంగా సమ్మెకాలానికి సంబంధించిన వేతనాన్ని ఇప్పించేందుకు ప్రయత్నిస్తామనీ, చలో అసెంబ్లీ, ఆర్టీసీక్రాస్‌రోడ్డులో జరిగిన మెరుపు ధర్నాల సమయంలో వీఆర్ఏలపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని సీఎస్ హామీనిచ్చారు. మునుగోడు ఉప ఎన్నిక అయిపోయిన తర్వాత తర్వాత ఎవ్వరూ పట్టించుకోలేదు. వీఆర్ఏలు మరోమారు పోరాటానికి సన్నద్ధమవుతున్న మంత్రి కేటీఆర్ డిసెంబర్ 21వ తేదీన జేఏసీ బృందాన్ని పిలిపించి మాట్లాడారు. త్వరలో సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. తర్వాతి రోజే ప్రగతిభవన్‌కు పిలుపు రావటంతో ఇక తమకిచ్చిన హామీలు నెరవేరినట్టేననుకున్నారు. ఏమైందో ఏమోగానీ వీఆర్ఏలను పొద్దంతా అక్కడే కూర్చోబెట్టారు. రెండుమూడు సార్లు చాయ్ తాపించారు. మధ్యాహ్నం బుక్కెడు బువ్వపెట్టి సాయంత్రం కాగానే పంపించేశారు. అసలు అక్కడకు ఎందుకు పిలిచారో? పొద్దస్తమానం ఎందుకు కూర్చో బెట్టారో? అర్థంకాక వీఆర్ఏ జేఏసీ నాయకులు తలలు పట్టుకున్నారు. దీనినే ఉన్నతాధికారుల వద్ద జేఏసీ నేతలు ప్రస్తావిస్తే...సీంఎ సార్ మీ పట్ల సానుకూలంగా ఉన్నారు. జర ఓపిక పట్టండి' అంటూ సమాధానం రావటం కొసమెరుపు. కొత్త సీఎస్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన సందర్భంలోనూ అదే హామీ. 80 రోజుల సమ్మె కాలం నాటి వేతనాలు ఇస్తామన్నదీ బుట్టదాఖలైంది. కేసుల ఎత్తివేత అంశమూ మరుగున పడిపోయింది. ఓపికకూ సహనం ఉంటుంది. వీఆర్ఏలలో అది కాస్తా నశిస్తే అంతిమంగా సర్కారుకే నష్టం.

మా హామీలను నెరవేర్చండి

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శభాకాంక్షలు తెలిపారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వీఆర్ఏలకు తక్షణమే పేస్కేలు ఇవ్వాలని కోరారు. అర్హులైనవారందరికీ ప్రమోషన్లు కల్పించాలనీ, వారసత్వ ఉద్యోగాలివ్వాలని విన్నవించారు. 80 రోజుల సమ్మె కాలపు వేతనాలను ఇవ్వాలనీ, సమ్మె కాలంలో పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మెన్ రాజయ్య, కోచైర్మెన్ రమేశ్ బహదూర్, కన్వీనర్ సాయన్న, కో కన్వీనర్లు వంగూరు రాములు, మాధవనాయుడు, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన ఆర్.రమేష్ అనే వినియోగదారుడికి జనవరిలో 32 రోజులకుగాను 90 యూనిట్ల బిల్లు వేశారు. ఎనర్జీ, కస్టమర్, ఫిక్స్డ్ ఛార్జీల పేరుతో అన్నీ కలిపి రూ.325 వరకు బిల్లు వచ్చింది. ఇదివరకు సగటున ఈయన 85 యూనిట్ల వరకు కరెంటు వినియోగిస్తుండగా.. ఏసీడీ పేరుతో ఇప్పుడు ఆ బిల్లు రూ.622గా వచ్చింది. దీంతో కూలీ పని చేసుకునే రమేష్ ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. మొన్నటివరకూ డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో రూ.2వేల వరకూ అదనంగా చెల్లించానని, ఇప్పుడు కరెంటు బిల్లులు కూడా పెంచితే బతికేదెట్లా అంటూ 'నవతెలంగాణ'తో వాపోయాడు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జీ.సాగర్‌కు జనవరి 5వ తేదీన కరెంటు బిల్లు వచ్చింది. 30 రోజుల్లో 244 యూనిట్ల వినియోగించినందుకుగాను ఆయనకు అన్ని చార్జీలు కలిపి రూ.1514 బిల్లు వచ్చింది. నెలకు సగటున 250 యూనిట్ల వరకు వినియోగిస్తున్నారని ఏసీడీ ద్వా ఏకంగా రూ.2800 బిల్లు అదనంగా వేశారు. గతంలో 300 యూనిట్లకుపైగా వాడిన వారికి మాత్రమే వసూలు చేసిన చార్జీలు ఇప్పుడు ఆలోపు విద్యుత్ వినియోగించిన పేద,మధ్య తరగతిప్రజలపై ఈ భారం వేస్తుండటంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

'ఏసీడీ' షాక్

- కరెంటు బిల్లులపై అదనంగా అడిషనల్ కన్సంప్షన్ డిపాజిట్ బాదుడు
- 300యూనిట్లలోపు కరెంటు వాడిన వారికీ అదనపు విధింపులు
- మొన్నటివరకూ డెవలప్‌మెంట్ ఛార్జీలతో నడ్డివిరుపు
- కొత్త ఏడాదిలోనే ఏసీడీ పేరుతోమరో పిడుగు
- అధికంగా వచ్చిన జనవరిలో బిల్లులతో జనం లబోదిబో
- పేద, మధ్యతరగతి వాసులపైనే అధికంగా భారం



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరెంటు యూనిట్ ప్రాతిపదికన బిల్లులు వచ్చాయనుకునే వారికి ఇప్పుడు రూ.120 నుంచి రూ.300, రూ.350 బిల్లు వచ్చే వారికి రూ.1200, రూ.500ఆపై బిల్లులు చెల్లించేవారికి రూ.2వేలు.. ఆపైన బిల్లులు రావడం చూసి ఖంగుతిన్నారు. గతేడాది డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో వినియోగదారుల నడ్డి విరిచిన విద్యుత్ సంస్థలు ఇప్పుడు అడిషనల్ కన్సంప్షన్ డిపాజిట్ కింద కొత్త ఏడాది ప్రారంభంలోనే వసూలు చేయడం చూసి లబోదిబోంటున్నారు. అయితే ఇదివరకు 300 యూనిట్లపైన విద్యుత్ వినియోగించేవారికే వడ్డించిన అదనపు చార్జీలు ఇప్పుడు ఆలోపు యూనిట్ల కరెంటు వారిపైనా బాదడంతో ఆందోళన చెందుతున్నారు. అసలే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో వచ్చే అరకొర ఆదాయంతో అతికష్టం మీద బతుకుబండిలాగుతున్న పేద, మధ్యతరగతి ప్రజానీకమే 'ఏసీడీ' షాక్ గురికావడం గమనార్హం.

ఎన్‌పీడీసీఎల్ పరిధిలో జనవరి నెలలో వినియోగదారులకు జారీ చేసిన కరెంటు బిల్లులో వాడుకున్న కరెంటు ధర కంటే ఏసీడీ ఛార్జీలు అధికంగా వస్తున్నాయి. ఇవి ఎందుకు వేశారో తెలియక కరెంటు ఆఫీసులకు వెళ్లి అధికారులను అడుగుతున్నారు. గతేడాది అదనపు లోడ్ వాడుతున్నారని డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేశారు. తక్కువ లోడ్‌తో మీటర్‌కు అనుమతి పొంది, అధికంగా కరెంటు వాడుతున్నందున వసూలు చేస్తున్నామని విద్యుత్ సంస్థలు తెలిపాయి. ఈ క్రమంలో ఇల్లు అద్దెకు ఇస్తే కిరాయిదారులు ఈ చార్జీలు చెల్లించాలా లేదా యజమానులు చెల్లించాలా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. నిబంధనల ప్రకారం డెవలప్‌మెంట్ చార్జీలు, జీఎస్టీలు చెల్లించే విషయంలో ఇంటి యజమానులకు, అద్దెకు ఉంటున్న వారి మధ్య గొడవ తలెత్తుతోంది. అద్దెకుంటున్న వారు ఎక్కువ మొత్తంలో విద్యుత్ వినియోగించడం వల్లే బిల్లు అధికంగా వచ్చిందని, వెంటనే చెల్లించాలని యజమానులు వాదిస్తున్నారు. అయితే కొత్తగా ఇంటి అద్దెకు వచ్చిన వారు తాము వచ్చి కనీసం రెండు, మూడు నెలలు కాకముందే ఇంత మొత్తంలో బిల్లులు ఎలా కడుతామంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో ఇరువురూ సామరస్యంగా మాట్లాడుకుని విద్యుత్ బిల్లులు చెల్లించాలని అధికారులు సెలవివ్వడం గమనార్హం.

ఏసీడీని లెక్కించేది ఇలాగే...

ఏడాదికాలంగా వినియోగించిన విద్యుత్, సర్వీసు సామర్థ్యాలను లెక్కగట్టి ప్రస్తుతం బిల్లులో ఏసీడీ కింద వేస్తున్నారు. వినియోగదారులు 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు 12 నెలల బిల్లులను మొత్తం కూడి 12తో భాగించగా వచ్చిన సగటు విలువను రెండుతో గుణిస్తున్నారు. ఇలా వచ్చిన మొత్తాన్ని అదనపు వినియోగ డిపాజిట్ (ఏసీడీ)గా బిల్లులో ముద్రిస్తున్నారు. అయితే వినియోగదారులు మీటర్ కోసం దరఖాస్తు చేసినప్పుడు కిలోవాట్‌కు కొంత మొత్తం చొప్పున లోడ్ ఛార్జీలతోపాటు రూ.200 మాత్రమే డిపాజిట్‌గా తీసుకునేవారు. దానికంటే అధికంగా విద్యుత్ వాడినట్టు తేలితే ఏసీడీ కింద వసూలు చేస్తున్నారు.

ఏసీడీ అనేది డిపాజిట్ మాత్రమే..!

– గంగాధర్, ఎస్ఈ, కరీంనగర్ సర్కిల్

విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) నిబంధనలకు లోబడి వినియోగదారుల నుంచి రెండు నెలల డిపాజిట్టును విధించాలని కంపెనీ నిర్ణయించింది. అందుకే ఏసీడీ అనేది కరెంటు ఛార్జీలు కాదు.. కేవలం డిపాజిట్ మాత్రమే. వినియోగదారులు మీటర్ తీసుకునే సమయంలో ఎంత కరెంటు వాడుకుంటారో తెలియదు కాబట్టి రూ.200 నామమాత్రపు డిపాజిటు తీసుకుని మీటర్ మంజూరు చేశాం. వినియోగదారులు సంవత్సరం మొత్తం చెల్లించిన కరెంటు చార్జీల సగటును లెక్కించి ఏసీడీగా నిర్ణయిస్తున్నాం. ఇది పాత విధానమే.

అదనపు భారం మోపడం దారుణం

-మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి



విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ పేరుతో అదనపు ఛార్జీలు వేయడం దారుణం. అడిగితే సరైన సమాధానం లేదు. ఇవి చెల్లించడం మధ్యతరగతి కుటుంబాలపై భారంగా మారింది. సంస్థకు వచ్చిన నష్టాలను పూడ్చుకునేందుకు అదనపు ఛార్జీలు వసూళ్లకు పూనుకోవడం వినియోగదారులను వంచించడమే. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలి

అడిషనల్ డిసిపి (పరిపాలన) జి చంద్రమోహన్

నవతెలంగాణ- కరీంనగర్ క్రైమ్


మాట్లాడుతున్న డీసీపీ చంద్రమోహన్

ఫిర్యాదులు వేగవంతంగా పరిష్కరించాలని కరీంనగర్ అడిషనల్ డీసీపీ (పరిపాలన) జి చంద్రమోహన్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల ప్రాధాన్యతను సంబంధిత ఎస్‌హెచ్‌ఓల దృష్టి పెట్టాలని సూచించారు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలో పోలీస్ స్టేషన్లకు చెందిన రిసెప్షన్ అధికారులకు శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ (పరిపాలన) జి చంద్రమోహన్ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్లకు వచ్చే అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన రెండు రకాల ధృవీకరణలో వివరాలను ఆన్‌లైన్ అపోలోడ్ చేయాలని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారం వివరాలనుపై స్థాయి అధికారులు పరిశీలిస్తున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు విజ్ఞాన్ రావు, బి సంతోష్ కుమార్ పాల్గొన్నారు

ట్రైన్ కింద పడి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-జమ్మికుంట

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చెందాడు. ఈఘటన జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామ రైల్వే ట్రాక్‌పై శుక్రవారం చోటు చేసుకుంది. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి. తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన పోలోజు రమేష్ రాజు (25) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మూడేండ్లుగా ఒక అమ్మాయితో ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఆమె టార్చర్ పెట్టెదని, అదే కారణంతో జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామ రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అనుమానం ఉన్నదని తన చావుకి ఆ అమ్మాయి కారణం అని మృతుడి తల్లి కవిత ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కేసు నమోదు చేస్తున్నట్టు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-వెల్గటూర్

: మతి స్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మృతి చెందిన ఘటన ఎండపల్లి మండలం పాతగూడూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పుమల్ల ప్రవీణ్(34)సం గత కొన్ని రోజుల నుండి మతి స్థిమితం సరిగా లేక ఇంట్లో నుండి వెళ్ళిపోయి 3,4 రోజులకు తిరిగి వస్తాడు. అదే విధంగా ఈ నెల 11న రాత్రి 8:00గంటలకు స్కూటీ వేసుకొని తమ పొలానికి నీళు పెట్టివాస్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం తమ వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. స్కూటీ బావి పక్కనే ఉంది. మృతుడు ఇంటినుండి పోయిన రోజే ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయినడని మృడుడి తండ్రి ఉప్పుమల్ల బాల్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - కథలాపూర్


చెక్కులు అందజేస్తున్న లోకబాపురెడ్డి

పెగర్ల గ్రామానికి చెందిన ఎనుగంటి పూజ రూ.60 వేలు, భోజగిరి రాజు 56 వేలు, కోడిగంటి రమేష్ 24 వేలు, జవిడి రాధ 24 వేలు చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులను మార్క్ ఫెడ్ మాజీ చైర్మెన్ లోక బాపు రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జవిడి జలపతిరెడ్డి, ఎంపీటీసీలు బాధినేని రమేష్, ప్యాక్స్ డైరెక్టర్ మార్గం శ్రీను, చెల్లపెల్లి అంజయ్య, నాయకులు నరేష్, రాజేశం, ప్రతాప్‌రెడ్డి, చిన్న రెడ్డి, మార్గం రాజం, రాజన్న, తిరుపతి, గంగ నర్సయ్య, అభి, సురేష్ తదితరులున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-రాయికల్


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.రాయికల్ మండలంలోని కొత్తపేట గ్రామంలో ఏర్పాటు చేసిన"కొత్తపేట ప్రీమియర్ లీగ్" క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఒత్తిడి నుంచి దూరం చేయడంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. మనం ఆరోగ్యంగా ఉంటే మన ఆలోచనలు ,ఏకాగ్రత పెరుగుతుందని క్రీడలను ప్రతి ఒక్కరూ రోజు వారి పనుల్లో భాగం చేసుకోవాలని సూచించారు. యువతకు చదువుతోపాటు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే గ్రామీణ క్రీడలు ఎంతో దోహద పడతాయని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని రామజీపేట్, మూట పెల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాటిపెల్లి రాజశేఖర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు,మాజీ ఎంపీటీసీ చింతలపెల్లి గంగారెడ్డి,క్రీడాకారులు చింతలపల్లి రాజ్ కుమార్,కల్లెం శ్రీనివాస్,హరీష్ రెడ్డి,యువకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట.!

- రూ.5 లక్షల80 విలువగల చెక్కులు పంపిణీ
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ డాక్టర్ సంజయ్

నవతెలంగాణ-రాయికల్


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధికి సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు.శుక్రవారం రాయికల్ పట్టణంలో కల్యాణ లక్ష్మి,సీఎం సహాయ నిధి రూ.5 లక్షల80 విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో రూ.1 కోటి నిధులతో చేపడుతున్న మినీ టాంక్ బండ్ సుందరీకరణ పనులను పరిశీలించారు. త్వరిత గతిన నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులను,కాంట్రాక్టర్‌ను ఆదేశించిన ఎమ్మెల్యే ఆదేశించారు.అనంతరం రాయికల్ మండల రామోజీపేట్ గ్రామానికి చెందిన చల్ల మల్లారెడ్డి,మూటపెల్లి గ్రామంలో మసీదు తిరుమల,దర్మజి పెట్ లో కురుమ గంగాధర్, ఉప్పుమడుగు గ్రామానికి చెందిన ఇరగదిండ్ల రవి దుబాయ్‌లో అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి,సింగిల్ విండో ఛైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి,కౌన్సిలర్ లు మ్యాకల కాంతారావు,తురగ శ్రీదర్ రెడ్డి,సాయి కుమార్,మహేష్,కో ఆప్షన్ సభ్యులు మహేందర్ బాబు,పట్టణ అధ్యక్షులు ఇంతియాజ్,మండల ప్రధాన కార్యదర్శి తలారి రాజేష్,యూత్ అధ్యక్షులు మోర రామ్మూర్తి, నాయకులు లౌవుడియ సురేందర్ నాయక్,శ్రీరాముల సత్యనారాయణ, హుస్సేన్, రాజేందర్, బాబా,చంద్ర తేజ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కోసం బారులు తీరిన ప్రజలు

నవతెలంగాణ- గన్నేరువరం


బారులు తీరిన గ్రామస్తులు

ప్రభుత్వం ప్రతి నెల 5న రేషన్ బియ్యం అందించటం ఆలస్యం కావడంతో ప్రజలు రేషన్ కోసం పరేషాన్ అవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉచితంగా ప్రతి ఒక్కరికీ 5 కిలోల బియ్యం ఇస్తున్నామని ప్రకటించాయి. దీంతో ప్రజలు సంక్రాంతి పండుగకు పండి పదార్థాలను చేసుకోవడం కోసం రేషన్ బియ్యం కోసం ఎదురుచూశారు. ఎట్టకేలకు శుక్రవారం రోజున రేషన్ దుకాణాలలో బియ్యం ఇవ్వడంతో రేషన్ కోసం జనం బారులు తీరారు.పిండి పట్టే గిర్నీల వద్ద అదే సందడి నెలకొంది. పండుగ పూట పలు దుకాణాల్లో సూపర్‌మార్కెట్ల వద్ద జన సందడి కొనసాగుతుంది. శనివారం భోగి పండుగ సందర్భంగా పట్టణ ప్రాంతంలో ఉంటున్నవారు,ఉద్యోగస్తులు,అత్తగారింటి నుంచి తల్లి గారింటికి ఆడబిడ్డలు రావడంతో పల్లెల్లో సంక్రాంతి సంబురాలు అంబరాన్ని అంటుతున్నాయి.

దళితబంధు యూనిట్లు ప్రారంభం

నవతెలంగాణ-హుజూరాబాద్

హుజురాబాద్ పట్టణం గాంధీనగర్‌కు చెందిన బోరాగల రాజేశ్వరీకు దళితబంధు ద్వారా మంజూరైన గానుగ నూనెల షాపును ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ బండ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ గాంధే రాధికా, కౌన్సిలర్లు తోట రాజేంద్ర ప్రసాద్, ముక్క రమేష్ ,ఇమ్రాన్ , తదితరులు పాల్గొన్నారు.

వంజరి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మల్లాపూర్


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ముస్కరి తుకారాం

మండల కేంద్రంలో వంజరి సంఘం నూతన క్యాలెండర్‌ను తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్ ముస్కరి తుకారాం శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంజరి రావోజీలు అన్ని రంగాలలో ముందుకు రావాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో యువకులు పోటీ చేసి వంజరి రవోజీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లవంగా శ్రీనివాస్, శివ, ముస్కరి రమేష్, ముష్కరి రాజకుమార్, ముష్కరి సంతోష్, సురేందర్, రాజేష్, భలేరావు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-మానకొండూర్


ముగ్గులు తిలకిస్తున్న కళాశాల సిబ్బంది

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి ఆంజనేయరావు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు విభిన్న ఆకృతుల్లో రంగవల్లులు వేశారు. ప్రిన్సిపాల్, సిబ్బందితో కలిసి కాసేపు గాలి పటం ఎగురవేస్తూ సందడి చేశారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకంక్షాలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శరత్ చంద్ర, రమేష్, శ్రీనివాస్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌లో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-వీణవంక


బహుమతులు అందజేస్తున్న సర్పంచ్

మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఎఫ్ఎంసీ కంపెనీ ఆధ్వర్యంలో సంక్రాతి సందర్భంగా శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు వేసిన వారిలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగాడి సౌజన్య, ఉప సర్పంచ్ చింతల శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గంగాడి తిరుపతి రెడ్డి, ఎఫ్ఎంసీ కంపనీ ప్రతినిధులు కిరణ్, రాము, రైతులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


గుడి నిర్మాణానికి విరాళం అందజేత

నవతెలంగాణ-జమ్మికుంట

జమ్మికుంట మండలం మాచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి గుడి నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన తాటికంటి అశోక్ రూ.10,121, అలాగే శనిగారపు కొమురయ్య రూ. 10,016 రూపాయలు విరాళం శుక్రవారం అందించారు. పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

జిల్లా అడిషనల్ కోర్టు పి.పి.గా కాసారపు మల్లేశంగౌడ్

నవతెలంగాణ-కోరుట్ల



జగిత్యాల పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కాసారపు మల్లేశం గౌడ్‌ను జగిత్యాల జిల్లా అడిషనల్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ హోమ్ సెక్రటరీ రవి గుప్తా ఉత్తర్వులు జారీచేశారు. న్యాయవాద వృత్తిలో అనుభవాన్ని గుర్తించిన ప్రభుత్వం గతంలో స్పెషల్ జ్యుడిషియల్ న్యాయమూర్తిగా మల్లేశం గౌడ్‌ను నియమించింది. సమర్ధవంతంగా విధులను నిర్వర్తించిన నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా అదనపు న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కాసారపు మల్లేశంగౌడ్‌ను నియమించింది. వారి నియామకం పట్ల కోరుట్ల మండల సంగం గ్రామ రైతు అధ్యక్షుడు సుదవెని భూమయ్య, మండల స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

మూడు గుంటల రైతుకు.. ఐదు లక్షల బీమా.!

నవతెలంగాణ-గంగాధర


మృతుడి కుటుంబానికి రైతు బీమా ప్రొసీడింగ్ అందిస్తున్న

: మూడు గుంటల వ్యవసాయ భూమి గల ఓ రైతన్న అకాల మరణం చెందగా, ఆ రైతు కుటుంబానికి రైతు బీమా పథకం కింద ఐదు లక్షల రూపాయల ప్రొసీడింగ్ పత్రాన్ని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అందించి తన ఔదార్యాన్ని చాటుకున్న తీరు ఇది. వివరాల్లోకి వెళితే.. గంగాధర మండలం కురిక్యా గ్రామానికి చెందిన గుండారపు కనకయ్య అనే రైతుకు గతంలో వ్యవసాయ భూమి బాగానే ఉన్నా అవసర నిమిత్తం అమ్ముకోగా, కేవలం మూడు గుంటల భూమే మిగిలింది. దీంతో సదరు రైతుకు పట్టాదార్ పాస్ పుస్తకం ఉండడంతో ప్రభుత్వం కల్పించే రైతు బీమా వర్తించింది. దీంతో గుండారపు కనకయ్య అనే రైతు ఇటీవల అకాల మరణం చెందగా, అతని కుటుంబానికి రైతు బీమా పథకం కింద ఐదు లక్షల రూపాయల మంజూరు అయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుంకె ఆ ప్రొసీడింగ్ పత్రాన్ని మతుడి కుటుంబానికి అందించారు. మతుడు కుటుంబానికి అందించారు. గుంట భూమి ఉన్నా ప్రభుత్వం రైతాంగానికి రైతు బీమా పథకాన్ని వర్తింపజేస్తుందని ఈ సంఘటన ద్వారా తేటతెల్లమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్నదాతకు ఆత్మబంధువుగా నిలిచారని, రైతుల కోసం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. దేశంలో మానవత్వం గల ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని అన్నారు. బీజేపీ కార్యకర్తగా గుండారపు కనకయ్య పని చేస్తున్న ఓ రైతుగా అతని ఇంటికి వెళ్లి రైతు బీమా ప్రొసిడింగ్‌ను ఇవ్వడం జరిగిందన్నారు. రైతు బీమా అన్నదాతకు ఆత్మబంధువుగా నిలుస్తుందని అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కురిక్యాల సర్పంచ్ మేచినేని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ కంకణాల రాజగోపాల్‌రెడ్డి, గంగాధర సర్పంచ్ మడ్లపల్లి గంగాధర్, సింగల్ విండో చైర్మన్లు వెలిచాల తిర్మల్ రావు, దూలం బాలగౌడ్, కొండగట్టు ఆలయ ధర్మకర్త నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదు రాష్ట్రాల వాలీబాల్ టోర్నీ ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మల్లాపూర్:


టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని వీవీరావు పేట గ్రామంలో నర్సింగ్గం సార్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐదు రాష్ట్రాల వాలిబాల్ వాలీబాల్ టోర్నీని బిఆర్ఎస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక కొల్లాసం లభిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఐదు రాష్ట్రల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. క్రీడలతో స్నేహ పూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. టోర్నీ విజేతకు 50 వేల రూపాయల ప్రైజ్ మనీ అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు బిట్ల సరోజన, జోగుల మమత, ఎంపీటీసీలు తోట సుజాత, గుగ్లవత్ భూమి, వీడీసీ అధ్యక్షుడు పడాల కాశిరెడ్డి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు మిట్టపల్లి దివాకర్ రెడ్డి, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు మచ్చర్ల దశ రెడ్డి, పోతు గోపి, నాయకులు నర్సింగారావు, బిట్ల నరేష్, జోగుల రాజేష్, తోట శ్రీనివాస్, గుగులావత్ రాజేందర్, మీనుగు చంద్రశేఖర్, మోత్కూరి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణ చట్టంలో సవరణలు

రాష్ట్ర కార్యదర్శి,తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హరి ఆశోక్ కుమార్


నవతెలంగాణ-జగిత్యాల



వయోవద్ధులకు భరోసా కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లిదండ్రులు ,వయోధికుల పోషణ సంక్షేమ చట్టం–2007 నియమావళి 2011లో పలు కీలక సవరణలు చేసిందని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరిఆశోక్ కుమార్ తెలిపారు. సవరణలలోని కీలక అంశాలు వృద్దులను పట్టించుకోకుంటే ఆస్తులు వాపస్ అంశాన్ని కలెక్టర్‌కు బదలాయించారు. గతంలో ఆర్డీవో ఈ ఫిర్యాదులు స్వీకరించేవారు. ఆర్డీవో వద్ద కేవలము మెయిం టెనెన్స్ ఫిర్యాదులు మాత్రమే స్వీకరిస్తారు. ఆస్తుల బదలాయింపు ఫిర్యాదులపై కలెక్టర్ 15 రోజుల్లో స్పందించాలని కోరారు. నిజా ,నిజాల నిర్ధారణకు సదరు ఫిర్యాదును ఆర్డీవోకు పంపించాన్నారు. కలెక్టర్ ఉత్తర్వులు అందిన వెంటనే ఆర్డీవో క్షేత్ర స్థాయిలో పరిశీలించి 60 రోజుల్లోనే ఆర్డీవో తన నివేదికను కలెక్టర్‌కు అందజేయాలన్నారు. జీవన భృతిని పెంచాలని కోరుతూ తల్లిదండ్రులు, వృద్ధులు తిరిగి ఆర్డీవోను ఆశ్రయించవచ్చు.గిఫ్ట్ డీడ్ ఆస్తులతో పాటు రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తులను కూడా తల్లిదండ్రులు వెనక్కి తీసుకునేలా చట్టాన్ని ప్రభుత్వం సవరించిందన్నారు.

ఏఐటీయూసీ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-మెట్‌పల్లి


డైరీ ఆవిష్కరిస్తున్న సీఐశ్యామ్ రాజ్

మెట్‌పల్లి పోలీస్ స్టేషన్లో ఏఐటీయూసీ నూతన సంవత్సర డైరీని పట్టణ సిఐ లక్ష్మీనారాయణ, ఎస్సై. జి శ్యామ్ రాజ్ ఆవిష్కరించారు, ఏఐటీయూసీ కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసిందని, ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకులను సిఐ అభినందించారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎండి ఉస్మాన్, ఏఐటీయూసీ నాయకులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో అధికారులు న్యాయం చేయాలి

నవతెలంగాణ-వీణవంక



కోర్టు ఆదేశాలతో తన వ్యవసాయ భూమి తనకు వచ్చేలా అధికారులు న్యాయం చేయాలని రైతు అనిరెడ్డి ప్రకాష్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో తనకు 7ఎకరాల19 గుంటల వ్యవసాయ భూమి ఉందని, ఆ భూమిని అదే గ్రామానికి చెందిన మ్యాక రమేష్‌కు విక్రయించగా తనకు డబ్బులు పూర్తిగా చెల్లించలేదని పేర్కొన్నారు. అంతేకాకుండా మూడు సంవత్సరాలుగా తనను తిప్పుకుంటూ ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిపారు. దీంతో తాను కోర్టును ఆశ్రయించగా తనకు అనుకూలంగా ఈ నెల 5న తీర్పు ఇచ్చిందని చెప్పారు. తన వ్యవసాయ భూమిలోకి తాను వెళ్తుండగా రమేష్ కుటుంబీకులు అడ్డుకుని చంపుతామని బెదిరిం పులకు పాల్పడుతున్నాడని, ఈ విషయంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కొంత మంది నాయకుల అండదండలతో తమకు అన్యాయం చేసేందుకు పలువురు చూస్తున్నారని, పోలీసులు ఈ విషయంపై తమకు రక్షణ కల్పించి ఆ భూమని సాగు చేసుకునేలా అవకాశం కల్పించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆల్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు వాగ్దేవి విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-కరీంనగర్


అభినందిస్తున్న చైర్మెన్ కృష్ణ

ఆల్ ఇండియా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు కరీంనగర్ పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థి తుల మధుకర్ ఎంపికయ్యాడు. ఫిబ్రవరిలో జరిగే ఈ పోటీలకు స్థానిక శాతవాహన యూనివర్సిటీ తరపున పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ మాట్లాడుతూ కళాశాలలో అత్యున్నతస్థాయి విద్యతో పాటు వివిధ క్రీడల్లో కూడా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా పోటీలకు ఎంపికైన విద్యార్థి తుల మధుకర్ ని కళాశాల ప్రిన్సిపాల్ పూరెళ్ల రాజశేఖర్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ ఏ మునిందర్ గౌడ్, పీజీ ఇంఛార్జి పి రమేష్, ఫిజికల్ డైరెక్టర్ ఏ శ్రీనివాస్, మరియు అధ్యాపకులు అభినందించారు.

కురిక్యాలలో అలరించిన రంగవల్లులు

నవతెలంగాణ-గంగాధర

గంగాధర మండలం కురిక్యాల గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు వేసిన రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎఫ్ఎంసీ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు పోటా పోటీగా రంగు రంగుల ముగ్గులతో రంగవల్లులు వేశారు. రంగు రంగుల కలర్లతో అందంగా ముగ్గులు వేసిన మహిళలను గుర్తించి విజేతలుగా ప్రకటించారు. ముగ్గుల పోటీల విజేతలకు సర్పంచ్ మేచినేని ఎఫ్ఎంసీ నవీన్ రావు, కంపెనీ సేల్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రములో ఎఫ్ఎంసీ కంపెనీ ఎండిఓ నరేష్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్ నవీన్ రావు

ఖమ్మంలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన పాడి

నవతెలంగాణ-వీణవంక

ఖమ్మం జిల్లాలో ఈ నెల 18న సీఎం కేసీఆర్ నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ తొలి సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదేశాలతో పాడి కౌశిక్‌రెడ్డి సీపీ రంగనాథ్‌తో కలిసి సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌తో పాటు సభాస్థలిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ తొలి సభను సీఎ కేసీఆర్ సుమారు 5 లక్షల మందితో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని, కావున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

మండలంలో క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-తిమ్మాపూర్



సంక్రాంతి పండగను పురస్కరించుకొని చిగురుమామిడి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ప్రజా ప్రతినిధులు అధికారులు, రాజకీయ నాయకులు, పాత్రికేయుల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు ఎస్ఐ దాస.సుధాకర్ తెలిపారు. మండలంలోని యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తెగులు సోకిన వరి పంటల పరిశీలన

నవతెలంగాణ-తిమ్మాపూర్

మండలంలోని నుస్తులపూర్ క్లస్టర్ పరిధిలోని మక్తపల్లి, నల్లగొండ గ్రామాల్లో కాండం తొలుచు పురుగు సోకిన వరి పంటను మండల వ్యవసాయ అధికారి సురేందర్ శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితి వల్ల వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు ఎకరానికి 3 లింగాకర్షక బట్టలు పెట్టి, వారానికి 25-30 పురుగులు పడినపుడు తప్పని సరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎకరాకు కర్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కేజీలు, లేదా కర్టాఫ్ హైడ్రో క్లోరైడ్ 4జీ గుళికలు 8 కేజీలు, క్లోరంత్రనీలిప్రోల్ 0.4జీ 4 కేజీలు వేయాలని రైతులకు సూచించారు. ఈ పురుగు లార్వా దశలో ఎక్కువగా ఉంటే కర్టాఫ్ హైడ్రో క్లోరైడ్ 50 ఎస్‌పీ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. వారి వెంట అధికారి స్వామి, రైతులు పెంట సమ్మయ్య,దొనపాటి వెంకట రమణారెడ్డి, నర్సింహ రెడ్డి ఉన్నారు.


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జగిత్యాల

బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన జల్ల లక్ష్మి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. వారి కుటుంబ సభ్యులను ముదిగంటి రవీందర్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కంది రమేష్. మండల ఉపాధ్యక్షులు సముద్రాల రాజశేఖర్. సీనియర్ నాయకులు మమ్మాడి శశి, దళిత మోర్చా అధ్యక్షులు నారపాక ప్రభాకర్. నారపాక అనిల్. బూత్ అధ్యక్షులు ఉయ్యాల స్వామి. బీజేవైఎం మండల అధ్యక్షుడు నరేందర్. మడిశెట్టి ప్రభాకర్. కుర్మాచలం సతీష్. బస నాగేంద్ర. వల్లెపు శ్రీకాంత్. తదితరులు ఉన్నారు .


పరామర్శిస్తున్న రవీందర్‌రెడ్డి

వంజరి సంఘం అధ్యక్షులుగా ఆంజనేయులు

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల పట్టణ వంజరి సంఘం ఎన్నికలు ఇటీవలే ఏకగ్రీవమయ్యాయి. పట్టణ వంజరి సంఘం అధ్యక్షులుగా నవ్వోతు ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా బానుక రాజేశం, కార్యదర్శులుగా కడెంగు శంకర్, కోశాధికారిగా నవ్వోతు రాజేందర్ లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు కొండేటి గంగాధర్, కావేటి శ్రీనివాస్, కొండేటి లక్ష్మీనారాయణ, దాత్రిక ధర్మేందర్ లు తెలిపారు.

సీఎం రాకతో ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-కరీంనగర్

కరీంనగర్‌లో గల బైపాస్‌లోని కొండ సత్యలక్ష్మి గార్డెన్‌లో జరిగే మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య పెద్దకర్మకు సీఎం కేసీఆర్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ సునీల్‌రావు ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. బైపాస్‌లోని కొండ సత్యలక్ష్మీ గార్డెన్, స్పోర్ట్స్ స్కూల్ హెలిప్యాడ్ గ్రౌండ్‌ను సందర్శించి తనిఖీ చేశారు. పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అంతే కాకుండా రూట్ మ్యాప్‌కు సంబంధించిన ప్రధాన రహదారుల్లో పర్యటించే పారిశుధ్య పనులు పరిశీలించారు.వారి వెంట డిప్యూటీ కమిషనర్ త్రియంభకేశ్వర్, ఎస్ఈ నాగేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ తిరుమల్, ఈఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.


పరిశీలించిన మేయర్ సునీల్‌రావు

అచీవర్స్‌లో కరాటే బెల్టుల ప్రదానోత్సవం

నవతెలంగాణ - కరీంనగర్

స్థానిక కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో కరాటే బెల్ట్‌ల ప్రదానోత్సవం శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అచీవర్స్ పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సి పాల్ శ్రీమతి సి.హెచ్. పల్లవి, ,గోజుర్యు కరాటే తెలంగాణ చీఫ్ ఇన్స్ట్రక్టర్ సురభి వేణుగోపాల్, ఇన్స్ట్రక్టర్ వినేష్ పాల్గొన్నారు. ఆరు నెలల నుండి శిక్షణ పొందిన విద్యార్థులకు కరాటె బెల్టులు ప్రదానం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుండే కరాటే నేర్చుకోవడం వలన ఆత్మ సంరక్షణ ,ఆత్మస్థైర్యం పెరుగు తుందన్నారు.


విద్యార్థులకు అందజేస్తున్న బహుమతులు

ఇంటి నెంబర్లు కేటాయించాలలి

నవతెలంగాణ-తిమ్మాపూర్

మండలంలోని వచ్చునూర్ గ్రామ బస్టాండ్ సమీపంలో పదేండ్లుగా నివసిస్తున్న ఎస్సీ కుటుంబాలకు ఇంటి నెంబర్లు లేవని, దీంతో విద్యుత్‌శాఖ అధికారులు వారికి కరెంటు కూడా ఇవ్వడం లేదని వెంటనే ఇంటి నెంబర్లు కేటాయించాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కనకయ్యకు, ఎంపీవో కిరణ్ కుమార్‌కు వినతి పత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరెంటు లేకపోవడంతో ఇండ్లలోకి పాములు, తేళ్ళు వస్తున్నాయని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఇంటి నెంబర్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ మానకొండూరు ఉపాధ్యక్షులు మాతంగి మల్లేశం,మాతంగి మల్లేశం, తిమ్మా పూర్ మండల కన్వీనర్లు గుర్రం సత్యనారాయణ, వద్దిరాల అభిలాష్, తిమ్మాపూర్ సెక్టార్ అధ్యక్షులు వేల్పుల పోచయ్య యాదవ్, వచ్చునూర్ గ్రామ కన్వీనర్ తాళ్లపల్లి రాకేష్, కార్యకర్తలు కనకం ప్రదీప్, లింగన్న, రాజమల్లు, లింగమూర్తి ఉప్పులేటి పరశురాములు, బాబు ,ఆంజనేయులు, చిరంజీవి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న బిఎస్పీ నాయకులు

కమ్మరిపేటలో వాలీబాల్ పోటీలు

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలంలోని కమ్మరిపేట గ్రామంలో సర్పంచ్ పిట్టల లక్ష్మీ రాజిరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలలో భాగంగా గ్రామ యువకులకు వాలీబాల్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం యువకులకు మానసిక ఉల్లాసంతో పాటు శరీర దృఢత్వం పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. యువత పిల్లలు ఫోన్‌లలో గేమ్స్ ఆడి అనారోగ్యాల పాలు కాకుండా గ్రౌండ్‌లో ఆటలు ఆడి మేధస్సు పెంపొందించుకోవాలని సర్పంచ్ సూచించారు. వెంట గ్రామ ప్రజా ప్రతినిధులు తాలూకా గంగన్న, రెబ్బాస్ మల్లయ్య, పిట్టల రాజారెడ్డి ఉన్నారు.

ఎస్ఈ ఆఫీస్ ఎదుట నగర కాంగ్రెస్ ధర్నా

నవతెలంగాణ-కరీంనగర్

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లులలో ఏసీడీ చార్జీల పేరుతో వినియోగదారులపై అదనపు భారం వేయడాన్ని నిరసిస్తూ నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల నుంచి నిత్యం ఏదో ఒక రూపంలో చార్జీల పేరుతో వేలకు, వేలు వసూలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి నిత్యకృత్యమై పోయిందని మండిపడ్డారు. గతంలో కేవలం క్యాటగిరి 2(వ్యాపారులకు)కు మాత్రమే ఏసీడీ చార్జీలు వసూలు చేసేవారని, ఇప్పుడు గృహ వినియోగదారులపై కూడా వసూలు చేయడానికి తెరలేపారని ఇది సామాన్య మధ్యతరగతి ప్రజల నడ్డివిరిచే విధంగా ఉందని నరేందర్‌రెడ్డి అన్నారు. ఒక్కో బిల్లులో అయిదు వందల నుండి అయిదు వేల పైనభారం వేశారని, ఇది రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ సంక్రాంతి పండుగ కానుకనా అని ఎద్దేవా చేశారు. చార్జీల పెంపు వెంటనే ఉపసంహరించుకోవాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ధర్నా అనంతరం ఎస్ఈకి వినతిపత్రం ఇచ్చారు, ఈ కార్యక్రమంలో బానోతు శ్రావణ్ నాయక్, గుండాటీ శ్రీనివాస్ రెడ్డి, లింగంపల్లి బాబు, కుర్ర పోచయ్య దండి రవీందర్,బాలబద్రి శంకర్, షబానా మహమ్మద్,సలిమొద్దిన్, జీడీ రమేష్, మామిడి సత్యనారాయణ రెడ్డి, ముక్క భాస్కర్,మెతుకు కాంతయ్య, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, ఆమెర్, కీర్తి కుమార్, మంద మహేష్, సిరాజుద్దిన్, జిలకర రమేష్, భారీ, బొబ్బిలి విక్టర్, అజ్మత్, అష్రఫ్, కవిత, లింగమూర్తి, ఇమామ్, వంశీ, కమల్, సర్వర్,తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్ర, రాష్ట్రాల్లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- అసత్య ప్రచారాలను కార్యకర్తలు నమ్మొద్దు
- జోడో అభియాన్‌పై జువ్వాడి సమీక్ష

నవతెలంగాణ-మెట్‌పల్లి

కేంద్ర, రాష్ట్రాల్లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జోడో అభియాన్‌పై నియోజకవర్గ స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జోడో అభియాన్ నిర్వహించారు.జనవరి 26 నుండి మొదలు కానున్న ఈ కార్యక్రమంలో ప్రతి మండల అధ్యక్షులు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, బూత్ లెవల్ నాయకులు,పాల్గొని దేశంలో బిజెపి, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాల దుర్మార్గపు పాలనను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నేత జువ్వాడి కృష్ణారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి, పెరుమాండ్ల సత్యనారాయణ గౌడ్, సీనియర్ నాయకులు,కొంరెడ్డి లింగారెడ్డి,మెటుపల్లి పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం,మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, కోరుట్ల పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్,కోరుట్ల మండల అధ్యక్షుడు కొంతం రాజాం, మల్లాపూర్ మండల అధ్యక్షుడు పుంద్ర శ్రీనివాస్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, చిట్టపూర్ సర్పంచ్ సాయి, మల్లాపూర్ ఎంపీటీసీ, సత్తమ్మ-మల్లయ్య.,వేంపెట్ ఉప సర్పంచ్ గోరుమతుల ప్రవీణ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగ్ రావు

సీఎం సహాయనిధి పేదలకు వరం

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి

నవతెలంగాణ-పెగడపల్లి

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. పెగడపల్లి మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గజ్జల తరుణ్ కుమార్ రూ.60వేలు, పూసల గంగవ్వ, రూ.60వేలు, ఏనుగు ప్రభాకర్‌కు రూ.41.500/ శంకరమ్మకు రూ.35వేలు, జరుపుల రాజు నాయక్‌కు రూ.25 వేలు, జరుపుల నిర్మలకు రూ.21వేలు, సురకంటి మధుసూదన్‌రెడ్డికు రూ.15 వేలు, సుర రాజ నర్సయ్యకు రూ.15 వేలు, అజ్మీర తిరుపతి నాయక్‌కు రూ. 14వేలు, శివరాత్రి అక్షిత రూ.13వేలు, ఆడెపు గంగమ్మ రూ.15వేలు, మహేష్ రూ.20వేల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుర్రం మల్లారెడ్డి, తోడేటి లచ్చయ్య, అజ్మీర భూమా నాయక్, బీఆర్ఎస్ యూత్ విభాగం మండల అధ్యక్షుడు సొల్లేటి సంతోష్, సింగిల్ విండో డైరెక్టర్లు సాయిల్ల ఎల్లయ్య, పెంటల శ్రీనివాస్, తోడేటి వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షులు కంబాల తిరుపతి నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న మల్లారెడ్డి

అంబేద్కర్ స్టేడియంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ -మెట్ పల్లి

మెట్‌పల్లి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో రూ.50 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శుక్రవారం కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్టేడియంలో మిగులు పనులను పూర్తి చేసేలా రూ.50లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఇంకా అవసరమైతే మరిన్ని నిధులు కేటాయించి స్టేడియంలో పనులు పూర్తి చేస్తామన్నారు.స్టేడియంలో క్రీడాకారులకు ఏ ఇబ్బంది కలగకుండా పూర్తిస్థాయి పనులు చేయాలని నియోజక వర్గానికి గుర్తించి తెచ్చేలా స్టేడియాన్ని తీర్చిదిదడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖరరావు, ఎంపీపీ మారు సాయిరెడ్డి, కౌన్సిలర్ ధ్యానపెల్లి వరలక్ష్మి రాజారాం, మన్నే ఖాన్, కోఆప్షన్ మార్గం గంగాధర్, బర్ల సాయన్న జావిద్ , ఓజెల శ్రీనివాస్, లింగంపల్లి సంజీవ్ ,అరిసెల మురళి ,జక్కం బాబు, సుధాకర్ గౌడ్ .అధికారులు ఏఈ అరుణ్ కుమార్ , పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వృద్ధురాలు మెడలోంచి పుస్తెలతాడు చోరీ

నవతెలంగాణ-మల్లాపూర్:

నిత్యవసర సరుకుల కోసం కిరాణానికి వెళ్తున్న వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు చోరీ చేసి పరారీ అయిన సంఘటన మండల ంలోని మొగిలిపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిట్యాల నర్సు నిత్యవసర సరుకులు కొనుక్కునేందుకు వెళుతుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనం పై వచ్చి దాడి చేసి ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు లాక్కొని వెళ్లారు. బాధితురాలు నర్సు కేకలు వేయగా పక్కనే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై నవీన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. బాధితురాలు ఫిర్యాదులకు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

రహదారుల నిర్మాణంపై ఎమ్మెల్యే సమీక్ష



నవతెలంగాణ-తిమ్మాపూర్

మానకొండూర్, అన్నారం గ్రామాలలో కొనసాగుతున్న రహదా రుల నిర్మాణ పనులపై శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ఎలక్ట్రిసిటీ, రహదారులు, భవనములశాఖ, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని రసమయి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో కరీంనగర్ సుడా చైర్మెన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు .జీవి. రామకృష్ణారావు, మానకొండూర్ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడ రంగాన్ని ప్రోత్సాహించడంలో ప్రభుత్వాలు విఫలం

డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి తిరుపతి

నవతెలంగాణ-కరీంనగర్

యువతను క్రీడారంగంలో ప్రోత్సహి ంచడంతో పాటు, బడ్జెట్‌కు నిధులు కేటయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని స్థానిక సప్తగిరి కాలనీలో వాలీబాల్ క్రీడా పోటీలను బావైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తిరుపతి హాజరై ప్రారంభించారు. అనంతరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరేష్ పటేల్, తిరుపతి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడా మైదానాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల క్రీడలు కనుమరుగవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి క్రీడా మైదానాలు ఏర్పాటు చేయకుండా నేడు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మకై నేడు అధికారులు వారికి రిజిస్ట్రేషన్ చేయడం వల్ల ప్రభుత్వ స్థలాలు కనుమరుగవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆరు మ్యాచ్లు పోటీ పడగా మొదటి రెండు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా సహ కార్యదర్శి తెజావత్ రాజు, అశోక్, నవీన్, రాజేందర్, శివ,ప్రకాష్,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న తిరుపతి

ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండల ఎంపీపీ దొనకంటి ఉమాదేవి భర్త దొనకంటి రాజరత్నాకర్‌రావుకి మోకాలు మార్పిడి శస్త్ర చికిత్స ఆపరేషన్ జరిగింది. హైదరాబాదులోని వారి నివాసంలో జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు పరామర్శించారు. ఆయన వెంట మేడిపల్లి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సత్తిరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వంగ వెంకటేశం, గుండ్లపల్లి గ్రామ సర్పంచ్ సంపత్ కుమార్, మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు గంగాధర్ గౌడ్, పోరుమళ్ళ మాజీ సర్పంచ్ వీరభత్తిని ఆంజనేయులు,నాయకులు పురుషోత్తం,మురళి వడ్డేపల్లి శ్రీను ఉన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి

నవతెలంగాణ-మానకొండూర్

గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని కరీంనగర్ జిల్లా బిసి సెల్ అధ్యక్షులు పులి అంజనేయగౌడ్ అన్నారు. మండలంలోని మది కుంట, కొండపల్కల, వన్నారం, లలితపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రచారి ఆధ్వర్యంలో శుక్రవారం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రా చారి, డిసిసి ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్, నాయకులు సాయిరి దేవయ్య, గట్టు శ్రీధర్ బాబు, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

భాదిత కుటుంబానికి గడ్డం నాగరాజు పరామర్శ

నవతెలంగాణ-మానకొండూర్

మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన అంబటి మహేష్ ఇటీవల ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు నిరుపేద బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. నాగరాజు వెంట కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బోంగోని శ్రీనివాస్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు కత్తి ప్రభాకర్, బీజేవైఎం మండల అధ్యక్షులు భాషబోయిన ప్రదీప్ యాదవ్, ఉపాధ్యక్షుడు కత్తి రాకేష్, అభిలాష్, పొలం త్యాగరాజు, గోపు తిరుపతిరెడ్డి, కోమల్ల తిరుపతి, హుస్సేన్ అంబాటి అంజి, అంబాటి స్వామి, అంబాటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


బియ్యం అందజేస్తున్న నాగరాజు

క్వింటాల్ పత్తికి రూ. 8140

నవతెలంగాణ-జమ్మికుంట

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి రూ. 8140, మాడల్ ధర 8050, కనిష్ట ధర రూ. 7,550 పడింది. అలాగే కాటన్ బ్యాగ్స్‌లలో 18 క్వింటాళ్లకు గరిష్ఠ ధర రూ. 7800, మోడల్ ధర రూ.7700, కనిష్ట రూ. 6500 పలికిందని మార్కెట్ కార్యదర్శి గుగులోతురెడ్డి తెలిపారు. శని, ఆదివారం మార్కెట్‌కు సెలవు ఉంటుందని, సోమవారం కనుమ పండుగ సందర్భంగా అర్తి వ్యాపారస్తుల కోరిక మేరకు సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఈనెల 17 మంగళవారం మార్కెట్ పునః ప్రారంభమవుతుందన్నారు.


పత్తిని పరిశీలిస్తున్న వ్యాపారులు

దుబాయ్ సేవ సమితి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బుగ్గారం

వెల్గొండ గ్రామనికి చెందిన చిర్నేని భూమిక(10) కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయన్ని గ్రామస్థుల ద్వారా తెలుసు కొని దుబాయ్‌లో ఉంటున్న వెల్గొండ గ్రామస్థులు తమ వంతుగా తలో కొంత డబ్బులు వేసు కొని మొత్తం రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు.


ఆర్థిక సాయం అందస్తున్న మిత్రులు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కౌనిల్సర్ అనిత

నవతెలంగాణ-చొప్పదండి

చొప్పదండి పట్టణంలోని ఐదో వార్డు ఇందిరానగర్ కాలనీకి అంబేద్కర్ కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే సుంకెరవిశంకర్ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ఎమ్మెల్యే కూడా కాలనీ వాసుల సమస్యను పట్టించుకోలేద న్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే రవిశంకర్ అంబేద్కర్ భవనం మంజూరు చేశారని పేర్కొన్నారు.



మెడికల్ కాలేజీలో భోగి సంబురాలు


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో మొదటి విద్య సంవత్సరం వైద్య విద్యా ర్థులతో కలిసి భోగి సంబరాల కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్ ఆనంద్ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

అంతర్గం గ్రామంలో రైతు ఉత్పత్తి దారుల సంఘం 2023 నూతన సంవత్సర క్యాలండర్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలను పరామర్శించి ఎమ్మెల్యే

జగిత్యాల రూరల్ మండలం మొరపల్లి గ్రామానికి చెందిన గోనేకాపు రైతు సంఘం అధ్యక్షులు తుర్క సతీష్ రెడ్డి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, సర్పంచ్ సత్తమ్మగంగారం,గ్రామ శాక రాజీ రెడ్డి, నాయకులు కమలాకర్ రావు,తిరుపతి,వెంకటేష్, భాస్కరరావు భీమారావు తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అటల్ బిహారీవాజ్ పాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేత మెట్‌పల్లి టీంకు బీజేపీ నాయకుడు సురభి నవీన్ కుమార్, బహుమతితో పాటు నగదు రూ. 15వేలు అందించారు. రన్నర్ టీం ఇంద్రసేనకు రూ.10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, రాష్ట్ర నాయకులు సాంబార్ ప్రభాకర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధోనీకేల నవీన్,కౌన్సిలర్ మర్రి పోచయ్య,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సుంకేట విజయ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్ యాదవ్, సీనియర్ నాయకులు తోకల సత్యనారాయణ,బొడ్ల గౌతం,మద్దెల లావణ్య, ఇరగదుడ్ల వెంకటేష్, పాంపాటి ఆనంద్, కలిగోట శ్రీకాంత్,యామ వినోద్ క్రీడాకారులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న నవీన్.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ- తిమ్మాపూర్

మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన నూనె సంపత్‌కు మంజూరైన రూ.16000, నాగం సారవ్వ రూ.34,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సింగిల్విండో చైర్మన్ రాధాకిషన్ రావు, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు ఖమ్మం కృష్ణ లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు వట్టే రాజయ్య, పడాల సంతోష్, పప్పు నర్సయ్య వెంగళ ఎల్లేష్, మావురపు రాజేందర్, గుంటి సంపత్, మహ్మద్ సలహోద్దీన్, గోద శ్రీనివాస్, ఆకుల సదానందం పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

యువతరం యూత్ అసోసియేషన్‌కు ఉత్తమ అవార్డు

నవతెలంగాణ-మానకొండూర్

యువతరం యూత్ అసోసియేషన్ సదాశివపల్లికి 2021-22 సంవత్సరానికి గాను జిల్లా స్థాయి ఉత్తమ యువజన సంఘం అవార్డు దక్కింది. శుక్రవారం స్వామి వివేకానంద జన్మదినాన్ని పురస్కరించుకొని నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.వి కర్ణన్, అడిషనల్ కలెక్టర్లు గరిమ అగర్వాల్, శ్యాం ప్రసాద్ లాల్ చేతుల మీదుగా యువతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కు ఉత్తమ యువజన సంఘం అవార్డు ప్రదానం చేశారు. అలాగే సర్టిఫికెట్, మెమొంటో తో పాటు రూ. 25వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువతరం యూత్ సభ్యులు కొండ సంతోష్, శ్రీనిథ్, సింగిరెడ్డి నవీన్ రెడ్డి, సిద్దు ,చరణ్, శివ పాల్గొన్నారు.



ఊరెళ్తున్నారా..? జాగ్రత్త!



నవతెలంగాణ - వేములవాడ రూరల్ : సంక్రాంతి పండుగకు ఇల్లు విడిచి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాల ని, అలాంటి వారు ముందస్తుగా పోలీసులకు సమా చారం అందిస్తే ఆయా ప్రాంతాల్లో గస్తీ పెంచుతా మని వేములవాడ రూరల్ ఎస్సై నాగరాజు తెలిపా డు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండగకి ప్రజలు సొంత ఊర్లకు వెళ్తే ఇంటి దగ్గర నమ్మకంగా ఉన్నవారికి గాని రూరల్ పోలీస్ స్టేషన్‌లోగాని సమాచారం అందిస్తే ఆ గ్రామాల్లో రాత్రి పెట్రోలింగ్ పెంచుతామన్నారు. ఇంట్లో ఎలాంటి నగదు, విలువైన బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు ఇంట్లో పెట్టుకోకుండా తమ వెంట తీసుకువెళ్లాలని లేదా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. ఇంటికి వేసే తాళాలు పెద్ద సైజ్ ఉండాలని, తాళం కనపడకుండా డోర్ పరదాలు అడ్డు ఉండేలా చూసుకోవాలని, ఇంటికి తాళం వేసి వెళ్ళినట్లయితే కచ్చితంగా ఇంటి బయట లోపల ఒక లైట్ ఆన్‌లో వేసి ఉంచాల న్నారు. ఇంటి మెయిన్ గేట్ కి బయటవైపు తాళం కనబడే విధంగా వేయరాదని, ఇంటికి ప్రతీ రోజు వేసే న్యూస్ పేపర్, పాలు వంటి వాటిని మీరు తిరిగి వచ్చేదాకా ఆపేయాలని ఎవరైనా కొత్త వ్యక్తులు కాలనీల్లోకి చీరలు, ఉల్లిగడ్డలు, ఇనుపసామాన్లు, వివిధ రకాల వస్తువులు అమ్మడానికి, కొనడానికి వస్తే వారిని గమనిస్తూ ఉండాలని, ఏ చిన్న అనుమానం వచ్చిన డయల్ 100 కి, రూరల్ ఎస్.ఐ 8712656417 నెంబర్ కి సమాచారం అందించాలని ప్రకటనలో కోరారు.



నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ : సంక్రాంతి పండుగకు సొంతూర్లకు వెళ్లే వారు తమ వివరాలను టూ టౌన్ పోలీస్ స్టేషన్లో తెలియచేయాలని గోదావరిఖని టూ టౌన్ సీఐ సూరం వేణుగోపాల్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊర్లకు వెళ్లే వారు పోలీస్ స్టేషన్లో తెలిపినట్లైతే ఆ ఏరియాలో నైట్ పెట్రోలింగ్ పెంచుతామని, ఇంట్లో ఎలాంటి విలువైన వస్తువులు గాని, నగదు గాని బంగారు ఆభరణములు ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాఖరులో గాని తమ వెంట గాని తీసుకొని వెళ్లడం మంచిదని సూచించారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

- రూ.19వేల నగదు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం
- పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవు: సీఐ వెంకటేష్



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్లు, నగదు

నవతెలంగాణ - వేములవాడ : వేములవాడ పట్టణంలోని మూలవాగు సమీపంలో పేకాట ఆడుతున్న వ్యక్తులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఓ.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని మూలవాగు పక్కన రహస్య స్థావరం ఏర్పాటు చేసుకొని కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో తమ సిబ్బందితో కలిసి వెళ్లి అక్కడికి వెళ్లి తనిఖీలు చేపట్టగా పేకాట ఆడుతున్న ఐదుగురిని గుర్తించి అరెస్ట్ చేశామని, మరో నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన వారి నుండి రూ.19240 నగదు, 5 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూదంతో కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని, ప్రజలందరూ వ్యసనాలకు బానిసలు కాకుండా కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని సూచించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేస్తామని, ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తమ దృష్టికి వస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఎక్కడైనా ఎవరైనా పేకాట ఆడుతున్నట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని, వెంటనే అక్కడికి చేరుకొని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ - వేములవాడ రూరల్ : వేములవాడ రూరల్ మండలంలోని మల్లారం మూలవాగు వాగు నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ని పట్టుకొని సీజ్ చేసి, కేస్ నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ, మైనింగ్ శాఖ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానం



నవతెలంగాణ - వీర్నపల్లి : వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో నూతనంగ ఎన్నికైన సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశంను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మండల అధ్యక్షులు పిట్ల లింబద్రి, మండల నాయకులు లింబద్రి, మహేందర్, తిరుపతి కుల పెద్దలు దుది రాములు, పోషయ పాల్గొన్నారు.

మంత్రి గంగులకు మంథని నాయకుల పరామర్శ

నవతెలంగాణ - మంథని : మంత్రి గంగుల కమలాకర్ తండ్రి గంగుల మల్లయ్య ఇటీవల మృతి చెందగా శుక్రవారం రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్‌ను మంథని ప్రజాప్రతిధులు, నాయకులు కలిసి పరామర్శించారు. మంథని ఎంపీపీ కొండ శంకర్, సింగల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, జెడ్పిటిసి తగరం సుమలత శంకర్ లాల్, రైతుబంధు అధ్యక్షులు ఆకుల కిరణ్ తో పాటు పలువురు నాయకులు రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగఢ సానుభూతిని చేశారు.



లక్ష్మీపూర్‌లో ఉద్రిక్తత..

వ్యక్తి మృతి పై అనుమానం...

ఆందోళన వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు



మృతదేహాన్ని భుజంపై వేసుకొని గ్రామంలో పరుగులు తీస్తుండగా అడ్డుకుంటున్న పోలీసులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : తంగళ్ళపల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలో గ్రామానికి చెందిన జడ మల్లయ్య(60) శుక్రవారం మృతి చెందగా గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మల్లయ్య గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మల్లయ్య మృతిపై అనుమానం ఉన్నట్లు గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు లక్ష్మీపూర్ గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు యత్నించారు. పోలీసుల యత్నాన్ని మృతుని కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మృతుని తమ్ముని కొడుకు అయిన జడ రాజు మృతదేహాన్ని భుజంపై వేసుకొని గ్రామంలో పరుగులు తీశాడు. దీంతో పోలీసులు చెమటోడ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా హాస్పిటల్ కి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గ్రామాల అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

ఎంపీపీ పిల్లి రేణుక



భూమి పూజ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : గ్రామాల అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలోకి వచ్చాయని ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామంలో ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఇమ్మడి బాలరాజు ఇంటి నుంచి ఎల్లమ్మ టెంపుల్ వరకు ఐదు లక్షల సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎంపీపీ పిల్లి రేణుక మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండ రమేష్, గ్రామ సర్పంచ్ మంగోలి నర్సాగౌడ్, ఉపసర్పంచ్ షేక్ ఉస్మాన్, మార్కెట్ డైరెక్టర్ వాసరవేని దేవరాజు, గ్రామ ఉపాధ్యక్షుడు గనగోని దేవయ్య, వార్డు సభ్యులు గొల్లపల్లి సురేష్, యాద మంజుల, రాములు, చాకలి అంజయ్య, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కోల నారాగౌడ్, గ్రామస్తులు అశోక్ శంకరయ్య, ఎల్లం యాదగిరి, గఫార్, శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

న్యాయస్థాన నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ - గోదావరిఖని : రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్ స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో గతంలో న్యాయస్థాన భవనాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే చందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలు కోర్టు కేసుల నిమిత్తమై పెద్దపల్లికి వెళ్లే పరిస్థితి ఉండేదని అన్నారు. అలాగే స్థానికంగా ఉన్న న్యాయస్థానాల్లో అరకొర సౌకర్యాలతో న్యాయవాదులు, ప్రజలు ఇబ్బంది పడుతుండే వారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత, నూతన న్యాయస్థానమును ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ న్యాయస్థానం ఏర్పాటు విషయంలో విన్నవించగా, ఆయన సానుకూలంగా స్పందించి, న్యాయస్థానం ఏర్పాటుకు సహకరించారన్నారు. కాగా, ప్రభుత్వం కేటాయించిన ఈ స్థలంలో రూ.26 కోట్ల రూపాయల నిధులతో 5 న్యాయస్థాన భవనాలతోపాటు ఐదుగురు న్యాయమూర్తుల నివాస గృహాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షులు శైలజ, ప్రధాకార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్ తో పాటు బాధ్యులు భూమయ్య, చెలికల పద్మజ, ఉమర్, విక్రమ్‌తో పాటు సీనియర్ న్యాయవాది పూర్మ శ్రీనివాస్ తదితరులున్నారు.

సదరన్ రీజయన్ ఇడిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన సుబ్రత్ మండల్



నవతెలంగాణ - గోదావరిఖని : ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వెస్ట్రన్ రీజియన్ వన్ సుబ్రతా మండల్ శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంతకముందు కొనసాగిన నరేష్ ఆనంద్ ఇటీవల ఢిల్లీకి సెక్రటరీ సీఎండీకిగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన స్థానంలో మరొకరిని నియమించేంత వరకు అదనపు బాధ్యతలను సుబ్రత్ మండల్‌కు అప్పగించారు. సదరన్ రీజియన్‌కు హైదరాబాద్ హెడ్ క్వార్టర్‌గా రామగుండం, సింహాద్రి, కాయంకులం, కుడిగి చెన్నై యూనిట్లు ఉన్నాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ - వేములవాడ : సంక్రాంతి పండగను పురస్కరించుకొని శుక్రవారం వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని పోటాపోటీగా ముగ్గులు వేశారు. అనంతరం పోటీల్లో పాల్గొని మొదటి, ద్వితీయ బహుమతులను పొందివారిని అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ అంజయ్య, సంతోష్, భరత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మహేందర్, అశోక్, దేవయ్య, లత, స్వప్న, సరస్వతి, దీపిక, మంగ, లత, రాము పాల్గొన్నారు.

తహసీల్దార్, వైద్యాధికారిని సన్మానించిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ - ముత్తారం: ముత్తారం నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.వరంధన్‌ను, నూతన వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.అమరేందర్‌ను ముత్తారం కాంగ్రెస్ నాయకులు శుక్రవారం వేర్వురుగా కలిసి ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.వరంధన్‌ను కలిసి కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ, అడవి శ్రీరాంపూర్ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి బాలాజీ శాలువా కప్పి సత్కరించారు. అదేవిధంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఆర్.అమరేందర్‌ను కలిసి వారు శాలువా కప్పి సన్మానించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ముత్తారం మండల యువజన ఉపాధ్యక్షుడు గాదం శ్రీనివాస్, ముత్తారం గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోల విజయ్, సీనియర్ నాయకులు నిమ్మతి ఆశాలు, తాళ్ల పెల్లి విష్ణువర్ధన్ గౌడ్, చెలుకల జితేందర్, బక్కతట్ల కుమార్ తదితరులున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ప్రజల ఇబ్బందులు

మొరానికి బదులుగా ఓసిపి మట్టి పెల్లలు



రోడ్డుకు ఇరువైపులా మట్టి పెల్లలు, బండరాళ్లు

నవతెలంగాణ-ముత్తారం: ముత్తారం మండలం ఇప్పల్లపల్లి, సీతంపేట, శుక్రవారంపల్లి గ్రామాల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా చేపట్టిన రోడ్డు నిర్మాణం పనుల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతుల కోసం రూ.2.50కోట్లు మంజూరు అయ్యాయి. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ బీటీ రోడ్డు పనులను చేపట్టారు. అయితే రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి నేర్పించాల్సి ఉండగా, మొరం మట్టి కాకుండా ఓపెన్ కాస్ట్ మట్టి పెల్లలు టిప్పర్లతో తీసుకువచ్చి గ్రామాలలోని రోడ్డుకు ఇరువైపులా పోశారు. అందులో మట్టి పెళ్లలు, బండరాళ్లు ఉండగా గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా కనీసం పోసిన మట్టిని నేర్పకపోవడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు పక్కగా ఇండ్లలో నివసించే వారు ఈ మట్టి పెల్లల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. నిర్లక్ష్యంగా, ఇష్టానుసారంగా మట్టిపోసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోని ఆర్‌అండ్‌బి అధికారులపై ఇప్పులపల్లి సర్పంచ్ ఉప్పు సుగుణశ్రీనివాస్, వార్డు మెంబర్ గాజనవేని శైలజ అరుణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, మట్టి పెల్లలను తొలగించి మొరం పోయించాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

డీఎస్పీ నాగేంద్రచారి



బెల్టులు పొందిన విద్యార్థులతో డీఎస్పీ, కోచ్

నవతెలంగాణ - వేములవాడ : విద్యార్థులు ఆత్మరక్షణ కోసం కరాటే తప్పసరి నేర్చుకోవాలని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. ఒకినవ స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నన్ ఆధ్వర్యంలో శుక్రవారం వేములవాడ పట్టణంలోని ఈ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కరాటే బెల్టులు, సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమానికి డిఎస్పీ హాజరై మాట్లాడారు. ఈ క్రమంలో బెల్టులు పొందిన విద్యార్థులతోపాటు కొన్ని సంవత్సరాల నుండి ఎంతోమంది విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చి ప్రతిభావంతులను చేశాడంటూ కోచ్ మన్నన్‌ను ప్రత్యేకంగా అభినందించాడు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటేష్, తహసీల్దార్ రాజురెడ్డి, కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కొండ దేవయ్య, కౌన్సిలర్లు బింగి మహేష్, సిరిగిరి చందు, జోగిని శంకర్, మారం కుమార్, ఇప్పపూల అజయ్, నరాల శేఖర్, కొండ పావని నరసయ్య, జడల లక్ష్మి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సుధాకర్‌రెడ్డి, కరాటే మాస్టర్లు నాంపల్లి విజయ్, సుద్దాల శ్రీనివాస్, అవధూత రజినీకాంత్, కూరగాయల శ్రీనివాస్, రాజశేఖర్, అనుగుల వర్షిత్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంక్రాంతి ముగ్గు

- వేములవాడ ప్రాముఖ్యత ఉట్టిపడేలా ముగ్గు వేసిన ప్రియాంక అనే మహిళ
- ప్రియాంకకు వెల్లువెత్తుతున్న అభినందనలు



నవతెలంగాణ - వేములవాడ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని ఆర్య వైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పలువురు మహిళలు పాల్గొని, రకరకాల ముగ్గులు వేశారు. ఇందులో ప్రియాంక అను మహిళ వేసిన ముగ్గు అందరిని ఆకట్టుకుంది. స్వచ్ఛ వేములవాడ థీమ్ ప్రతిబింబించేలా వేసిన ఈ ముగ్గులో వేములవాడ రాజన్న కోడె మొక్కు సంప్రదాయం, 2022లో సాధించిన అవార్డ్, స్వచ్ భారత్, తడి-పొడి చెత్తపై అవగాహన, మహిళ సాధికారత, హరితహారం, షీ-టీమ్ పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతూ పట్టణ ప్రజలకు అవగాహన కల్పించేలా ముగ్గును తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా వేములవాడ ప్రాముఖ్యతను వివరించేలా ముగ్గు వేసిన ప్రియాంకను మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, కౌన్సిలర్లు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు అభినందించారు.

కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న చైర్ పర్సన్ మాధవి, ప్రక్కన కౌన్సిలర్ చందు

నవతెలంగాణ - వేములవాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకంలో భాగంగా వేములవాడ పట్టణానికి చెందిన 91 మందికి చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను శుక్రవారం వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, కౌన్సిలర్ల చేతులమీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం పేదింటి ఆడపిల్లల జీవితాల్లో వెలుగులు నింపుతుందని, చెక్కుల మంజూరికి కషి చేసిన ఎమ్మెల్యే రమేష్ బాబుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సిరిగిరి చందు, గోలి మహేష్, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, తహశీల్దార్ రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐజేయు కౌన్సిల్ సభ్యులకు ఘన సన్మానం



నవతెలంగాణ - వేములవాడ : ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన రాచర్ల లక్ష్మీనారాయణ, సయ్యద్ లాయక్ పాషా లకు శుక్రవారం ఘన సన్మానం లభించింది. స్థానిక ఇన్ కేబుల్ కార్యాలయంలో ఇన్ కేబుల్ ఎండి నర్సయ్య ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు రాచర్ల లక్ష్మీనారాయణ, లాయక్ పాషా లు మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎనలేని సేవలందిస్తున్న అల్లం నారాయణ నేతత్వంలోని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ తో అనుబంధం ఏర్పడిందని, ఇటీవల హైదరాబాద్ సమీపంలోని పటాన్ చెరులో జరిగిన రాష్ట్ర మహాసభలు, జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో జర్నలిస్టుల హక్కుల సాధన, సమస్యలపై పోరాటం, సంక్షేమ ఫలాలు అందేలా పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు సయ్యద్ తాహేర్ పాషా, రేగుల రాంప్రసాద్, దుర్గం పరశురాం,జిల్లా రమేష్ తో పాటు బూర్ల సందీప్,అబ్బగొని రవీందర్, బండి రజనీకాంత్, బండి శ్రీకాంత్, సంటి రాజేందర్, బండి హరీష్, శ్రీనివాస్ చంద్రమౌళి పాల్గొన్నారు.

రామగుండం ప్రజల సేవకు జీవితం అంకితం

బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాతపల్లి ఎల్లయ్య యాదవ్



నవతెలంగాణ-గోదావరిఖని:రామగుండం ప్రజల సేవకు జీవితం అంకితం చేసిన తనను ఆదరించాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, గోదావరిఖని రైస్ మిల్ హమాలి సంఘం గౌరవ అధ్యక్షులు పాతపల్లి ఎల్లయ్య యాదవ్ కోరారు. సిఎం కెసిఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాతపల్లి ఎల్లయ్య యాదవ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక గౌతమీ నగర్‌లోని రైస్ మిల్ హమాలీ సంఘం కార్మికులకు ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కౌన్సెలర్‌గా ఒక తన వార్డు అభివృద్ధి కోసమే కాకుండా రామగుండం అభివృద్ధి కోసం పని చేయడం జరిగిందని అన్నారు. నియోజక వర్గంలోని ప్రజలకు తాను అనేక సేవా కార్యక్రమాలను చేపట్టానని చెప్పారు. తనకు రాజకీయంగా కూడా ఎంతో అనుభవం ఉందని, ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తనకు క్షుణ్ణంగా తెలుసునని, చేపట్టాల్సిన అభివృద్ధిపై అవగాహన ఉందని చెప్పారు. రామగుండం అభ్యర్థిగా తనకు అన్ని అర్హతలున్నాయని, రానున్న ఎన్నికల్లో తాను టికెట్‌ను ఈ ప్రాంతం నుంచి ఆశిస్తున్నానని, అవకాశం వస్తే ప్రజలు తనను ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్క లక్ష్మణ్, ఒత్తుల ఓదెలు, మొగిలి ఓదెలు, ఎండి.హకీం, పోషం, మాదాసు కొమురయ్య, పెంచాల కనకయ్య బండ రాజయ్య బిఆర్ఎస్ నాయకులు చిప్పకుర్తి తిరుపతి, వెంకన్న తదితరులున్నారు.

ఘనంగా గోదా రంగనాథ స్వామి కళ్యాణం




కళ్యాణం నిర్వహిస్తున్న పూజారులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ధనురామాసంలో భాగంగా గోదా రంగనాథ కళ్యాణం ఆలయ పూజారి వీట్కూరి నవీన్, ఆచార్య బిట్కూరి ప్రహ్లాద్, ఆచార్య దయానంద్ శర్మ, రాచర్ల హనుమాండ్ల శర్మ, గౌరి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదటిలడ్డు వేలంపాట జరుగగా రూ.60116 పాక మురళి దక్కించుకున్నారు. రెండవ లడ్డు 60116లకు బాలరెడ్డి రజితలు దక్కించుకున్నారు. కళ్యాణానికి వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ, గోదా గోష్టి మహిళ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మన్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక కిషన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మెన్ గుండారపు కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మెన్ నంది కిషన్, వైస్ చైర్మెన్ ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి బొమ్మకంటి రవీందర్ గుప్తా, మేగి నర్సయ్య, నేవూరి మమత వెంకటరెడ్డి, వడ్నాల నర్సయ్య, ఎనుగందుల నరసింహులు, అనసూయ, రాగుల మల్లారెడ్డి, గుండాడి వెంకటరెడ్డి, పారుపల్లి రామిరెడ్డి, సంజీవరెడ్డి, దొడ్ల సంజీవ్, మురళి రఘు, మధు, ఉదయ్, బుర్క బాబ్జీ, సిరిగద సంతోష్, నేవూరి రంజిత్‌రెడ్డి, గోదా గోష్టి సభ్యులు, ఉదయమా, బొమ్మకంటి రమ్య, జ్యోతి సమత, కాశవ్వల, లావణ్య శ్రావణి, తేజస్విని పరిసర గ్రామ భక్తులు పాల్గొన్నారు.

26, 27వ తేదీల్లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి



నవతెలంగాణ-గోదావరిఖని : సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 16వ మహాసభలు జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆర్జీ1 బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర 16వ మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం మేదరి సారయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాజారెడ్డి, మంద నరసింహారావు హాజరై మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర 16వ మహాసభలు గోదావరిఖనిలో జరపడం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక పోరాటాలను మరింత ఉదతం చేయడమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కష్టార్జిత సొమ్మును ఇష్టానుసారంగా దోసుకుంటున్న ఈ సమయంలో, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను సింగరేణి బొగ్గు బ్లాక్ లను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా కట్టబెడుతున్న సందర్భంలో, గత మూడు సంవత్సరాల పోరాటాల అనుభవాలను భవిష్యత్తు పోరాటాల రూపకల్పన కోసం 2023 ఫిబ్రవరి 26 27 తేదీలలో రాష్ట్ర 16వ మహాసభలు జరుగుతున్నాయని, మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజా రెడ్డి, అధ్యక్షులుగా సారయ్య ప్రధాన కార్యదర్శిగా మెండె శ్రీనివాస్, కోశాధికారిగా ఆసరి మహేష్ ఈ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ మహాసభల జయప్రదం కోసం సింగరేణి రామగుండం పారిశ్రామిక కార్మికులు, వ్యాపారస్తులు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిఐటియు పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ నారాజు గోపాల్, ఆర్జీ1, అధ్యక్ష కార్యదర్శులు మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, రిటైర్ కార్మిక సంఘం అధ్యక్షులు నర్వట్ల నరసయ్య ఆర్జీ3 కార్యదర్శి డి కొమరయ్య, తోట నరహరిరావు, హైమద్ పాషా, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి భాగ్యరాజు, ఆర్జీ1 ఉపాధ్యక్షులు ఆరేపల్లి రాజమౌళి, బి రఘువరన్, జేల్లా గజేంద్ర, దాసరి సురేష్, అన్నం శ్రీనివాస్, పి రాజేశ్వర చారి, మల్యాల శ్యామల, నంది నారాయణ తదితరులున్నారు.

కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ - రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో 60మందికి, మానాల గ్రామంలో 12మందికి మంజూరైన కళ్యాణలక్ష్మీ చెక్కులను ఎంపీపీ గంగం స్వరూపమహేష్, జెడ్పీటీసీ గట్ల మినయ్య, వైస్ ఎంపీపీ పిసరి భూమయ్య వేరువేరుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లురి మనసా, ఎంపీటీసీ మంచే లావణ్య రాజేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగవత్ తిరుపతి, గ్రామ అధ్యక్షులు దయ్యాల కమలాకర్, నాయిని రాజేశం, అడ్డబోర్ తండా సర్పంచ్ మోహన్, తహసీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంటే రెడ్డి, నాయకులు లక్కకుల రమేష్, చేప్యాల గణేష్, గొళ్ళెం నర్సింగ్, భూమా నాయక్, గెంటే ప్రశాంత్ పాల్గొన్నారు.

క్రీడాల పట్ల యువత ఉత్సాహాన్ని చూపాలి

బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న తోట ఆగయ్య

నవతెలంగాణ - రుద్రంగి

నిజాం కాలం నుండి ఉమ్మడి మానాల గ్రామం పోరాట స్ఫూర్తిని కలిగి ఉందని బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. రుద్రంగి మండలం బడి తండా గ్రామంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పైకా కడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, జెండా ఎగుర వేసి పోటీలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మానాల గ్రామం నైజాం కాలంలో తెలంగాణ విముక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటానికి ఆయుధ శిక్షణకు వేదికై చరిత్రలో నిలిచిందన్నారు. అలాంటి ఉద్యమాల గడ్డ నేడు తెలంగాణ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. ప్రస్తుతం ఈ గడ్డపై యువకులు క్రీడా స్ఫూర్తితో జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఉమ్మడి మానాల గ్రామానికి ఎలాంటి అవసరాలు ఉన్నా స్థానిక శాసన సభ్యుడు, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తక్షణం స్పందించి వాటిని పరిష్కరిస్తున్నారని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్య సాధనకు కృషిచేసి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. క్రీడల పట్ల మక్కువ పెంచుకుని రాణించాలని అన్నారు. కార్యక్రమంలో రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మినయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంటే రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగవత్ తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దప్పుల అశోక్, నాయకుడు గంగం మహేష్, న్యాయవాది బలరాం నాయక్, రుద్రంగి గ్రామ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, సర్పంచ్ మాలి బాయి, ఉపసర్పంచ్ కోటి బాయి, ఎంపీటీసీ గంగి బాయి, నాయకులు గజాన్, రాందాస్ పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చెయ్యండి

సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

నవతెలంగాణ - సుల్తానాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతరమేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 18నుండి నిర్వహించే కంటివెలుగును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శ్రీజ, డాక్టర్ మధుకర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ భాస్కరచారి, కౌన్సిలర్లు పసెడ్ల మమత సంపత్, నిషాద్ రఫీక్, కూకట్ల గోపి, చింతల సునీతరాజు, రెవెల్లి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, గుర్రాల శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు సాజీద్, మేనేజర్ అలిమోద్దీన్, ఏఎన్ఎంలు శారద, సరస్వతి పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగాల రాతపరీక్ష శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ : పోలీసు ఉద్యోగాల కోసం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొంది ఫిజికల్ టెస్ట్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులకు రాత పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన వారినుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ శుక్రవారం మీడియాకి తెలిపారు. ఆర్జీ-2 ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించిన శరీర ధారుఢ్య శిక్షణలో 111 మందికి 71 మంది అభ్యర్థులు ఫైనల్ రాత పరీక్షకు అర్హత సాధించారన్నారు. వారిలో ఆర్జీ-2 ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించే రాత పరీక్ష శిక్షణకు సమ్మతిని తెలియజేస్తూ జీఎం ఆఫీస్ కార్యాలయం పర్సనల్ డిపార్ట్మెంట్‌లో ఈ నెల 16లోపు దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.

దుబ్బపల్లిలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

నవతెలంగాణ - మంథని


బహుమతులు అందిస్తున్న జడ్పీటిసి తగరం సుమలత

మంథని మండలం దుబ్బపల్లి గ్రామంలో సర్పంచ్ నరేష్‌రావు ఆధ్వర్యంలో ముందస్తు మకర సంక్రాంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. జెడ్పిటిసి తగరం సుమలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలోని పాఠశాల ఆవరణలో మహిళలకు పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తగరం శంకర్‌లాల్, ఆడిచర్ల సమ్మయ్య, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ



నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని చీకోడ్ గ్రామంలో గూడెం వాస్తవ్యులు చిట్నేని మాధవి వెంకటేశ్వర్‌రావు వారి గురువు సద్గురు సదానంద శివ జన్మదినం సందర్భంగా 40 మంది నిరుపేద మహిళలకు సంక్రాంతి పండగను పురస్కరించుకుని చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, ఎంపీటీసీ పడిగే సవితఆంజనేయులు, నాయకులు బనుక నాగరాజు, కాంపల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్ గున్నల నాగరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

'బీసీలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం'

నవతెలంగాణ - పెద్దపల్లి : రాష్ట్ర ప్రభుత్వం బీసీలను పట్టించుకోవడంలేదని పెద్దపల్లి జిల్లా మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సెంటినరీ కాలనీ తెలంగాణ చౌరస్తాలో బీసీల సమస్యలపై బిజెపి నాయకుడు, మాజీ ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ మాట్లాడారు. బీసీల సంక్షేమాన్ని మరిచిన టిఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల యువ నాయకులు యాట బుమేష్, తొట్ల రాజు, తీగల శ్రీధర్, కుంట చక్రి, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

సిరిసిల్ల జెడ్పీ చైర్మన్ న్యాలకొండ అరుణ

నవతెలంగాణ - కొనరావుపేట


పనులు ప్రారంభిస్తున జెడ్పీ చైర్‌పర్సన్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాజన్న సిరిసిల్ల జెడ్పీ చైర్మన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొలనూర్ గ్రామంలోని సింగిల్‌విండో కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయడంతో పాటు, దానికి అనుసంధానంగా ఉన్న రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్‌తో పాటు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించిందన్నారు. అంతకు ముందు సింగిల్ విండో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యమున, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్లు సంకినేని రామ్మోహన్రావు, బండ నర్సయ్య, వైస్ చైర్మన్ కాశవేణి మహేష్‌యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, వేములవాడ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రభాకర్, నాయకుడు రాఘవరెడ్డి, డైరెక్టర్లు నాగిరెడ్డి, శ్రీనివాస్. రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ..

షీటీమ్‌లతో అవగాహనా కార్యక్రమాలు

నవతెలంగాణతో జూలపల్లి ఎస్ఐ వెంకటకృష్ణ

నవతెలంగాణ - జూలపల్లి



సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమని, ఇందుకోసం కృషిచేస్తున్నామని జూలపల్లి ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. జూలపల్లి ఎస్ఐ బాధ్యతలు చేపట్టి ఇటీవల ఏడాది పూర్తయిన సందర్భంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడారు.

మండలంలో గతం కంటే క్రైమ్ రేటు తగ్గింది. గస్తీ పోలీస్, సీసీ కెమెరాలు, విలేజ్ పోలీస్‌తో నేరాలను నియంత్రిస్తున్నాం. పోలీసుస్టేషన్ పరిధిలోని జూలపల్లి, ఎలిగేడు మండలాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషిచేస్తున్నాం. ఎక్కువ భూ సమస్యలకు సంబంధించిన క్రైమ్‌లు జరుగుతున్నాయి. రోజువారీగా నెంబర్ ప్లేట్ లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి చాలాన్లు విధిస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్ రోజువారిగా నిర్వహిస్తున్నాం. పాఠశాలల్లో, కళాశాలలో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి షీటీమ్ సేవలు, వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. సీసీ కెమెరాలతో ప్రతి గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నాం. వాటి పనితీరు మెరుగుపరిచే విధంగా అక్కడక్కడ పనిచేయని కెమెరాలను బాగుచేస్తున్నాం. నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాలా బాగుంది. వ్యాపార సముదాయాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పర్సనల్ సీసీ కెమెరాలు కూడా కొనుక్కునే విధంగా నేను సైతం అనే ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ప్రజా సమస్యలను బ్లూ కోర్ట్ కానిస్టేబుళ్ళ తగిన సమయంలో నేర నియంత్రణలో డయల్ 100 ద్వారా తక్షణ చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తున్నారు. అలాగే విపిఒ, విలేజి కానిస్టేబుల్ సమాచారం అందిస్తున్న కార్యచర్యలు, మహిళలకు రక్షణ చర్యల్లో భాగంగా షీటీం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. పెట్రోలింగ్ టీంలు 24 గంటలు గస్తీ కాస్తున్నాయి. అలాగే నిత్యం ప్రజలు పోలీసు వారికి సహకరిస్తూ నేర నియంత్రణ తగ్గించడంలో భాగస్వామ్యం కావాలని కోరారు.

22న రత్నాపూర్‌లో మెగా వైద్య శిబిరం

నవతెలంగాణ - రామగిరి


సర్పంచ్ పల్లె ప్రతిమతో కలిసి స్థలం పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధి రత్నాపూర్ గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఓటు జీఎం గుంజపడుగు రఘుపతి తెలిపారు. శుక్రవారం రత్నాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, డీజీఎం పర్సనల్ విలాస్ శ్రీనివాస్ పొద్దార్, ఎన్విరన్‌మెంట్ అధికారి ఎంఏ.షఫీ, హెల్త్ అధికారి డాక్టర్ కే.పద్మతో కలిసి పరిశీలించారు. ఆర్జీ -3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓసీపీ-1 పబ్లిక్ హియరింగ్ లో భాగంగా పర్యావరణ పరిరక్షణ శాఖ అధికారుల సూచనతో జూలపల్లి, రత్నాపూర్, నాగేపల్లి, పన్నూర్ గ్రామాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ శిబిరంలో ఎండి ఫిజీషియన్, ఎంఎస్ జనరల్, చెస్ట్ ఫిజీషియన్, స్త్రీ వ్యాధి, చర్మవ్యాధి, ఈఎన్‌టి, దంత వ్యాధి, కంటి వ్యాధి నిపుణులు, ఆర్థో ఫిజీషియన్ హాజరవుతారని తెలిపారు. ఉచితంగా రక్త పరీక్షలు, ఈ.సీ.జీ పరీక్షలు నిర్వహిస్తారని, కంటి వ్యాధులకు ఆపరేషన్ల తేదీలు ఖరారు చేస్తామని తెలిపారు. వారివెంట వార్డు సభ్యుడు కొవ్వూరి సురేష్, నాయకులు కొప్పుల రవీందర్‌రావు, సందవెన కుమార్, మండల శంకర్, బెజ్జాల బానయ్య, గాదే మొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

లాలపల్లిలో నేటినుంచి శ్రీ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ - ఎలిగేడు

ఎలిగేడు మండలంలోని లాలపల్లి గ్రామంలో శనివారం నుంచి శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి తెలిపారు. 40 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం మకర సంక్రాంతికి బ్రహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. సోమవారం లగ్న పట్నం, బుధవారం నాగవెల్లి పట్నం, అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా గోదాదేవి కళ్యాణోత్సవం

నవతెలంగాణ - ముస్తాబాద్

మండలంలోని గూడెం, ఆవునూరు, పోతుగల్ గ్రామాలలో వెంకటేశ్వర సీతారాముల ఆలయాలలో శుక్రవారం గోదాదేవి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల కేంద్రంలో కనెమేని బాలవ్వకు మంజూరైన రూ.60వేల చెక్కును బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూంపల్లి సురేందర్‌రావు, మండల సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అందజేశారు. ముస్తాబాద్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ షాదులు పాపా, నాయకులు గూడూరి భరత్, కనమేని శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు.

కంటి వెలుగు కరపత్రాలు ఆవిష్కరణ



నవతెలంగాణ - జూలపల్లి : జూలపల్లి మండలం కాచాపూర్, కుమ్మరికుంట, జూలపల్లి గ్రామాల్లో తెలంగాణ కంటి వెలుగు కంటి పరీక్షల కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు. వివిధ గ్రామపంచాయతీలో ప్రజలకు డాక్టర్లు అవగాహన కల్పించారు. మండల్ స్పెషల్ ఆఫీసర్ రంగారెడ్డి, ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, ఎంపీడీవో వేణుగోపాలరావుతో కలసి ఈ సభలను పర్యవేక్షించారు. డాక్టర్ సంపత్‌రెడ్డి, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, గ్రామాల సర్పంచులు మెచినేని సంతోష్‌రావు, దారబోయిన నర్సింగ్ యాదవ్, బంటు ఎల్లయ్య ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరా పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ల నియామకం



నియామకపత్రాలు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : పెద్దపల్లి జిల్లా మాదిగ హక్కుల దండోరా జిల్లా ఇన్‌చార్జిగా సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్ గ్రామానికి చెందిన వర్కిల రాజయ్య, జిల్లా కన్వీనర్‌గా మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన కల్లేపల్లి కుమార్‌ను నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ శుక్రవారం సుల్తానాబాద్‌లో జరిగిన సమావేశంలో నియామకపత్రాలు అందజేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

నవతెలంగాణ - జూలపల్లి : మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన టి.తిరుపతిగౌడ్‌కు రూ.35వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాంకాళి తిరుపతి, కాచాపూర్ సర్పంచ్ బంటు ఎల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కన్నం రమేష్, మాజీ సర్పంచ్ కనకట్ల కొండయ్య, వడ్లకొండ శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, మహేష్, సమ్మయ్య పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - పెద్దపల్లి

విశ్వబ్రాహ్మణ ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్స్ క్యాలెండర్‌ను అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు అదనపు కలెక్టర్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రోజు రాజేంద్రప్రసాద్, కాసర్ల శ్రీనివాస్, కొండపాక రామ్మూర్తి, బొజ్జ ప్రకాశం, బెజ్జంకి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందంపై దుష్ప్రచారాలు మానండి

ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి


గేట్ మీటింగ్ లో మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ

వేతన ఒప్పందంపై దుష్ప్రచారాలు మానండని ఎస్‌సీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సింగరేణి ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3 సీహెచ్పీ బేస్ వర్క్‌షాప్ లో శుక్రవారం ఎస్.వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 19 శాతం వేతన పెరుగుదలతో 11వ వేతన ఒప్పందం సాధించడం కార్మికుల విజయంగా భావిస్తున్నామన్నారు. గతంలో ఒకటవ కేటగిరి వేతనం 4600 పెరగ్గా 11 వేతన ఒప్పందంలో 6,973.73 రూపాయల వేతనం పెరుగుదల ఉంటుందన్నారు, పదోవేతన ఒప్పందంలో ఒకటవ కేటగిరి బేసిక్ రూ.1011.27ఉండగా 11వ వేతన ఒప్పందంలో, 1502.67 పెరుగుతుందన్నారు. వేతన ఒప్పందాల విషయంలో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బాయి బాట పేరుతోటి సింగరేణి బొగ్గు బ్లాక్‌ల రక్షణ కోసం పోరాడుతున్నమని చెప్తున్న టీబీజీకేఎస్ నాయకులు డీఏ గురించి ఐటీ గురించి, మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో హెచ్ఆర్ఏ 18శాతం చెల్లించాల్సింది 9శాతం చెల్లిస్తున్న కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా, సింగరేణిలో అమలు చేయకుండా, కార్మికులకు నష్టం చేస్తున్నా ప్రశ్నించడం లేదన్నారు. ఇప్పటికైనా సింగరేణి కార్మికుల హక్కుల రక్షణ కోసం తెలంగాణలోని బొగ్గుబ్లాక్‌ల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ అన్ని ట్రేడ్ యూనియన్లు పార్టీలతో, ప్రజలతో కలిసి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్జీ-2 కార్యదర్శి ఉల్లి మొగిలి, ఎస్.రాజన్న, ఏ.భూమయ్య, సీహెచ్ లక్ష్మీనారాయణ, రాజేష్ పాల్గొన్నారు.

బహుజన ముగ్గుల పోటీలు


బహుమతులు అందజేస్తున్న ఉష

నవతెలంగాణ - సుల్తానాబాద్

సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల గ్రామంలో పద్మ హనుమయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుజన ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మ హనుమయ్య ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్, బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్రంలో సంక్రాంతి ప్రత్యేకత చూసే ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పద్మ హనుమయ్య ఫౌండేషన్ సెక్రెటరీ ఎండి సాధిక్, బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేష్, కోశాధికారి గడ్డం శేషాద్రి, అసెంబ్లీ కోశాధికారి తోట మధు, మహిళా కన్వీనర్లు శారద, అరుణ, శోభ, రజినీకాంత్, శ్రీధర్, రమేష్, అరుణ్ పాల్గొన్నారు.

దూళికట్ట గ్రామంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ - ఎలిగేడు



మండలంలోని దూళికట్ట గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించినట్లు ఆమె తెలిపారు. అనంతరం భోగి, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రైజ్ మనీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇరుగురాల సావిత్రమ్మ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీఓ అనిల్‌రెడ్డి, ఉపసర్పంచ్ మధుసూదన్‌రావు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ బహుమతులు అందజేత

నవతెలంగాణ - మంథని


బహుమతులు అందజేస్తున్న సునీల్‌రెడ్డి

మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంథని పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపుపొందిన మహిళలకు చంద్రుపట్ల అనసూయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆయన నగదు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన తిరుమల, ఉమాదేవికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మంథని పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సదశివ్, ప్రధాన కార్యదర్శి సబ్బని సంతోష్, మండల ఇన్‌చార్జి తోట మధుకర్, నాయకులు బోయిని నారాయణ, బోగోజు శ్రీనివాస్, కోరబోయిన మల్లికార్జున్, ఎడ్ల సాగర్, కాసర్ల సూర్య, పార్వతి విష్ణు, పుప్పాల దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ - జూలపల్లి



మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి నిధులు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్టు బీజేవైఎం జిల్లా వైస్ ప్రెసిడెంట్ కంకణాల జ్యోతిబసు తెలిపారు. గ్రామంలో ఉన్న ఎస్సీ కమిటీ హాల్ పూర్తిస్థాయి నిధులు మంజూరు చేయాలని, బస్టాండ్ నుండి అరటి తోట వాగు వరకు పెద్ద డ్రైనేజీని నిర్మించాలని, కురుమపల్లెలో సీసీ రోడ్లను మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు.

'పేదలకు అందని రేషన్ బియ్యం'

నవతెలంగాణ - ఇల్లంతకుంట

సంక్రాంతి పండుగకు పేదలు పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని బిజెపి మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి అన్నారు. రేషన్ షాపుల ముందు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్టంలో పండగ పూట కూడా పేద ప్రజలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వెంటనే ఉచిత రేషన్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తిని స్వామి, బోయిని రంజిత్, నాగసముద్రాల సంతోష్, బండారి రాజ్, మామిడి హరీష్, తిప్పారపు శ్రవణ్, కర్ల లక్ష్మణ్, సుదగోని శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


కందునూరిపల్లిలో గ్రామసభ..

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్



సుల్తానాబాద్ మండలం కందునూరిపల్లి గ్రామంలో శుక్రవారం సర్పంచ్ పన్నాల స్వరూపతిరుపతి ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. జీపిడిపి, కంటి వెలుగు కార్యక్రమం గురించి, 2023-2024 పనులు గుర్తింపు గురించి గ్రామ సభ నిర్వహించిన్నట్లు సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ భయ్యా పద్మకొమురయ్య, గ్రామ కార్యదర్శి రాజకుమార్, వార్డ్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఊహించిన దాని కంటే పెద్ద విజయం


గోపీచంద్ మలినేని

బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో రూపొందిన చిత్రం 'వీరసింహారెడ్డి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీగా నిర్మించిన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై, అన్ని చోట్ల రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో వీర మాస్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించింది.

ఈ నేపథ్యంలో దర్శకుడు గోపీచంద్ మలినేని విలేకరులతో మాట్లాడుతూ, 'ఈ సినిమా ఊహించిన దానికంటే పెద్ద విజయం సాధించడం ఆనందంగా ఉంది. ఈ సినిమాని ఒక అవకాశం కంటే ఒక బాధ్యతగా చేశాను. బాలకృష్ణ 'అఖండ', అన్‌స్టాపబుల్ షోతో మాస్, యూత్, ఫ్యామిలీ అనే తేడా లేకుండా అందరిలోకి వెళ్ళిపోయారు. అలాగే అందరి హీరోల ఫ్యాన్స్ బాలయ్య అభిమానులే. దీన్ని దృష్టిలో పెట్టుకుని, ఆయన గాడ్ ఆఫ్ మాసెస్ ఇమేజ్ , నా ఫ్యాన్ మూమెంట్స్‌తో కలిపి ఈ కథ చేశాను. సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్‌గా సిస్టర్ సెంటిమెంట్ పెట్టాం. అలాగే ఇందులో డైలాగులు కథ నుండి పుట్టాయి. కథలో అంత సహజంగా ఉన్నాయి. కాబట్టే ప్రేక్షకులందరూ ఇంత గొప్పగా ఆదరిస్తున్నారు. 'క్రాక్' తర్వాత మా అబ్బాయి ఇందులోనూ చక్కగా నటించాడు. తమన్ మ్యూజిక్, రామ్‌లక్ష్మణ్ ఫైట్స్, మైత్రీ మూవీ మేకర్స్ మేకింగ్ అత్యద్భుతం' అని అన్నారు.

నవచిత్రం

ప్రతి మహిళ పోల్చుకునే పాత్ర


ప్రియా భవానీ శంకర్

'కళ్యాణం కమనీయం' సంక్రాంతికి విడుదలవుతున్న కుటుంబ కథా చిత్రం. సంతోష్ శోభన్ హీరోగా, ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించింది. యువి కాన్సెప్ట్స్ నిర్మించిన ఈ చిత్రంతో అనిల్ కుమార్ ఆళ్ళని దర్శకుడిగా పరిచయం చేశారు. తన తొలి తెలుగు సినిమా సంక్రాంతికి రిలీజ్ అవుతున్న సందర్భంగా నాయిక ప్రియా భవాని శంకర్ మీడియాతో మాట్లాడుతూ,'యువి వంటి పెద్ద బ్యానర్‌తో తెలుగులో లాంచ్ అవ్వడం చాలా హ్యాపీగా ఉంది. ఇగో సమస్యలు లేని ఒక భార్య భర్త మధ్య జరిగిన సంఘటనలు, వాటితో కూడిన సన్నివేశాలతో చిత్రం ఆద్యంతం అలరిస్తుంది. పనిలేని భర్త శివ, ఉద్యోగానికెళ్ళే భార్య శృతి, ఇద్దరి మధ్య చుట్టూ ఉన్నవాళ్ళ మాటలు, అభిప్రాయాల వల్ల మొదలైన ఒక సమస్య ఎంత దూరం వెళ్ళింది అన్నదే కథాంశం. నేను పోషించిన శృతి పాత్రకి, నాకు దాదాపు 90 % పోలికలున్నాయి. ఈ శృతి పాత్రలో మీ చెల్లెళ్ళు, అమ్మలు, కూతుర్లు అందరూ తమని తాము చూసుకుంటారు' అని చెప్పారు.


ఎస్.నాగవంశీ, విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి

క్రేజీ కాంబినేషన్‌లో సినిమా

విజయ్ దేవరకొండ హీరోగా, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ చేతులు కలిపాయి. విజయ్ కెరీర్‌లో 12వ సినిమాగా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్.నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ప్రకటన సందర్భంగా మేకర్స్ కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో ఓ వ్యక్తి పోలీసు దుస్తుల్లో ముఖానికి ముసుగు ధరించి గూఢచారిని తలపిస్తున్నాడు. దీంతో ఇదొక స్పై ఫిల్మ్ అని పోస్టర్‌ని బట్టి అర్థమవుతోంది. అలాగే సముద్రతీరంలో యుద్ధ సన్నివేశాన్ని తలపించేలా మంటల్లో దగ్ధమవుతున్న పడవలతో పోస్టర్‌ను ఆసక్తి రేకెత్తించేలా రూపొందించారు. చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానున్న ఈ చిత్రంలోని నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను నిర్మాతలు ప్రకటించనున్నారు.

నాన్నని చూస్తుంటే పండగలా ఉంది


సుస్మిత కొణిదెల

చిరంజీవి, రవితేజ, దర్శకుడు బాబీ కొల్లి (కెఎస్ రవీంద్ర) కాంబోలో రూపొందిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి మెగామాస్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేసిన చిరంజీవి తనయ సుస్మిత కొణిదెల మీడియాతో మాట్లాడుతూ, 'దర్శకుడు బాబీ కథ చెబుతున్నపుడు నా ఆలోచనలు చాలా వరకూ మ్యాచ్ అయ్యాయి. వాల్తేరు, పోర్ట్ , ఫిషర్ మ్యాన్ అని చెప్పగానే ఒక ఇమాజినేషన్ వచ్చింది. బాబీ ముఖ్యంగా చెప్పిన విషయం ఏమిటంటే.. మాకు వింటేజ్ చిరంజీవి లుక్ కావాలని చెప్పారు. లుంగీ డిజైన్, ఎక్కడ ఎలాంటి కళ్ళజోడు ఉంటే బావుంటుందనే కొన్ని సూచనలు నాన్న కూడా ఇచ్చారు. 'వాల్తేరు వీరయ్య'గా నాన్నని తెరపై చూసినప్పుడు అద్భుతంగా అనిపించింది. ఒక పెద్ద పండగలా అనిపించింది. లుక్ టెస్ట్ చేసినప్పుడే అమ్మ, రామ్‌చరణ్ ఎలా ఉందో చెప్పేస్తారు. ఇక నిర్మాతగా భవిష్యత్‌లో నాన్నతో సినిమా తీస్తాను. ప్రస్తుతం నాన్నతోనే 'భోళాశంకర్'కి చేస్తున్నాను. అలాగే రెండు వెబ్ సిరిస్‌లపై వర్క్ చేస్తున్నాం. 'శ్రీదేవి శోభన్ బాబు' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది' అని తెలిపారు.

ఆటలు

భారత్ శుభారంభం

- స్పెయిన్‌పై 2-0గోల్స్‌తో గెలుపు
- హాకీ ప్రపంచకప్



బెంగళూరు: హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం రూర్కెలలోని బిర్సాముండా హాకీ స్టేడియంలో జరిగిన పోటీల్లో ఇంగ్లండ్ జట్టు వేల్స్‌ను చిత్తు చేయగా.. రెండో మ్యాచ్‌లో భారతజట్టు స్పెయిన్‌ను ఓడించింది. గ్రూప్-డిలో ఉన్న భారత్ తొలి లీగ్ మ్యాచ్‌ను 8వ ర్యాంక్ స్పెయిన్‌తో తలపడింది. తొలి క్వార్టర్‌లోనే భారత్ ఒక గోల్ కొట్టి 1-0 ఆధిక్యతను సంపాదించింది. ఆ గోల్‌ను రోహిదాస్ చేశాడు. రెండో గోల్‌ను హార్దిక్ సింగ్ 26వ ని.లో చేశాడు. దీంతో ప్రథమార్థం ముగిసే సమయానికే భారత్ 2-0గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. రెండో అర్థభాగంలో స్పెయిన్‌కు లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ అద్భుతంగా నిలువరించి గోల్ చేయకుండా అడ్డుగోడగా నిలిచాడు. మూడో అర్ధభాగంలో భారత్‌కు రెండు పెనాల్టీ కార్నర్‌లు లభించినా ప్రయోజనం లేకపోయింది. 47వ నిమిషంలో అభిషేక్ స్పెయిన్ ఆటగాడ్ని ప్రమాదకరంగా నిరోధించడంతో ఫీల్డ్ అంపైర్ 10నిమిషాలు సస్పెండ్ చేసి మైదానం నుంచి బయటకు పంపాడు. అప్పటినుంచి భారతజట్టు 10మంది ఆటగాళ్లతోనే మ్యాచ్‌ను కొనసాగించింది. 57వ ని.లో మళ్లీ అభిషేక్ మైదానంలోకి రాగా.. 53, 57వ ని.లో స్పెయిన్‌కు పెనాల్టీ కార్నర్లు లభించినా ప్రయోజనం లేకపోయింది. రెండో అర్ధభాగంలో స్పెయిన్ పుంజుకున్నా.. భారత డిఫెండర్లు అడ్డుగోడగా నిలవడంతో స్పెయిన్ ఆశలు అడియాశలయ్యాయి. ఇదే గ్రూప్‌లో ఉన్న ఇంగ్లండ్ తొలి మ్యాచ్‌లో 4-0తో వేల్స్‌ను చిత్తుచేసింది. దీంతో ఇంగ్లండ్, భారత్ 3పాయింట్లతో టాప్‌లో నిలిచాయి. 15న భారతజట్టు ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వడం ఇది వరుసగా రెండోసారి. ప్రతి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి నాలుగుజట్లు నేరుగా క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌లు దక్కించుకోనున్న సంగతి తెలిసిందే.

గ్రెగ్, జెరేమీ హ్యాట్రిక్స్..

పూల్-ఏలో ఆస్ట్రేలియా ఆటగాళ్లు టామ్ గ్రెగ్, జెరెమీ హైవార్డ్ హ్యాట్రిక్ గోల్స్ కొట్టారు. వీరితోపాటు ఫ్లెన్, విక్రమ్ కూడా ఒక్కో గోల్ కొట్టడంతో ఆస్ట్రేలియా జట్టు 8-0గోల్స్ తేడాతో ఫ్రాన్స్‌పై ఘన విజయం సాధించింది. టామ్ గ్రెగ్ 9వ, 32, 45ని., జెరెమీ హైవార్డ్ 27, 29, 39వ ని., హ్యాట్రిక్ గోల్స్ కొట్టగా.. ఫ్లెన్ ఒగీవిర్ 27వ ని., టామ్ విక్రమ్ 54వ ని.లో ఒక్కో గోల్ కొట్టారు. ఆస్ట్రేలియా జట్టు ఎటాకింగ్ ఆటను ప్రదర్శించి ఫ్రాన్స్‌ను గుక్క తిప్పుకోకుండా చేసింది. ఈ మ్యాచ్‌కు కలింగ స్టేడియంలో జరిగింది. ఇదే గ్రూప్‌లో ఉన్న 2016 ఒలింపిక్స్ ఛాంపియన్ అర్జెంటీనా జట్టు దక్షిణాఫ్రికాపై గెలుపుకు చెమటోడ్చాల్సి వచ్చింది. అర్జెంటీనా తరఫున ఏకైక గోల్‌ను 42వ ని.లో కసెల్లా మైకో చేశాడు. దీంతో ఆ జట్టు 1-0తో దక్షిణాఫ్రికాపై గెలిచి ఊపిరి పీల్చుకుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా 14వ ర్యాంక్‌లో ఉండగా.. అర్జెంటీనా 7వ స్థానంలో ఉంది. అర్జెంటీనా తర్వాతి మ్యాచ్‌లో టాప్ ర్యాంక్ ఆస్ట్రేలియాతో 16న తలపడనుండగా.. దక్షిణాఫ్రికా జట్టు ఫ్రాన్స్‌తో అదేరోజు రెండోమ్యాచ్‌లో తలపడనుంది.

హ్యాండ్‌బాల్ ఫెడ్‌కప్ ఛాంపియన్ రైల్వేస్

ట్రోఫీ ప్రదానం చేసిన హ్యాండ్‌బాల్ చీఫ్ జగన్



హైదరాబాద్: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ కప్ ట్రోఫీని పురుషుల విభాగంలో భారత రైల్వేస్ జట్టు, మహిళల విభాగంలో రాజస్థాన్ జట్టు కైవసం చేసుకున్నాయి. గత కొద్దిరోజులుగా రాజస్థాన్‌లో జరుగుతున్న ఈ పోటీలు శుక్రవారం ముగిశాయి. పురుషుల ఫైనల్‌లో రైల్వేస్ 35-25తో సర్వీసెస్ జట్టుపై నెగ్గగా, ఉత్కంఠభరితంగా జరిగిన మహిళల ఫైనల్‌లో రాజస్థాన్ 22-21తో హరియాణాపై గెలిచి ట్రోఫీలను సొంతం చేసుకున్నాయి. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) మాజీ కోశాధికారి ఆనందీశ్వర్ పాండేతో కలిసి, జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్‌ఏఐ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు విజేత జట్లకు ట్రోపీలను, పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడైన హ్యాండ్‌బాల్‌కు దేశంలో ఇప్పుడిపుడే ఆదరణ లభిస్తుందని అన్నారు. కిందటి ఏడాది హైదరాబాద్ వేదికగా ఆసియా క్లబ్ ఛాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించామని.. భవిష్యత్‌లో భారత్ వేదికగా మరిన్ని ప్రతిష్టాత్మక టోర్నమెంట్లను నిర్వహిస్తామని అన్నారు. ఏడాదిన్నరగా తాము చేస్తున్న కృషి ఫలితంగా అంతర్జాతీయ వేదికల్లో భారత యువ జట్లు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు.

2028 ఒలింపిక్స్ కల్లా భారత్ జట్టును ప్రపంచంలోని టాప్-10 జట్లలో ఒకటిగా నిలపాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. ఐఓఏ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) సహకారంతో తప్పనిసరిగా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటామని జగన్‌మోహన్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు.

కనీస వేతనాల జీవోలు విడుదల చేయండి

- రాష్ట్రంలో కార్మికుల సమస్యలు పరిష్కరించండి
- సీఎం కేసీఆర్‌కు సీఐటీయూ బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కనీస వేతనాల జీవోలను విడుదల చేయాలనీ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. శుక్రవారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కోటి మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు, ఇతరత్రా ఖర్చులరీత్యా కనీస వేతనాల సలహా మండలి సిఫారసుల మేరకు ఐదేండ్లకోసారి వేతనాలు పెంచాలని గుర్తుచేశారు. ఎనిమిదేండ్ల నుంచి జీవోలు విడుదల చేయకపోవడం సరిగాదని పేర్కొన్నారు. 2021 జూన్‌లో విడుదల చేసిన ఐదు జీవోలను ఎందుకు గెజిట్ చేయలేదని ప్రశ్నించారు. టీఎస్ ఐపాస్ పేరిట పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చి, తెచ్చిన కంపెనీలలో స్వరాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దొరకడం లేదని వాపోయారు. కాంట్రాక్టు, క్యాజువల్, తాత్కాలిక పద్ధతుల్లో కార్మికులతో యాజమాన్యాలు రోజుకు 12 గంటలు పనిచేయిస్తున్న తీరును, కేవలం రూ.10 వేల నుంచి 12 వేలే జీతాలిస్తున్న వైనాన్ని వివరించారు. చాలా కంపెనీల్లో పీఎఫ్., ఈఎస్ఐ, బోనస్, సెలవులు లాంటి చట్టబద్ధ సౌకర్యాలు అమలు కావట్లేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. స్పెషల్ ఎకానమిక్ జోన్స్ (సెజ్‌ల) పేరిట ఏర్పాటు చేసిన పరిశ్రమలలో కార్మిక చట్టాలు అమలు చేయకుండా, యూనియన్లు పెట్టుకోకుండా అడ్డుకోవటం తగదని పేర్కొన్నారు. బీహార్, యూపీ, ఒడిశా, మధ్యప్రదేశ్, బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కార్మికుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని తెలిపారు. అంతర్‌రాష్ట్ర వలస కార్మికుల చట్టం అమలు చేయకుండా తుంగలో తొక్కుతున్న వైనాన్ని వివరించారు. రాష్ట్రంలో ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు, భవన నిర్మాణ, హమాలీ, బీడీ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను లేఖలో ప్రస్తావించారు. ట్రాన్స్‌పోర్టు రంగంలోని 16 లక్షల మంది కార్మికులకు లబ్ది చేకూర్చే జీవో నెంబర్ 25ని గెజిట్ చేయాలనీ, వారికోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మికులందర్నీ వెల్ఫేర్ బోర్డులో నమోదు చేయాలనీ, లక్ష బైకుల హామీని నెరవేర్చాలని కోరారు. రాష్ట్రంలో లోడింగ్ - అన్‌లోడింగ్, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పని చేసే ఐదు లక్షల మంది హమాలీ కార్మికులకు చట్టపరమైన భద్రత సౌకర్యాలు లేవని వాపోయారు. హమాలీ కార్మికులకు కూడా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ రంగంలో సుమారు 7 లక్షల మంది ఉపాధి పొందుతున్నారనీ, జీవోనెంబర్ 41 ప్రకారం వేతనాలు పెంచి మళ్ళీ దాన్ని పెండింగ్‌లో పెట్టడం తగదని పేర్కొన్నారు. బీడీ రంగంలో పనిచేస్తున్న అన్ని రకాల కార్మికుల వేతనాలు పెంచుతూ జీవోలు ఇవ్వాలనీ, బీడీ కార్మికులందరికీ జీవన భృతి కల్పించాలని కోరారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు త్వరలో షెడ్యూల్



- మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ విడుదలవుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. శుక్రవారం ప్రొగ్రెసివ్ రికగ్నైజ్ డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ సంఘం 2023 డైరీని మంత్రి ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పలు యాజమాన్యాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ బదిలీలు, పదోన్నతులు సంక్రాంతి కానుకగా అందించాలని సీఎం కేసీఆర్‌ను కోరినట్టు మంత్రి వెల్లడించారు. అందుకు సానుకూలంగా స్పందించిన సీఎం, త్వరలో షెడ్యూల్ విడుదల చేయనున్నారని హరీశ్ రావు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, నాయకులు మధు, రంగారావు, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరావు, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

- బీజేపీపై పోరాడాలి
- సీఎం కేసీఆర్‌కు జూలకంటి విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై యుద్ధం చేయాలని కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, సొంత జాగా ఉంటే రూ.మూడు లక్షలు, పోడు భూములు, నిరుద్యోగ సమస్య, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఆర్టీసీ, మిషన్‌భగీరథ కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇలా ఎన్నో సమస్యలను పరిష్కరిస్తా మంటూ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇదే క్రమంలో రాష్ట్ర విభజన చట్టంలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కూడా అనేక హామీలిచ్చిందని పేర్కొన్నారు. విభజన హామీలను సాధించేందుకు కేంద్ర బీజేపీపై పోరాడాలని సూచించారు. ఎన్నికల సంవత్సరం వచ్చిందనీ, బడ్జెట్ సమావేశాలు కూడా రాబోతున్నాయనీ, ఈ నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రానికి బీజేపీ చేస్తున్న అన్యాయాన్ని ఎండగడుతూనే... ఆ పార్టీ తెలంగాణలో బలపడకుండా అడ్డుకోవాలని సూచించారు. బీజేపీని నిలువరించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, ప్రజాస్వామిక శక్తులతో కలిసి మతోన్మాద శక్తులపై పోరాడాలని పిలుపునిచ్చారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.